Estd 1938

# ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 62 • సంచిక: 53 •ఆదివారం 4 మార్చి 2018 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 6.00

•Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad




**ముహూర్తం** శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ తదియ తె. 3.05 వరకు; నక్షత్రం: హస్త రా. 10.15 వరకు, అనంతరం చిత్ర; అమృతకాలం: సా. 4.10 నుండి 5.40 వరకు; వర్జ్యం: ఉ. 6.45 నుండి 8.20 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;



న్యూఢిల్లీ: బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోడీకి సన్మానం



అగర్తల: బీజేపీ విజయోత్సవంలో రాంమాధవ్, బిప్లాబ్ దేబ్. (ఇన్‌సెట్‌లో దేబ్ విజయకేతనం)

| త్రిపుర (59/60) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| సీపీఐఎం+ | 15 |
| భాజపా+ | 44 |
| కాంగ్రెస్ | 0 |
| టీఎంసీ+ | 0 |
| ఇతరులు | 0 |

| మేఘాలయ (59/60) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| కాంగ్రెస్ | 21 |
| భాజపా | 2 |
| ఎన్‌పీపీ | 19 |
| ఎన్సీపీ | 1 |
| ఇతరులు | 16 |

| నాగాలాండ్ (60/60) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| ఎన్‌పీఎఫ్ + | 29 |
| ఎన్‌డీపీపీ + | 29 |
| కాంగ్రెస్ | 0 |
| ఎన్సీపీ | 0 |
| ఇతరులు | 2 |

# కమ్యూనిస్టుల కోటలో కమలం

• కాలం చెల్లిన ఆలోచనలే మార్క్సిస్టుల కొంప ముంచాయి • వామపక్ష కార్యకర్తలకే ఉపాధి అవకాశాలు • వలసల్ని ఆపలేని అసమర్థత • శాంతిభద్రతల అదుపులో వైఫల్యం • అభివృద్ధిలో అధమస్థానం • వ్యూహాత్మక ప్రచారంతో బీజేపీ ముందడుగు

**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి )** డోక్లాం వివాదానాంతరం చైనా-భారత్‌ల మధ్య సంబంధాలు క్షీణించిన సమయంలో త్రిపుర ఎన్నికల ఫలితాలు ఇంతవరకు అక్కడ అధికారంలో ఉన్న సిపిఎమ్‌తో పాటు ఆ పార్టీ పెద్దన్న చైనాకు కూడా వారిపట్ల భారత ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు అద్దంపట్టాయి. త్రిపురలో రెండున్నర దశాబ్దాలుగా సిపిఎమ్ నిర్మించుకున్న కంచుకోట ఈ సారి బద్దలైంది. ఈ రాష్ట్రంలో తొలిసారిగా బిజెపి అధికార పీఠాన్ని అధిష్టిస్తోంది. గతెన్నికల్లో కేవలం 1.76శాతం ఓట్లు మాత్రమే సంపాదించుకున్న బిజెపి ఐదేళ్ళు తిరిగేసరికి మార్క్సిస్టుల ఏలుబడికి చరమగీతం పాడేసింది. చైనా భక్తి పారవశ్యంలో తలమునకలౌతున్న సిపిఎమ్‌ను రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షానికే పరిమితం చేసింది. ఓ పక్క చైనాలో పరోక్ష రాచరిక వ్యవస్థకు నాందిపలుకుతున్న సమయంలో కూడా ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి, వాక్ స్వాతంత్ర్యానికి ముప్పొచ్చేసిందంటూ ఉద్యమాలు చేసే వామపక్షాల్నిక ఈ దేశవాసులు తలకెత్తుకునే అవకాశంలేదన్న విషయాన్ని త్రిపుర ఎన్నికలు తేల్చి చెప్పేశాయి. ఇప్పటికే కమ్యూనిస్టుల కోట పశ్చిమ బెంగాల్ మమత వశమైంది. ఇక దేశంలో ఒక్క కేరళ తప్ప మరే రాష్ట్రంలోనూ సిపిఎమ్ అధికారంలో లేదు. స్వతంత్రమొచ్చేనాటికి ⇨ 3వ పేజీలో...

• 20కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సంఖ్య • త్రిపుర, నాగాలాండ్‌లలో కమల వికాసం • మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు ఎత్తుగడ • కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలపై గురి • 2019 సార్వత్రిక ఎన్నికలపై పెరిగిన ధీమా • త్రిపుర సీఎం పదవి రేసులో బిప్లాబ్ దేబ్ • ఓటర్లను బీజేపీ ప్రలోభ పెట్టిందని సీపీఎం ధ్వజం • వ్యతిరేక ఓటు ఏమైందని ప్రశ్న • సమీక్షించుకొని నష్ట నివారణ చర్యలు చేపడతామని పొలిట్ బ్యూరో ప్రకటన 5

శూన్యం నుంచి శిఖరాగ్రానికి బీజేపీ ప్రస్థానం.. ప్రధాని మోడీ విజయోత్సాహం... మోడీకి బీజేపీ కార్యాలయంలో సన్మానం.

## పాత.. కొత్త పథకాలతో
# జనం బడ్జెట్



• ప్రాధాన్యతా రంగాలను విస్మరించొద్దు
• ప్రాజెక్టులే రాష్ట్రానికి జీవనాడి
• ఇరిగేషన్ రంగానికి పెద్దపీట
• నిధులకు వెనకాడొద్దు
• బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రజల ఆకాంక్షలకను గుణంగా రూపుదిద్దుకుంటున్న బడ్జెట్ విషయంలో ప్రాధా న్యతా రంగాలను విస్మరించరాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. తాజా బడ్జెట్ ప్రజల ఆమోదం లభించేదిగా వుండాలని అభిప్రాయపడ్డారు. 2018-19 వార్షిక బడ్జెట్‌కు తుదిరూపు ఇస్తున్న నేపథ్యంలో ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం తాజా ప్రతిపాదనలను సమీక్షించారు. కొన్ని ప్రాధాన్యత కలిగిన అంశాలపై దిశానిర్దేశం ⇨ 7వ పేజీలో...

## చంద్రబాబు త్రిముఖ వ్యూహం

• రాష్ట్ర ప్రయోజనాలపై రాజీలేని దిశగా కసరత్తు ముమ్మరం

**అమరావతి, ఆంధ్రప్రభ:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడంచెల సమరానికి సమాయత్తమయ్యారు. ఆ దిశగా కసరత్తు ముమ్మరం చేశారు. పార్లమెంట్‌తోపాటు క్షేత్రస్థాయిలోనూ ఆందోళన కార్యక్రమాలు యధావిధిగానే కొనసాగుతాయని ప్రకటించిన ముఖ్యమంత్రి, లక్ష్యసాధనలో భాగంగా మూడు దశలలో పోరాటాన్ని రక్తి కట్టించాలని నిర్ణయించారు. దశాబ్దాల బంధాన్ని ఒకేసారి తెంచుకోకుండా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీజేపీతో జత కలిసి ⇨ 2వ పేజీలో...

# ఏపీకి చాలా రావాలి



• నాలుగేళ్లలో ఇచ్చింది రూ.14 వేల కోట్లే • ఇంకా రూ.74, 542 కోట్లు రావాలి • లెక్కలు తేల్చిన జేఎఫ్‌సీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కింద 2014నుంచి ఇప్పటివరకూ రూ.14వేలకోట్లు మాత్రమే ఇచ్చిందని జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వెల్లడించింది. ఏపీపునర్ విభజన చట్టంలో ఇచ్చిన హామీలో మేరకు ఏపీకి ఇంకా 74542కోట్లు కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని వివరించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏపికి రావాల్సిన , వచ్చిన నిధులపై అధ్యయనం చేసి తుది నివేదికను సిద్ధం చేసింది. శనివారం హోటల్ ఆవాస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జనసేన అదినేత పవన్ కల్యాణ్‌తోపాటు జేఎఫ్‌సి సభ్యులు జయప్రకాశ్ నారాయణ, ఉండవల్లి అరుణ్ కుమార్, పద్మనాభయ్య , ఐవైఆర్ కృష్ణారావు, తోట చంద్రశేఖర్ జాయింట్ ఫ్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ నివేదికను విడుదల చేశారు. విభజన చట్టంలో 11 ప్రధాన ⇨ 2వ పేజీలో...

## హోదా ఒక్కటే మార్గం


• ప్రజల్లో అయోమయం సృష్టించొద్దు • నాలుగేళ్లుగా ఉదాసీనత ఎందుకు? • హోదా అని చెప్పి ప్యాకేజీని తెరపైకి ఎందుకు తెచ్చారు: పవన్ కల్యాణ్ 2





## హెచ్-1బి భాగస్వాములకు ఊరట

వర్క్ పర్మిట్లపై నిర్ణయంలో ఆలస్యం 6





## దేశ రాజకీయ గతి మారాలి
# నేనే నడుం బిగిస్తా!

• ఇప్పటికే చర్చలు ప్రారంభించా • బీజేపీ పోతే కాంగ్రెస్... కాంగ్రెస్ పోతే బీజేపీ • 70 ఏళ్లుగా ఇదే రాజకీయమా? • పథకాల పేర్లు మార్పులు తప్ప వీళ్లు చేసేందేమిటి? • దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు • తప్పకుండా తెచ్చి చూపిస్తా • మీడియా సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భారత దేశ రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది. రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరముంది. కాంగ్రెస్ పోతే బిజెపి.. బిజెపి పోతే కాంగ్రెస్ ... 70ఏళ్ళుగా ఇదే రాజకీయమా? దేశ ప్రజలంతా గుణాత్మక మార్పు కోరుకుంటున్నారు.. అవసరమైతే ఆ మార్పుకు నేనే నాయకత్వం వహిస్తా అంటూ తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంచలన ప్రకటన చేశారు. దేశ రాజకీయగతిని మార్చేందుకు జాతీయ రాజకీయాల్లోకి రాబోతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు గర్వపడేలా దేశరాజకీయ గమనాన్ని మారుస్తానన్నారు. శనివారం టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేతలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి నాయినినర్సింహారెడ్డిలతో పాటు పార్టీ ఎంపీలతో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి దొందూదొందేనన్నారు. పథకాల పేర్లు ⇨ 7వ పేజీలో...




హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మీడియా సమావేశంలో కేసీఆర్

## ఆంధ్రకు అన్యాయం చేస్తున్నారు

• తెలుగు రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు తగదు • చంద్రబాబుతో కలిసి ముందుకు సాగుతా • హక్కుల కోసం పోరాడుతా: కేసీఆర్ 7

## గత ప్రభుత్వ హామీలకు
# కట్టుబడాల్సిందే!

• ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎంతో అవసరం • జేఎఫ్‌సీ నివేదిక పూర్తిగా సహేతుకం • జస్టిస్ గోపాల గౌడ నిశితాభిప్రాయం



**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి:)** చట్టసభ వేదికగా ఒక మంత్రి చేసిన ఏ ప్రకటనకైనా చట్టబద్దత ఉంటుంది. మంత్రి హోదాలో చేసిన ఈ ప్రకటన తదుపరి కాలంలో ఆయన మంత్రిగా ఉన్నా లేకున్నా సరే అమలుచేయాల్సిందే. ఇక సాక్షాత్తు ప్రధానమంత్రే అత్యున్నత చట్టసభ వేదికగా చేసిన ప్రకటనకు తదుపరి ప్రభుత్వాలు కూడా లోబడుండా ల్సిందే. ఇలాంటి ప్రకటన ఏదైనా దాన్ని చట్టబద్ధంగా అమలు చేయాల్సిందే. ఈ బాధ్యత నుంచి తదుపరి ప్రభుత్వాలు తప్పించుకోజాలవంటూ భారత సర్వోన్నత న్యాయస్థానం రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అభిప్రాయ పడ్డారు. యుపిఎ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కిస్తానన్న ప్రత్యేక హోదా అంశంపై ఆయన తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. సింగూరులో కార్ల తయారీ పరిశ్రమ కోసం భూముల కేటాయింపుపై జరిగిన వ్యాజ్యాలకు సంబంధించి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయనిచ్చిన తీర్పులు చరిత్రలో నిల్చిపోయాయి. మొదట్నుంచి గోపాలగౌడ ప్రజాజడ్జిగా గుర్తింపు పొందారు. ఇటీవలె జనసేనాని పవన్‌కళ్యాణ్ ఏర్పాటు చేసిన సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జెఎఫ్‌సి)లో జస్టిస్ గౌడ కూడా సభ్యుడిగా ఉన్నారు. రెండ్రోజుల పాటు సమావేశమై చర్చించిన అనంతరం జెఎఫ్‌సి ఒక అధ్యయన నివేదికను ప్రత్యేక దూత ద్వారా జస్టిస్ గౌడకు పంపించింది. దీన్ని పరిశీలించిన ఆయన ⇨ 3వ పేజీలో...



## స్వర్ణానికి సంస్కరణలు!

పన్నుపై గణనీయమైన కోతలు 'స్వర్ణ చలామణి'కి కొత్త ఊపిరి 6

# శాశ్వత సేవలకే ఎన్టీఆర్ ట్రస్ట్

**●మార్గదర్శకంగా కార్యకలాపాలు ●ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా ఉండాలి**

**●ట్రస్ట్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భావితరాలకు సేవా కార్యక్రమాలను అందించడంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆదర్శంగా ఉండాలన్నదే తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు అన్నారు. ఈ ట్రస్టు ద్వారా చదివే విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలబడాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతిఒక్కరిలో సేవాస్ఫూర్తిని నింపాలన్నారు. ఇరవై సంవత్సరాల క్రితం ఎన్టీఆర్ పేరుమీద ట్రస్టును ఏర్పాటు చేసి....సేవారంగంలో ఒక నూతన వొరవడిని తీసుకురావాలన్న లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు తెలిపారు. ఆ దిశగా ఎన్టీఆర్ ట్రస్టు ముందుకు సాగుతుండడం సంతోషంగా ఉందని అన్నారు.

శనివారం గంటిపేటలో ఎన్టీఆర్ మోడల్ పాఠశాలలో ట్రస్టు 20వ వార్షికోత్సవం, ఎన్టీఆర్ స్కూల్, కాలేజీ వార్షికోత్సం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, ఎన్టీఆర్ పేరుతో ప్రజలకు శాశ్వతంగా సేవలు అందించాలన్న లక్ష్యంతో ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా 13 సంవత్సరాల క్రితం ఎన్టీఆర్ మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసి ప్రస్తుతం రెండువేల మంది విద్యార్థులకు ఉత్తమ విద్యాభోదనను అందిస్తున్నామన్నారు. స్కూల్ వార్షికోత్సవానికి రావడం తీపీ జ్ఞాపకంగా మిలిగిపోతుందన్నారు. పేద వర్గాలకు చెందిన పిల్లలు, తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన వారి కుటుంబాల పిల్లల జీవితాలకు బంగారు బాట వేసే రీతిలో ఎన్టీఆర్ మోడల్ పాఠశాల పని చేస్తోందన్నారు. గతంలో పిల్లలకు పాఠాలు చెబుతుండే ఈ స్థలంలో ప్రస్తుతం పిల్లలకు పాఠాలు చెబుతుండడం సంతోషకరమన్నారు. తాను గతంలో ఇక్కడే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు రేకుల షెడ్‌కిందనే పనిచేసే వాడినని ఆయన గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాను చదువుకోడానికి వాగులు, వంకలు, అడవుల గుండా కిలోమీటర్ల దూరం నడిచేవాడనని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ మోడల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చాలా అదృష్టవంతులని.... కిలోమీటర్ల చొప్పున నడవాల్సిన పనిలేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువును భారంగా కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. అప్పుడే ఏ రంగంలోనైనా రాణించేందుకు అవకాశముంటుందన్నారు. ఇందులో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి...వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులుగా పిల్లలకు ఎంత సంపాదించి ఇచ్చామన్నది ముఖ్యము కాదని.....మంచి చదవు... సంస్కృతిని ఇస్తేచాలన్నారు. వారే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. అందుకే

తాను సమైఖ్యాంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ....ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నానన్నారు. మోడల్ పాఠశాలలో 75 శాతం విద్యార్థినులు, 25శాతం మాత్రమే విద్యార్థులు ఉండడం మరింత ఆనందాన్ని ఇస్తుందోన్నారు. ప్రస్తుతం ఆడపిల్లలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడుతూ...అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారన్నారు. ప్రస్తుతం కట్నకానుకలు ఇచ్చి మహిళలకు వివాహాలు జరుగుతున్నాయని....కాని భవిష్యత్తులో ఎదురుకట్నం ఇచ్చి మహిళలను పెళ్ళి చేసుకునే పరిస్థితి రానుందన్నారు. అందుకే మహిళల శక్తిసామర్థ్యాలను గ్రహించిన ఎన్టీఆర్ వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించారన్నారు. ఆస్తిలో సమానహక్కు కల్పించడంతో పాటు ఉన్నత చదవుల కోసం ప్రత్యేకంగా మహిళా యూనివర్సిటీని తిరుపతిలో ఏర్పాటు చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన చూపిన బాటలో తాను ముందుకు సాగుతూ....మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసేందుకు ప్రత్యేకంగా డ్వాక్వా సంఘాలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున రుణాలను మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తించారు.

అంతకుముందు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరీ మాట్లాడుతూ , సామాజిక దృక్పదంతో ఎన్టీఆర్ ట్రస్టను స్థాపించడం జరిగిందన్నారు. విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుకుంటూ విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అవలర్చుకోవాలన్నారు. 2005లో 130 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 1906కు చేరిందన్నారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఎన్టీఆర్ మోడల్ పాఠశాలలో కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ బ్రాహ్మణి, ట్రస్టు సీఇవో విష్ణువర్ధన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.






బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో బాలకృష్ణ తదితరులు

# రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

**●కేంద్ర ప్రభుత్వ పెద్దలతోనూ మంతనాలు**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక హోదా ఉద్యమం ఊపందుకుంటున్న కీలక సమయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హస్తిన పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. శనివారం ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు హోంశాఖ అధికారులతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన ఒకనివేదికను అందజేసినట్టు సమాచారం. విభజన సమస్యలపై రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, పరిణామాలపై గవర్నర్ ఈ నివేదికను రూపొందించినట్టు తెలుస్తోంది. సోమవారం అమిత్ షా తెలుగుదేశం పార్టీ నేతలను చర్చలకు ఆహ్వానించిన నేపథ్యంలో గవర్నర్ నివేదిక కీలకంగా మారింది.

ఈ నివేదికను ఆధారంగా చేసుకుని తెలుగుదేశం నేతలతో అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తదితరులు చర్చించే అవకాశం ఉంది. కేవలం ఆంధ్రప్రదేశ్ అంశాలకే పరిమితం కాకుండా తెలంగాణ అంశాలపైనా కేంద్రం గవర్నర్ నుంచి వివరాలు రాబట్టినట్టు తెలుస్తోంది. వీటితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాలు, అంశాలపైన కూడా గవర్నర్ నుంచి వివరాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. షెడ్యూల్ 9, 10 సంస్థల ఉద్యోగుల విభజన, రాష్ట్రం వెలుపల ఆస్తుల విభజన విషయంలో ఇప్పటికీ రెండు రాష్ట్రాల మధ్య అనేకాంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. విభజన సమస్యల పరిష్కారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులను ఢిల్లీకి రావాల్సిందిగా గతంలోనే కేంద్ర ప్రభుత్వం పిలిచిన విషయం తెలిసిందే. అయితే కేంద్రం నిర్ణయించిన తేదీన రావడం వీలుపడదని తెలంగాణ అధికారులు చెప్పడంతో, ఈ సమావేశం కూడా మార్చి 5కు వాయిదా పడింది. సోమవారం జరగనున్న ఈ సమావేశం నేపథ్యంలోనే ఉమ్మడి గవర్నర్ నరసింహన్‌ను ముందుగానే ఢిల్లీకి పిలిపించి నివేదికను తీసుకున్నట్టు తెలుస్తోంది. గవర్నర్ నివేదిక ఆధారంగా హోంశాఖ కసరత్తు చేసి సోమవారం జరగనున్న రెండు వేర్వేరు సమావేశాలకు సిద్ధమవనుంది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యాదర్శులతో జరిగేసమావేశంతో పాటు అమిత్ షా పిలుపు మేరకు జరగనున్న రాజకీయ సమావేశం గురించి కూడా హెూంశాఖ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# హోదా ఒక్కటే మార్గం

**●ప్రజల్లో అయోమయం సృష్టించొద్దు ●నాలుగేళ్లుగా ఉదాసీనత ఎందుకు?**

**●హోదా అని చెప్పి ప్యాకేజీని తెరపైకి ఎందుకు తెచ్చారు: పవన్ కల్యాణ్**




**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. శనివారం జేఎఫ్‌సీ సమావేశంలో మీడియాతో మాట్లాడిన ఆయన చంద్రబాబు మీద పలు విమర్శలు చేశారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చంద్రబాబు ఉదాసీనంగా ఎందుకు ఉన్నారంటూ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని, అయోమయానికి గురిచేస్తున్నారని తెలిపారు.

ప్రత్యేక హోదా అని చెప్పిన టీడీపీ నేతలు ప్యాకేజీని ఎందుకు తెరపైకి తీసుకొచ్చారని ప్రశ్నించారు. ప్రత్యేక ప్యాకేజీ అంటే పాచిపోయిన లడ్డుతూ సమానమని, విభజన హామీలు అమలు చేయకపోతే ప్రజల్లో అశాంతి పెరుగుతుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా వస్తుం దంటే తాను నమ్మనని, చంద్రబాబు అనుభవజ్ఞులనే ప్రజలు మద్దతు ఇచ్చారని, కానీ పరస్పర విరుద్ధ ప్రకటనలతో రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర విభజనలో నేతల పాత్రే తప్ప, ప్రజల పాత్ర లేదంటూ వ్యాఖ్యానించారు. తనను బీజేపీ, టిడిపి పార్టీల భాగస్వామిగా భావించారని, ఇప్పుడు వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వచ్చిందన్నారు. నాలుగేళ్లుగా రెండు ప్రభుత్వాలు ఏపీకి అన్యాయం చేస్తున్నాయని, చంద్రబాబు ప్రభుత్వం, నేతలు కేంద్రానికి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావటంలేదని వ్యాఖ్యానించారు. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రభుత్వాలు సమాధానం చేప్పాలని పవన్ డిమాండ్ చేశారు.

ప్రత్యేక హోదాతో సమానమైనది ఏదీ లేదని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. నాయకులు ప్రజల్ని వాడుకొని వదిలేస్తున్నారే తప్ప వారికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిధులను పెంచి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పోలవరం పూర్తి చేయకపోతే ఆనింద ఏపీ ప్రభుత్వానిదేనన్నారు. 11జాతీయస్థాయి విద్యాలయాలకు రావాల్సిన నిధుల్లో కేవలం 5శాతం మాత్రమే ఇచ్చారని, విభజన హామీల్లో ఒకటైన విశాఖ రైల్వేజోన్‌పై ఎందుకు ప్రకటన చేయలేదని ప్రశ్నించారు. కేంద్రం ఏదీ సాధ్యం కాదని చెపుతోందని, ఇంకా ఏది సాధ్యమౌవుతుందని నిలదీశారు. విజయవాడ, విశాఖ మెట్రో రైలు ఎందుకు వర్తించదని, సాధ్యం కాదంటూనే రాష్ట్రాన్ని విభజించారు కదా అంటూ నిలదీశారు. పార్లమెంట్‌లో ఇచ్చిన మాట మరిస్తే ప్రజలను పాలించే అర్హత కోల్పోతారని విమర్శించారు.

(మొదటిపేజీ తరువాయి)

# చంద్రబాబు త్రిముఖ వ్యూహం

వచ్చే ఎన్నికలకు వెళ్ళబోమనే సంకేతాలను ఇచ్చారు. బీజేపీ తీరు ఆంధ్రప్రదేశ్‌ను, తెలుగు ప్రజలను అవమానించే విధంగా వున్నదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తదుపరి చర్యగా విభజన సమస్యలకు సంబంధించి కేంద్రప్రభుత్వంపై కేసు వేసే దిశగా కసరత్తు ప్రారంభించారు. మిత్రపక్షంగా కొనసాగుతూనే కేంద్ర ప్రభుత్వంపై అత్యున్నత న్యాయస్థానంలో కేసు వేస్తే దాన్ని కేంద్రం తీవ్రమైన విషయంగా భావిస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. ఫలితంగా దేశ ప్రజల దృష్టిని ఆకర్షించనున్న ఈ ఎత్తుగడతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దిగి వస్తారనే వ్యూహ రచనకు సిద్ధమయ్యారు. కోర్టుకు వెళ్ళినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాని పక్షంలో రెండవ అస్త్రంగా కేంద్ర ప్రభుత్వం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులచే రాజీనామా చేయించాలనే వ్యూహంతో వున్నారు. ఎన్డీయేలో ఇప్పటికే అతిపెద్ద భాగస్వామి అయిన శివసేన తప్పుకున్న నేపథ్యంలో అనంతరం అతిపెద్ద భాగస్వామి అయిన తెలుగుదేశం కూడా సీరియస్‌గా వ్యవహరిస్తే బీజేపీ పెద్దలు దిగిరాకతప్పని పరిస్థితులను సృష్టించాలని భావిస్తున్నారు. కేంద్ర మంత్రిమండలి నుంచి తప్పుకున్నప్పటికీ కేంద్రంలో చలనం లేని పక్షంలో మూడవ అస్త్రంగా ఎన్డీయే నుంచి తప్పుకోవాలనేది మరో వ్యూహంగా మారింది. టీడీపీ నిర్ణయం వాస్తవరూపం దాల్చినపక్షంలో దేశవ్యాప్తంగా చర్చను లేవనెత్తడానికి ఆస్కారం ఇవ్వడం ద్వారా భారతీయ జనతా పార్టీని బలహీనపరచాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు నిర్ణయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మూడు దశల వ్యూహాత్మక పోరుతో కేంద్రంతో దిగిరాకపోతే ఇక క్షేత్రస్థాయిలో తాడోపేడో తేల్చుకోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్టు తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.


### ఇంత అవమానమా?

సాక్షాత్తూ భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సమక్షంలో జరిగిన సమావేశంలోనూ తమ నేతలకు అవమానం జరిగిందనే అభిప్రాయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులో నెలకొంది. అమిత్‌షాకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు అన్ని సమస్యలు వివరించినప్పటికీ సానుకూలమైన నిర్ణయం రాలేదని, చెప్పిందంతా విని నిర్వేదాన్ని ప్రకటించడం విడ్డూరంగా వున్నదని ముఖ్యమంత్రి అభిప్రాయంగా వుంది. ఆ భేటీలో పాల్గొన్న ఎం.పి. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు కూడా అమిత్‌షా తీరుపై అసహనాన్ని ప్రకటించడం విశేషం. తాము ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నెల రోజులు దాటిందని, కానీ రెండు రోజుల క్రితం చర్చల నిమిత్తం వెళ్ళిన ప్రతినిధులకు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడమేమిటని ముఖ్యమంత్రి ఎంపీల భేటీలో ప్రశ్నించడం ద్వారా అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి ఇంకా తమకు రావల్సినవీ, పెండింగ్‌లో వున్నవాటిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు విపులంగా వివరించారు. ఈ నేపథ్యంలో అమిత్‌షా వైఖరి చూస్తే అసలు ఏపీకి సహాయం అందేలా లేదని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించడం విశేషం. ఎంపీల భేటీలో ఇదే విషయమై రామ్మోహన్ నాయుడు తన అనుభవాన్ని వివరించారు. ఈ క్రమంలోనే బీజేపీతో ఒకేసారి కాకుండా దశలవారీగా, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్ళాలని, ఎప్పుడు ఏ విధంగా ముందుకు వెళ్ళాలో తాను చెబుతానని చంద్రబాబు ప్రకటించారు. పార్లమెంట్ స్థాయిలో పోరాటం ముగిశాకే తదుపరి కార్యాచరణను అమలులోకి తేవాలని నిర్ణయించారు.

### మెట్టు దిగేనా...

కాగా ముఖ్యమంత్రి పోరాట పంథాను ఎంచుకున్న పరిస్థితులలో బీజేపీ పెద్దలు మెట్టు దిగారనే వార్తలు వస్తున్నాయని, అయితే పరిస్థితి ఇంతదాకా వచ్చాకా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ప్రకటించారు. కోర్టు బంతి కేంద్రం చేతిలోనే వుందని, ఇప్పటికైనా విభజన సమస్యలపై నిర్లక్ష్యం చేసిన పక్షంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే భారతీయ జనతా పార్టీకి కూడా పడుతుందని ముఖ్యమంత్రి ప్రకటించడం విశేషం. మూడు దశలుగా ఒత్తిడి పెంచే వ్యూహాన్ని ఇప్పటికే పార్లమెంట్ సభ్యులకు వివరించిన ముఖ్యమంత్రి, మరోవైపు అమిత్ షా మనోగతాన్ని వివరించారు.

అధినేత ఏది చెప్పినా పాటించేందుకు తాము సిద్ధంగా వున్నామని ప్రకటించిన ఎంపీలు పదవులకు రాజీనామాలకు సైతం వెనుకాడబోమనే సంకేతాలను ఇచ్చారు. సమావేశంలో స్వేచ్ఛగా అభిప్రాయాలు వెల్లడించిన ఎంపీలు పార్లమెంట్‌ను స్తంభింపజేయడం, జాతీయ, ప్రాంతీయ పార్టీలను కలుసుకోవడం, లేఖలు అందజేయడం వంటి కార్యకలాపాలకు సిద్ధమంటూ ప్రకటించారు.



**12 వరకూ వేచిచూసే ధోరణి**

ఇప్పటికే ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన ముఖ్యమంత్రి మరోవైపు మార్చి 12వ తేదీదాకా వేచిచూసే ధోరణిని అవలంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమావేశంలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.దినేష్‌కుమార్‌తో పాటు మరో నలుగురు అధికారులు కూడా పాల్గొననున్నారు. విభజన అంశాలు, నిధులు, ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్పించనున్నారు. ఈ భేటీలో కొన్ని కీలకమైన అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయనే ఆశాభావంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

# ఏపీకి చాలా రావాలి

అంశాలను ప్రధానంగా ముందుకు తెచ్చినట్టు నివేదికలో వెల్లడించారు. కేంద్రప్రభుత్వం తమకు ఏవిధమైన సమాచారం ఇవ్వలేదని నివేదికలో ఉన్న సమాచారం అంతా రాష్ట్రప్రభుత్వం నుంచి సేకరించినదే అని జయప్రకాశ్ నారాయణ వివరించారు. అయినప్పటికీ ఇది అంసంపూర్ణ సమాచారమే అన్నారు. 2014-15లో రెవెన్యూ లోటు రూ16078కోట్లు ఉండేది. ఇందులో వ్యవసాయ రుణాల తిరిగిచెల్లింపులకు సంబందించి రూ.3068కోట్లు డిస్కంలకు చేయూతగా రూ. 1500 కోట్లు,వృద్ధాప్య పెన్సన్లకు రూ.3391కోట్లు రాష్ట్రప్రభుత్వంపై అదనపు భారం పడింది. ఈ నాలుగు అంశాలకు నిధులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించలేదని జేపి వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన పథకాలు, విదేశీరుణాలలో చేపట్టిన పథకాలకు ,పన్నుల రాయితీలకు సంబంధించి ఈ మూడు అంశాల్లో కేంద్రం నుంచి రూ.16447కోట్లు కేంద్రం నుంచి రావాలని వివరించారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల కింద రూ.24350కోట్లకు ప్రతిపాదనలు పంపారని, జిల్లాకు 50కోట్లు ఇస్తే ఏమూలకు చాలవన్నారు.వీటికింద ఇంకా రూ.22250కోట్లు కేంద్రం నుంచి రావాలన్నారు. విశాఖ పట్నం -చెన్నై కారిడార్‌కు రూ.6020కోట్లు, పెట్రోకారిడార్‌కు రూ5000కోట్లు, జాతీయ సంస్థలకు 1500కోట్లు ఇవ్వాలన్నారు. రాజధానికి సాయంకూడా రాలేదన్నారు. కమిటీ కన్వీనర్ పద్మనాభయ్య మాట్లాడుతూ కేంద్రం నుంచి ఏపీకి ఇప్పటివరకూ రెవెన్యూలోటు కింద రూ4118కోట్లు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కింద రూ2110కోట్లు, జాతీయ సంస్థల అభివృద్ధికి రూ.853కోట్లు, రాజధాని నిర్మాణాలకు రూ1050కోట్లు, పోలవరం కోసం 4932కోట్లు మాత్రమే ఇచ్చినట్లు వివరించారు. రాజధాని అమరావతికి రోడ్ కనెక్టివిటీని పెంచేందుకు చేసిన ప్రతిపాదనలకు కూడా నిధులు లేవన్నారు. కొన్ని ఇంకా డీపీఆర్ దశలోనే ఉన్నట్టు వివరించారు. ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ ఏపికి ఇచ్చిన నిధుల వివరాలు కావాలని కోరినప్పటికీ కేంద్రం నుంచి ఏ సమాచారం రాలేదన్నారు. షెడ్యూల్ జాబితాలో ఉన్న పది ప్రధాన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని వీటికి ప్రత్యామ్నాయంగా ఏపీలో సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. ఉండవల్లి ఆరుణ్ కుమార్ మాట్లడుతూ కమిటీ రిపోర్ట్‌ను కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏపీని ముంచాయని తన వ్యక్తిగత అభిప్రాయంగా పేర్కొన్నారు. టీడీపీ, బీజేపి సంకీర్ణ ప్రభుత్వాల పట్ల కమిటీ తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది.

# ఏప్రిల్ 10 డెడ్‌లైన్

**●తేల్చిచెప్పిన ఎంపీ మురళీమోహన్**



**రాజమహేంద్రవరం, ప్రభ న్యూస్ బ్యూరో:** బీజేపీతో తాము కొనసాగేదీ లేనిదీ ఏప్రిల్ 10లోగా తేలిపోతుందని రాజమహేంద్రవరం ఎంపీ మురళీ మోహన్ తేల్చిచెప్పారు. శనివారం ఆయనిక్కడ మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో తాము పార్లమెంట్‌ను స్థంభింపజేస్తామన్నారు. సమావేశాలు పూర్తయ్యేలోగా హోదాపై కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వస్తుందని భావిస్తున్నామన్నారు. ఏప్రిల్ 10 వరకు తాము వేచిచూస్తామని, అంతవరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. అప్పటికీ కేంద్రం తేల్చని పక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తారన్నారు. బీజేపీతో కొనసాగడం కంటే తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఎంపీ స్పష్టం చేశారు.

# తొలిరోజే రాజీనామాలు చేయండి

**●తెదేపా కేంద్ర మంత్రులకు జగన్ సవాల్ ●పవన్ సవాల్‌ను స్వీకరిస్తున్నాం ●అవిశ్వాస తీర్మానానికి టీడీపీ మద్దతు కూడగట్టాలి**

**ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మ్యాచ్ ఫిక్సర్ అని, చివరకు ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారని వైసీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తాళ్లూర్లులో జరిగిన బహిరంగ సభలో ఉద్వేగభరితంగా మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించాలని, ఈనెల 21న కేంద్ర ప్రభుత్వంపై తమ పార్టీ పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకాలని, ఏప్రిల్ 6న ఎంపీలందరూ రాజీనామా చేసేలా చూడాలని జగన్ డిమాండ్ చేశారు. చంద్రబాబు మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ సలహా మేరకే తాము అవిశ్వాస తీర్మానం పెడుతున్నామని, తెలుగుదేశం మద్దతు ఇచ్చేలా ఆయన చూడాలని జగన్ కోరారు.

ప్రత్యేక హోదా పోరు తుది దశకు చేరిందని, ఈనెల 1న కలెక్టర్ల వద్ద ధర్నా నిర్వహించామని, 5న ఢిల్లీలో ధర్నా చేసేందుకు వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు వెళ్లారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం తరువాత కూడా దిగి రాకుంటే ఎంపీలు రాజీనామాలు చేస్తారని ప్రకటించారు. ఇది చిత్తశుద్ధి కలిగిన పోరాటమని, ప్రత్యేక హోదా సాధించేవరకు వెనక్కి తగ్గే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాపై పలుసార్లు పలు విధాల మాటలు మార్చిన చంద్రబాబు చిట్టచివరి అస్త్రంగా కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారన్నారని, అది చివరి అస్త్రం ఎలా అవుతుందని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల మొదటి రోజే కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని, 21న తాము పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకాలని, అప్పటికీ కేంద్రం దిగి రాకుంటే పార్టీ రహితంగా ఎంపీలందరూ ఒక తాటిపైకి వచ్చి రాజీనామాలను కేంద్ర ప్రభుత్వం ముఖాన విసిరేసి బయటకు రావాలన్నారు.

102వ రోజు పాదయాత్ర నిర్వహించిన జగన్ సంతనూతలపాడు నియోజకవర్గం గాడిపర్తివారిపాలెం నుంచి ప్రారంభించి దర్శి నియోజకవర్గం తాళ్లూరు వరకు సాగించారు. అంతకు ముందు ఢిల్లీ వెళుతున్న పార్టీ వాహన శ్రేణికి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. దర్శి నియోజకవర్గంలో ప్రవేశించిన ప్రజా సంకల్ప యాత్రకు అక్కడి నాయకులు సర్వ మత ప్రార్థనలతో స్వాగతం పలికారు. శివరాంపురం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.



ఢిల్లీలో ధర్నా చేసేందుకు వెళ్లే వాహన శ్రేణిని జెండా ఊపి ప్రారంభిస్తున్న జగన్

# 48 మంది ఒకేసారి చేస్తే...?

**●జగన్‌తో వైసీపీ ఎమ్మెల్యేల మంతనాలు**

ప్రత్యేక హోదా కోసం ఎంపీలు రాజీనామా చేసినా కేంద్రం దిగిరాకపోతే ఏమి చేయాలనే విషయమై జగన్‌తో జరిగిన సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఆసక్తికరమైన సూచనలు చేసినట్లు సమాచారం. అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ ఏప్రిల్ 6న ఎంపీలు రాజీనామా చేసిన అనంతరం కేంద్రం ప్రత్యేక హోదా ప్రకటించకుంటే రాష్ట్రంలోని 48 మంది ఎమ్మెల్యేలు కూడా ఒకేసారి రాజీనామా చేస్తే ఎలా ఉంటుంది అన్న అంశంపై తీవ్రమైన చర్చ జరిగినట్లు సమాచారం అందింది. ఇప్పటికే టీడీపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు కొంతమంది తిరిగి టచ్‌లోకి వస్తున్నారని, వారికి ఏమి హామీ ఇవ్వాలని నాయకులు జగన్‌ను ప్రశ్నించారు. ఈ రెండు ప్రశ్నల విషయంలో సమావేశంలో భిన్నమైన అభిప్రాయాలు వినిపించినట్లు తెలిసింది.

ప్రకాశం జిల్లా తాళ్లూరులో ఢిల్లీలో జరిగే ధర్నా కోసం వెళ్లే ముందు ఎమ్మెల్యేలు జగన్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఒక ఎమ్మెల్యే ఎంపీలతోపాటు తాము కూడా రాజీనామా చేస్తామని జగన్‌కు సూచించారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో ఎమ్మెల్యేలుగా ఉన్నా.. ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నామని, ప్రత్యేక హోదా కోసం తాము కూడా రాజీ నామా చేస్తే మరింత ఒత్తిడి పెరుగు తుందేమో ఆలోచించాలని జగన్‌కు వివరించారు. జగన్ కూడా ఈ విషయంపై ఆసక్తిగా విని ఆలోచిద్దామని చెప్పినట్లు సమాచారం. రాజ్యసభ ఎన్నికల తరువాత దీనిపై ఆలోచిద్దామని, మరికొందరు నాయకులు చెప్పినట్లు తెలిసింది.

ఏదైనా ఒక నిర్ణయం తీసుకుంటే అది సంచలనం కావాలని, ప్రత్యేక హోదా సాధించే క్రమంలో మైలురాయి కావాలని జగన్ ఎమ్మెల్యేలతో పేర్కొన్నట్లు సమాచారం. కాగా టీడీపీలోకి ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలలో కొంత మంది తమకి టచ్‌లోకి వస్తున్నారని, మరికొందరు ఎమ్మెల్యేలు జగన్‌కి తెలిపారు. ఈ విషయంలో ఏవిధమైన నిర్ణయం తీసుకోవాలని వారు జగన్‌ని అడగ్గా ప్రత్యేక హోదా కోసం రాజీనామా చేస్తే అప్పుడు వారి గురించి ఆలోచిద్దామని చెప్పినట్లు సమాచారం.

# కమ్యూనిస్టుల కోటలో కమలం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌తో సరిసమానంగా కమ్యూనిస్టులు ప్రజాదరణను పొంద గలిగారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గడగడలాడించారు. నెహ్రూ ప్రభుత్వంలో ప్రధాన ప్రతిపక్షంగా కొలువుదీరారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆలోచనా తీరుతెన్నులు మారుతున్నప్పటికీ వాటిని అవగాహన చేసుకుని ఒడిసిపట్టుకోవడంలో భారతీయ కమ్యూనిస్టుల వైఫల్యం గతకొన్నేళ్ళుగా ఎన్నికల ఫలితాల రూపంలో వెల్లడౌతూనే ఉంది. పశ్చిమబెంగాల్ వైఫల్యానంతరం కూడా కమ్యూనిస్టులు తమ కాలం చెల్లిన ఆలోచనా విధానాల్ని సవరించు కునే ప్రయత్నం చేయలేదు. ఇదే త్రిపురలో ఓటమికి ప్రధాన కార ణంగా పరిశీలకులు అంచనావేస్తున్నారు. మాణిక్‌సర్కార్ దీర్ఘకాలం గా ఆ రాష్ట్రముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనతోపాటు పలు మంత్రివర్గ సహచరుల నిర్ణయాల్లో ఏ చిన్న అవినీతి ఆరోపణల్ని ఎదుర్కోలేదు. దేశానికే సర్కార్ ఆదర్శనీయ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. ఇదొక్కటే వామపక్షాలు ఈ సారి ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా వాడుకున్నాయి. అయితే దేశం యావత్ అభివృద్ధిలో దూసుకుపో తోంది. ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు భారతీయులకు అందు బాటులోకొస్తున్నాయి. వ్యక్తిగత తలసరి ఆదాయం ఏటేటా పెరుగు తోంది. కానీ త్రిపుర ఇందుకు మినహాయింపుగా మారింది. కేరళలో వామపక్షపార్టీలు అధికారంలో కొనసాగుతున్న అక్కడ ప్రతి ఐదేళ్ళకొకసారి ప్రభుత్వం మారుతోంది. పైగా ఆ రాష్ట్రం సహజంగానే అక్షరాస్యత ఎక్కువగా కలిగింది. వనరులు కూడా పుష్కలంగా ఉన్నాయి. కానీ పశ్చిమబెంగాల్, త్రిపురలు ఇందుకు భిన్నం. పశ్చిమబెంగాల్‌లో వామపక్షాల ప్రభుత్వాల హయాంలో పరిశ్రమలు నీరుగారిపో యాయి. కార్మిక ఉద్యమాల్ని అవి తట్టుకోలేక పోయాయి. త్రిపురలో నిరివవాదమైన పాలన సాగినా ఉపాధి అవకాశాలు కొరవడ్డాయి. కనీసం మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించలేక పోయింది. అన్నింటికి మించి పశ్చిమబెంగాల్ తరహాలోనే పార్టీకు, ప్రభుత్వానికి



మధ్యనుండాల్సిన సన్నటి గీతను చెరిపేశారు. రెండింటిని ఒకేలా చూశారు. ప్రభుత్వ పథకాలన్నీ సొంత పార్టీ కార్యకర్తలకే పరిమిత మయ్యాయి. రాష్ట్రప్రభుత్వోద్యోగుల్లో వామపక్షకార్యకర్తలే నియమి తులయ్యారు. సరిహద్దుల మీదుగా బంగ్లాదేశ్ నుంచి సాగుతున్న వలసల్ని ప్రభుత్వం సమర్ధవంతంగా అరికట్టలేకపోయింది. శాంతి భద్రతల అదుపులో ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఎక్కడో ఉన్న ఢిల్లీలో అభివృద్ధిని చూపుతూ నిత్యం ప్రజల్ని మభ్యపెట్టడం తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించలేకపోయింది.

ఈ ఎన్నికలు కాంగ్రెస్ కంటే వామపక్షాలకు ఎక్కువ నష్టాన్ని మిగిల్చాయి. తిరిపుర్లెట్లో కోలుకోలేని దెబ్బకొట్టాయి. మోదీ అధి కారంలోకొచ్చింది తడవు కాంగ్రెస్ నుంచి దేశాన్ని విముక్తి చేస్తా మంటూ ప్రకటిస్తున్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ కోసం పిలుపునిచ్చా రు. పనిలో పనిగా దేశంలోని పురాతన పార్టీల్లో కాంగ్రెస్‌తో సరి సమానమైన వామపక్షాల్ని కూడా బలహీనపర్చారు. ఉత్తరాదిని ఈశా న్యంలో కాషాయ జెండా రెపరెపలు కష్టమని భావించారు. అక్కడ హిందుత్వ, ఇతర అంశాలేవీ పనిచేయవని అంచనాలేశారు. అన్నిం టికి మించి విద్యార్థి దశనుంచి కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడంతో అటువైపు బిజెపి నిలదొక్కు కోలేదని భావించారు. అయితే మార్పు పేరిట బరిలో దిగిన బిజెపి గత మూడేళ్ళుగా ఆ రాష్ట్రంలో ఎన్ని కల్ని ఎదుర్కొనేందుకు పక్కా వ్యూహాలు అమలు చేసింది. ఎన్నికలకు ముందే త్రిపురలో బిజెపి గాలి స్పష్టమైంది. ఎన్నికల సమయంలోనే కేంద్రంపై సిపిఎమ్‌పలు ఆరోపణలు చేసింది. పైగా రాష్ట్రంలోని తీవ్రవాద మూకల్లో బిజెపి పొత్తెట్టుకుందంటూ ప్రచారం మొదలెట్టింది. తమకనుకూల అధికార్లను ఇతర రాష్ట్రాల్నుంచి ఇక్కడ నియమించిందంటూ కూడా మండిపడింది. అయితే ప్రజలు మాత్రం వ్యూహాత్మక ప్రచారానికే మొగ్గుచూపారు. మార్పుకు పట్టంగట్టారు. శనివారం వెలువడ్డ మూడురాష్ట్రాల ఎన్నికల ఫలితాల మాటెలా ఉన్నా త్రిపుర ఫలితం పైనే దేశం యావత్ దృష్టిసారించింది. అస్సాం తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లో త్రిపురే రాజకీయంగా, భౌగోళి కంగా అత్యంత కీలకమైన రాష్ట్రం. రెండు దశాబ్దాలుగా వామ పక్షీయుల ఏలుబడిలో ఉన్న ఈరాష్ట్రంలో భారత జాతీయతకంటే చైనా పట్లభక్తిభావాలు పెం పొందించడంలో పాలకవర్గాలు విజయవంతమయ్యాయి. ఈ దేశం అవినీతి, ఆశ్రితపక్షపాతం, కులమతవర్గ వైషమ్యాల్లో కొట్టుమిట్టాడు తోందని, చైనా తరహాలో అభివృద్ధి ఇక్కడ అసాధ్యమన్న ప్రచారం ఇంతవరకు త్రిపురలో సాగింది. ప్రభుత్వం నుంచి ఉద్యోగుల వరకు ఒకే రాజకీయ పార్టీ కార్యకర్తలుండడంతో మిగిలిన ప్రజల పరిస్థితి దైన్యంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తు న్న బిజెపి త్రిపురను కూడా అసేతుహిమాచల జనజీవన స్రవంతిలోకి తేవడంలో నిజాయతీ, నిబద్ధతల్తో కూడిన ప్రయత్నం చేస్తేనే అక్కడ కాషాయదళం దీర్ఘకాలం పాటు అధికారాన్ని కొనసాగించగలుగు తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## గత ప్రభుత్వ హామీలకు
# కట్టుబడాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

ఇందులోని అంశాలన్నీ సహేతుకమేనంటూ పేర్కొన్నారు. ఈ నివేదికను పరిశీలించిన తాను ఇందులో ఐదు ప్రధా నాంశాలున్నట్లు గుర్తించానన్నారు.

1. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా
2. రాష్ట్రంలో జాతీయస్థాయి విద్యాసంస్థల ఏర్పాటు
3. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం
4. రాష్ట్రానికి ప్రత్యేక రైల్వేజోన్
5. కడప ఉక్కుకర్మాగార నిర్మాణం

ప్రత్యేక హోదా అంశానికొస్తే యుపిఏ ప్రభుత్వం రాష్ట్ర విభజనానంతరం ఆదాయం కోల్పోయే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాతో పాటు ఆర్థిక సహకారమందిస్తామంటూ పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. అనంతరం వచ్చిన ఎన్డీఏ ప్రభు త్వంతమవిధానాల ప్రత్యేకమంటూ గతప్రభుత్వహామీల్ని పక్కనపెట్టే వీలు చట్టంలో లేదంటూ జస్టిస్ గౌడ స్పష్టం చేశారు. ఒక మంత్రి చేసిన ప్రకటనకు మొత్తం ప్రభుత్వం కట్టుబడుండాల్సిందేనన్నారు. ప్రత్యేకహోదా లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యంకాదన్నారు. ఇకరాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన జాతీయ స్థాయి విద్యా సంస్థలకు 11,762కోట్లు వ్యయమౌతాయి. కానీ ఈ నాలుగే ళ్ళలో 576కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసింది. ఇది మొత్తం జరిగే వ్యయంలో ఐదు నుంచి పది శాతం కూడా కాదు. ఈ అత్యున్నత స్థాయి విద్యాసంస్థల ఏర్పాటుకాని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాలు మెరుగయ్యే అవకాశముండదు.

అత్యున్నత విద్యాభ్యాసం అందుబాటు లోకి రాదు. ప్రపంచంతో పోటీపడే పరిస్థితి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు లభించదని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి కేంద్రమే దీన్ని నిర్మించి రాష్ట్రానికివ్వాలన్నారు. కానీ ఇలా నత్తనడకన నిర్మాణం సాగితే మరో 15నుంచి20ఏళ్ళయ్యినా ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యే పరిస్థితి ఉండదన్నారు. అంతవరకు ఆంధ్రప్రదేశ్‌లో రైతుల హక్కులు, ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందన్నారు. అలాగే వ్యవసాయోత్పత్తులు దెబ్బ తింటాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటుతో సరుకుల రవాణాతో పాటు ప్రయాణ సదు పాయాలు మెరుగౌతాయన్నారు. సుదీర్ఘ తీరంలో పరిశ్రమ ల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయన్నారు. కడపలో ఉక్కు కర్మాగార ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరో క్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. వ్యవసా య వృద్ధిలేని రాయలసీమ అభివృద్ధికి కడప ఉక్కుకర్మా గారం ఆయువుపట్టుగా మారుతుందంటూ తన అభి ప్రాయాన్ని వ్యక్తంచేశారు.



# అప్పటిదాకా సభలో అడుగుపెట్టను!

• స్పష్టం చేసిన జగన్

**ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేంతవరకు అసెంబ్లీ సమావేశా లకు హాజరయ్యే ప్రసక్తి లేదని ప్రతిపక్షనేత వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని, అవిశ్వాస తీర్మానం ఎంపీల రాజీనామా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని జగన్ నాయ కులకు స్పష్టం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నారని, అయినా మన నాయ కులు లొంగలేదని జగన్ వారిని ప్రశంసించారు. రాజ్యస భ ఎన్నికలలో వైసిపి ఒక సీటు గెలుచుకునే అవకాశముం దని, ఆ సీటు కోసం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని పోటీకి నిలుపుతు న్నామని జగన్ నాయకులకు అభ్యర్థిని పరిచయం చేశారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా తాళ్లూరు లో ఉన్న జగన్ వద్దకు శనివారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు వచ్చారు. ఈ నెల 5న ఢిల్లీలో ధర్నా నిర్వ హిస్తున్న నేపథ్యంలో వారికి పార్టీ విధానాలపై జగన్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం రాజ్యసభ ఎన్నికలపై చర్చించా రు. పార్టీ ఫిరాయించిన 22 మంది ఎమ్మెల్యేలపై ప్రభుత్వం అనర్హత వేటు వేసేంత వరకు అసెంబ్లీ సమావేశాలకు హాజ రుకాబోమని స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షం గైర్హాజరు అయితే దేశ వ్యాప్త చర్చకు దారితీస్తుందని జగన్ పేర్కొన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను ప్రజలకు విశదీకరించాలన్నారు.

**క్లైమాక్స్ చేరిన ప్రత్యేక హోదా పోరాటం**

ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో ఉన్న ప్రతి అంశం అమలుకావాలన్నారు. ప్రత్యేకహోదా పేరుతో ప్రజలను మోసం చేయవద్దు, హోదా మనహక్కు అని వైసిపి పోరాడు తుందని స్పష్టం చేశారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి 184వ నిబంధన క్రింద ప్రత్యేక హోదాపై లోక్‌సభలో చర్చకు యత్నిస్తున్నారని, దీంతో అవిశ్వాస తీర్మానం సందర్భంగా వచ్చే చర్చ సమయంలోనూ మన గళాన్ని గట్టిగా వినిపి స్తామని జగన్ పేర్కొన్నారు.

# తిప్పికొడతాం

• అసెంబ్లీలో తేల్చుకుంటాం • బీజేపీ బాధ్యతగా ఉంది.. టీడీపీ మితిమీరుతోంది
• ముఖ్యమంత్రి సైతం గౌరవప్రదంగా లేరు
• మీడియాతో బీజేపీ అత్యున్నత శ్రేణులు



**విశాఖపట్నం, ప్రభ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుతో సహా తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు బాధ్యత మీరుతున్నారని భారతీయ జనతా పార్టీ ముఖ్య శ్రేణులు పేర్కొన్నాయి. శనివారం విశాఖపట్నంలో బీజేపీ రాష్ట్ర స్థాయి శాసన సభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని పార్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు కంభం హరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు దేశం పార్టీ మైత్రీ బంధాన్ని వీడి వ్యవహరిస్తున్న తీరును చర్చించి, ఈ నెల అయిదో తేదీన జరిగే శాసనసభ, తరువాత జరిగే శాసనమండలి సమావేశాల్లో వ్యవహరించదగ్గ తీరుపై ప్రధానంగా వీరు చర్చించా రు. అసెంబ్లీలో వ్యవహరించాల్సిన వ్యూహం, ప్రతివ్యూహం, టీడీపీని తిప్పికొటే వైనం ప్రధాన అజెండాగా సాగిన సమావేశంలో ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన అంశాలు ప్రజల్లోకి టీడీపీ శ్రేణులు తీసుకు వెళుతున్న సంకేతాలు, వాటి పర్యవసానం వంటివి కూడా చర్చించారు. ఎంపీ గోకరాజు గంగరాజు, అఖిల భారత సం యుక్త ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) జి. సతీష్, మంత్రులు కామి నేని శ్రీనివాసరావు, పి. మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు కె. సత్యనారాయణ రాజు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రవీంద్రరాజులు సుమారు నాలుగు గంటలకు పైగా ఈ విషయాలపై ప్రధానంగా చర్చించారు. బీజేపీపై బురద జల్లేందుకు టీడీపీ వర్గీ యులు చేస్తున్న ప్రయత్నాలు బాధాకరంగా ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీని అసెంబ్లీ సాక్షిగా వారి ఎత్తుగడలను తిప్పికొట్టాలని నిర్ణయించారు. విమర్శిస్తున్న టీడీపీ అధిక సంఖ్యా కుల్లో ఎవ్వరికీ ఏపీకి వస్తున్న ఇనిస్టిట్యూట్‌ల గురించే తెలీదని ఎద్దేవా చేశారు. బీజేపీని విమర్శిస్తూ ఇతర పార్టీలకు లేఖలు రాయడం బాధ్యతాయుతంగా లేదని చెబుతూ రెవెన్యూ లోటు విషయం లోనూ టీడీపీ అబద్దాలే ప్రచారం చేస్తోందని విమర్శించారు. 16 వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌కు సంబంధించిన ప్రకటనలో నిజం లేదని, ఆ పార్టీ తమ ఎన్నికల ఖర్చులనూ, పథకాల ఖర్చులనూ చేర్చు కుని కేంద్రం నుంచి అవన్నీ రాబట్టేపనిలో ఉందని ఎద్దేవా చేశారు.

తప్పుడు లెక్కలతో ముఖ్యమంత్రిని అభాసుపాలు చేసేందు కు ఆ పార్టీ ఎంపీలు, మంత్రులూ, ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తు న్నా పట్టించుకోని స్థితిలో చంద్రబాబు నాయుడు ఉన్నారని ఆరోపించారు. ఒకప్పుడు రాష్ట్రానికి ఏ ముఖ్యమంత్రీ తేలేని నిధులు తాను తీసుకువచ్చానన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు మాట మార్చడం ఎంత వరకూ సమంజసం అని నిలదీశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధి వికేంద్రీకరణ కోరుకుంటుందన్నారు. అందులో భాగంగా రాష్ట్రాన్ని 25 జిల్లాలుగా విభజించాలని భావిస్తోంద న్నారు. అందులో భాగంగా రాయలసీమ సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తామని కూడా ఆయన వెల్లడించారు. తామెప్పుడూ విడిపోవాలనే సంకేతాలను ఇవ్వలేదని, టీడీపీ మాత్రం అందుకు ఆరాటపడుతుందని అన్నారు.

పార్లమెంట్‌ను దిగ్బంధం చేస్తామనడం ముఖ్య మంత్రికి సరి కాదని అన్నారు. విభజన చట్టంలోని అంశాలను, ప్రత్యేక రైల్వే జోన్, వెనకబడిన జిల్లాలకు బడ్జెట్ కేటాయింపు వంటి అంశాలపై పార్ల మెంట్‌లో చర్చిస్తామని కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఏపీకి ఏమేమి ఇవ్వాలో అవన్నీ కేంద్రమే చూసుకుం టుందని వెల్లడించా రు. ఏపీకి ఇవ్వాల్సిన నిధుల విడుదల బాధ్యను కేంద్రం వహిస్తుందని చెబుతూ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోడీ పాలనవైపే మొగ్గు చూపుతున్నారని చెప్పారు.

## నేటి నుంచి విట్‌లో
# నేషనల్ టెక్నికల్ ఫెస్ట్



**అమరావతి, ఆంధ్రప్రభ:** వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అమరావతిలో ఆదివారం నుంచి రెం డు రోజుల పాటు నేషనల్ టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించను న్నట్లు విట్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ తెలిపారు. శనివారం విట్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఫెస్ట్‌లో బిగ్ డేటా ఎనలటిక్స్, రోబోటిక్స్ ఆర్టిఫి షియల్ ఇంటిలిజెన్స్, ఐఒటీ, టెక్నికల్ క్విజ్ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇప్ప టికే పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నేషనల్ టెక్నికల్ ఫెస్ట్‌కు ఏపీ సీఆర్డీయే, ఇంధన శాఖ ముఖ్య కార్య దర్శి అజయ్‌జైన్‌తో పాటు షిండేర్, ఎలక్ట్రిక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అరిందం సేన్, కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ మీనన్ పాల్గొనను న్నట్లు వెల్లడించారు. నేషనల్ టెక్నికల్ ఫెస్ట్‌లో రోజురోజుకు టెక్నాల జీలో చోటు చేసుకుంటున్న మార్పులపై మైక్రోసాఫ్ట్, బాష్‌లకు చెందిన నిపుణులు సెమినార్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ తెలిపారు.

# డీఎస్సీ, ఎస్జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ

• ఈ నెల 14 వరకు దరఖాస్తుల గడువు
• సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పీఎస్ఎ. ప్రసాద్

**అమరావతి, ఆంధ్రప్రభ:** విజయవాడలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ, ఎస్జీటీ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పీఎస్ఏ ప్రసాద్ తెలి పారు. ఈ నెల 14 వరకు అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శనివా రం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా 100 మంది అభ్యర్థులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని తెలి పారు. ఇప్పటి వరకు 30 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని మరో 70 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 47 సంవత్సరాలలోపు ఎస్సీ, బీసీ(సీ) అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఎస్సీ కేటగిరీకి చెందిన వారి కుటుంబవార్షిక ఆదాయం రూ.2 లక్షలు, బీసీ(సీ) అభ్య ర్థులకు రూ.1.5 లక్షలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఉచిత శిక్షణకు ఇంట ర్మీడియట్‌తోపాటు డైట్ సెట్(టీటీసీ) పూర్తి చేసి టెట్‌లో అర్హత సాధించినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్(ఏపీ స్టడీ సర్కిల్) లెనిన్ సెంటర్, విజయవాడకు మార్చి 14లోపు పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## గ్రాట్యుటీ రద్దు జీవోను
# ఉపసంహరించుకోవాలి

• ఏపీ అర్చక సమాఖ్య డిమాండ్

**అమరావతి, ఆంధ్రప్రభ :** అర్చకత్వాన్ని అవమానిస్తూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన రిటైర్డ్ అర్చకుల గ్రాట్యుటీ రద్దు ఉత్తర్వులను సత్వరమే ఉపసం హరించుకోవాలని ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆత్రేయబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దింటి రాంబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లా డుతూ మారుమూల పల్లెల్లోని దేవాలయాల్లో అరకొర భూములు కలిగి వంశ పారంపర్యంగా అర్చకత్వం చేస్తున్నవారికి రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ చెల్లింపు రద్దు చేస్తూ దేవాదాయ శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆ ఉత్తర్వును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే అర్చకుల ఆగ్రహానికి గురికాకతప్పదని వారు హెచ్చరించారు.

# ఉత్తమ శిక్షణ కేంద్రాలుగా ఏపీ స్టడీ సర్కిల్స్

• ప్రైవేటుకు ధీటుగా శిక్షణ
• మంత్రి నక్కా ఆనందబాబు

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీ స్టడీ సర్కిల్స్ (అంబేద్కర్ స్టడీ సర్కిల్స్)ను అత్యుత్తమ శిక్షణా కేం ద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబం ధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికా రులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. శనివారం విజ యవాడలోని బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ మంత్రి ఆనందబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణను అందించేందుకు ఈ స్టడీ సర్కిల్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. గత ఏడాది గ్రూపు-2 పరీక్షకు సంబంధించి విజయవాడ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన నలుగురు అభ్యర్థులు డిప్యూటీ తహసీల్దార్లుగా ఎంపికైనట్లు తెలిపారు. ప్రైవేటు సంస్థలకు ధీటుగా శిక్షణ తరగతు లు నిర్వహిస్తున్నామని అంతే కాకుండా అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామని చెప్పారు. సబ్జెక్టుల వారీగా టైమ్ టేబుల్‌ను రూపొం దించుకొని బోధన అందించాలని అధ్యాపకులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. బాలికలు, బాలు రకు వేరువేరుగా వసతి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనను రూపొందించాలని అధి కారులను ఆదేశించినట్లు తెలిపారు. గడిచిన పన్నెం డు సంవత్సరాలుగా అంబేద్కర్ స్టడీ సర్కిల్ ద్వారా కానిస్టేబుల్ నుంచి గ్రూపు -1, ఆర్ఆర్‌బి, బ్యాంకింగ్ వంటి ఎన్నో పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని ఇప్పటి వరకు 160 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగా లు సాధించినట్లు తెలిపారు. మరింత ఉత్తమ శిక్షణ, మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటు న్నట్లు చెప్పారు. బోధన సిబ్బందిని కూడా శాశ్వతం గా నియమించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికైన భద్రయ్యకు మంత్రి అభినందనలు**

ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికైన కృష్ణా జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి నామి నగర్‌కు చెందిన భద్రయ్యతో మంత్రి నక్కా ఆనంద బాబు ఫోనులో మాట్లాడి అభినందించారు. ఈ సందర్భంగా మెండు భద్రయ్య మంత్రితో మాట్లాడు తూ ఎపీ స్టడీ సర్కిల్ నిరుద్యోగుల పాలిట ఒక వరమని తనలాంటి నిరుపేదలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి గౌరవప్రదమైన ఉద్యోగం సాధించేలా దోహదప డం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి స్టడీ సర్కి ల్స్‌ను మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేయడం సంతోష కరమన్నారు.

దీనిపై స్పందించిన మంత్రి ఏపీ స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యమైన శిక్షణ అందించేలా చూస్తామని, శిక్షణను పర్యవేక్షించేందుకు డైరెక్టర్‌ను నియమిస్తామ ని చెప్పారు. ఎస్సీ, బీసీ(సీ), వర్గాలకు చెందిన విద్యా ర్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఈ ఆకస్మిక తనిఖీలో స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ జి.భాస్కర్ పర్యవేక్షకుడు పి.ఆంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులకు నిరసనగా ఛలో గుంటూరు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రవ్యాప్తంగా దళి తులపై విస్తృతంగా జరుగుతున్న దాడులను అరికట్ట డంలో ఘోర వైఫల్యం చెందుతున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 4న ఛలో గుంటూరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. శనివారం గుంటూరులో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టి నప్పటి నుంచి దళితులకు రక్షణ, భద్రత కరువైందని ధ్వజమెత్తారు. నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట పట్టణ ప్రథమ పౌరురాలైన మున్సిపల్ చైర్‌పర్సన్ శోభారాణికి కనీసం కూర్చోడానికి కుర్చీ కూడా ఇవ్వ కుండా ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర మంత్రి నారాయణ బృం దం అవమానించిందని గుర్తు చేశారు. దళితుల కష్టా లను తీరుస్తామని టీడీపీ నేతృత్వంలో చేపట్టిన దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమంలో మంగళ గిరిలో దళిత మహిళ వనరాణిని స్థానిక టీడీపీ నేత హరిబాబు దాడిచేసి కొట్టి దారుణంగా అవమానించా రని చెప్పారు. విజయనగరంలోని ముదువలస గ్రామంలో జన్మభూమి కార్యక్రమానికి వస్తున్న దళి తులను దాడిచేసి తీవ్రంగా కొట్టారని, అలాగే విశాఖ లోని జెర్రి పోతులపాలెంలో భూకబ్జాను అడ్డుకున్నం దుకు దళిత మహిళలను వివస్త్రలను చేసి దారుణంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని గరగపర్రులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కు ప్రయత్నించినందుకు దళిత కుటుంబాలను మూడు నెలల పాటు సాంఘిక బహిష్కర అగ్రవర్ణాలు విధించారని, చిత్తూరు జిల్లాలోని కూరాలకులపల్లిలో శివరాత్రి రోజు దళిత మహిళ అపర్ణను తీవ్రంగా కులం పేరుతో దూషించగా, దీనిపై ప్రశ్నించినందుకు దళిత పల్లెపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపించారు.

ఇటీవల గుంటూరు జిల్లాలోని ప్రత్తి పాడు నియోజకవర్గంలో దళితులపై అగ్రవర్ణాలు దాడులకు తెగబడ్డారని, చివరకు దేశ రాజధాని ఢిల్లీ లోని ఆంధ్ర భవన్‌లో కూడా దళిత ఉద్యోగులకు అవ మానాలు, కులదూషణలు తప్పడంలేదన్నారు. దళి తులపై జరుగుతున్న భౌతిక, సాంఘిక దాడులను తక్షణమే అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ల తో కమ్యూనిస్టు, ప్రజాసంఘ పార్టీ నేతల సమన్వ యంతో ఛలో గుంటూరు కార్యక్రమం చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర నేతలు క్రిష్ణమోహన్, మరియదాసు, నాగమల్లేశ్వర రావు, అగస్టీన్, సబిత, జోనేష్ పాల్గొన్నారు.

# పక్కా గృహాలు, అక్రిడిటేషన్లు సాధించే వరకు పోరాటం

• 6న ప్రదర్శనలు • బడ్జెట్ తర్వాత తదుపరి కార్యాచరణ • ఏపీయూడబ్ల్యూజే పిలుపు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని జర్నలిస్టులకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రకటించిన మూడు పడకల గృహాల నిర్మాణ పథకం సాధించే వరకూ దశల వారీగా ఆందోళన కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈనెల 6న అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించి అధికా రులకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరింది. శుక్రవారం ఈ ఆ మేరకు శ్రీకాకుళంలో రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.వి.సుబ్బారావు తెలిపారు. గృహ నిర్మాణ పథకానికి సంబంధించి ఇంతవరకు స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెల్లడి కాకపోవడంతో జర్నలిస్టుల్లో ఆయోమయం నెలకొందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సమాచార శాఖా మంత్రి కాలువ శ్రీనివాసులు సానుకూలంగా స్పందిస్తున్నారే తప్ప ఆచరణలో ఫలితం కనిపించడం లేదన్నారు. గృహ నిర్మాణానికి అయ్యే వ్యయంలో 70శాతం సబ్సిడీతో గృహ నిర్మాణ పథకం ప్రకటిస్తూ, అందుకు గాను బడ్జెట్‌లో రూ.200కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ఆమేరకు గతంలో సమాచార శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, అలాగే కొత్త అక్రిడేషన్లు ఏప్రిల్ 1వ తేదీలోగా ఇవ్వాలని సమావేశం కోరింది. ఈ విషయంలో సమాచార శాఖ జాప్యం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని, అక్రిడేషన్ మంజూరుకు జర్నలిస్టుల విద్యార్హతను విధించే నిబంధనలు తొలగించి వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు అన్ని రకాల విద్యా సంస్థల్లో ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని, సంక్షేమ నిధికి రూ.50కోట్లు కేటాయించాలని, వేజ్‌బోర్డు నిర్ణయాలకు అనుగుణంగా వేతనాలకు చర్యలు చేపట్టాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఉద్యమం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షే మానికి అనుగుణంగా నిర్ణయాలు వస్తాయని ఆశిస్తున్నామని, కాని అలా వెలువడని పక్షంలో వెంటనే యూనియన్ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్, రాజేంద్ర, అచ్యుతరావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చందు జనార్ధన్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వక్ఫ్ ఆస్తుల పరిరక్షణపై
# ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి

• నగరాల అభివృద్ధి పేరుతో దర్గాలు, మసీదుల కూల్చివేత తగదు • సెంట్రల్ వక్ఫ్ బోర్డు సభ్యుడు హామీద్ ఇంజనీర్

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో అన్యాక్రాంతం అవుతున్న వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని సెంట్రల్ వక్ఫ్ బోర్డు మెంబర్ హామీ ద్ ఇంజనీర్ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ పాతబస్తీలోని 400 సంవత్స రాల చరిత్ర కలిగిన హజరత్ సయ్యద్ అలీషా హుస్సేన్ ఖాద్రీ, సయ్యద్ షా ఖాద్రీ దర్గాను ఆయన సందర్శించారు. కుట్రపూరితంగా ఈ దర్గాను కూల్చివేయాలని చూస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో స్థానిక మతపెద్దల నుంచి సమాచారాన్ని సేకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పేరిట ఎంతో ఘన చరిత్ర కలిగిన దర్గాను కూల్చి వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిం చడం దారుణమని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ హరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. అనంతరం వక్ఫ్ ఆస్తుల సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్ రజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దర్గా ల అభివృద్ధికి చేసింది ఏమి లేదని విమర్శించారు. ప్రస్తుతం పాత బస్తీలో ఉన్న దర్గా ను కూడా కుట్రపూరితంగా తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ అంశంపై సెంట్రల్ కమిటీ తగిన శ్రద్ధ చూపాలని కోరారు. వక్ఫ్ ఆస్తుల అక్రమాణ దారులపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా క్రిమినల్ కేసు లు పెడతామని హెచ్చరించారు. వక్ఫ్ బోర్డు సెంట్రల్ కమిటీ మెంబర్‌ను ఈ సంద ర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జలీల్ ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతం అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి తగిన చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. భూములను తిరిగి వక్ఫ్ బోర్డుకు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర్ దర్గా పీఠాధి పతి సయ్యద్ సుల్తాన్ హసన్, ట్రస్టీ హజరత్ సయ్యద్ అలీషా ఆఫ్తర్ జమా తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభకు బీజేపీ అభ్యర్థిగా
# నారాయణ్ రాణే!



**ముంబయి:** ఒకప్పుడు శివసేనలో ప్రముఖునిగా పేరొందిన నారాయణ్ రాణే యూపీఏ హయాంలో కాంగ్రెస్‌లో చేరి మహారాష్ట్ర మంత్రివర్గంలో కీలకమైన శాఖలనునిర్వహించారు. గత సెప్టెంబర్‌లో ఆయన కాంగ్రెస్‌కి రాజీనామా చేసి మహారాష్ట్ర స్వాభిమాన్ పక్ష అనే సొంత కుంపటిపెట్టుకున్నారు. ఆ పార్టీని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏలో చేర్చారు. మహారాష్ట్ర మం త్రివర్గంలో మళ్ళీ కీలక పదవిని ఆశిస్తున్న రాణేకు మంత్రి పదవి ఇప్పిస్తామని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం హామీఇచ్చినప్పటికీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సుముఖంగా లేరు. రాష్ట్ర శాసనసభలో బీజేపీ బలం 122 మాత్రమే. శివసేన మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని నడి పించడం కష్టం. రాణేకు మంత్రి పదవి ఇవ్వొద్దని శివసేన ఒత్తిడి చేస్తోందంటూ ఫడ్నవీస్ బీజేపీ కేంద్ర నాయకత్వానికి చెబుతూ వస్తున్నారు. మరో వంక రాణే నుంచి ఒత్తిడి పెరగ డంతో ఆయనను రాజ్యసభకు పంపేందుకు బీజేపీ కేంద్ర నాయకత్వం అంగీకారం తెలిపింది. అయితే, తనకు రాష్ట్ర మంత్రివర్గంలో కీలక పదవి కావాలని రాణే పట్టు బడుతున్నారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కి సమస్యలున్నాయని తాను అనుకోవ డం లేదనీ, శివసేన మద్దతు ఉపసంహరించుకుంటే బీజేపీ ప్రభుత్వం పడిపోదనీ, శివ సేననుంచి 26 మంది ఎమ్మెల్యేల మద్దతును తాను సంపాదించగలనని రాణే అంటున్నారు. కాగా, మార్చి 12వ తేదీన జరగనున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అంగీకరించా ల్సిందిగా రాణేపై ఒత్తిడి పెరుగు తోంది. మహారాష్ట్ర నుంచి ఆరు రాజ్యసభ సీట్లకు పోటీ జరగనుంది. మూడు సీట్లు బీజేపీకి కచ్చితంగా లభిస్తాయి. 2019 తర్వాతే కేంద్రానికి వెళ్ళాలన్నది తన అభి మతమనీ, బీజేపీ నాయకత్వం ఒత్తిడి చేస్తే రాజ్యసభ సీటు గురించి మరోసారి ఆలోచిస్తానని రాణే విలేఖరులతో చెప్పారు.

# బొమ్మా - బొరుసు
## రెంటికీ మోడీ ఇరుసు!

**ఇదేమి చిత్రం! రాజకీయ వైచిత్రం! ఎన్నికల్లేని రాష్ట్రాల్లో ప్రధాని మోడీ తీరుకి పెదవి విరుపులు, అసంతృప్తులు వ్యక్తమవుతుంటే..ఎన్నికలు జరిగిన చోట్ల కమలం వికసిస్తోంది. అదంతా మోడీ ప్రభంజన ఖాతాలో పడుతున్నది. ఏమిటీ భిన్నధృవ రాజకీయ మనోవీచిక? ఒక కోణంలో చూస్తే..ప్రత్యక్షంగానో పరోక్షంగానో మోడీ దెబ్బ రుచి చూసిన రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో అసహనం పెల్లుబుకుతున్నది. అది కొండకొచో ఆయా రాష్ట్రాల ప్రజల ద్వారా కూడా వ్యక్తమవుతున్నది. ఒక ఎటొచ్చీ మోడీ పాలనా తీరుని, ఆయన వ్యవహార శైలిని నేరుగా రుచి చూడని చోట్ల మాత్రం ఒకసారి మోడీయిజాన్ని ఆహ్వానిద్దామనుకుంటున్నట్టు కనిపిస్తున్నది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే..వామపక్షాలు తమ జాతకాన్ని తామే లిఖించుకుంటున్న అనుభవం ఆ రాష్ట్రంతోనే మొదలుకాలేదు. గతంలోనూ చూశాం. అంతమాత్రాన అక్కడ బీజేపీయే ఏకైక దిక్కు అని చెప్పుకోనక్కర్లేదు. అయినా త్రిపుర ప్రజలు కమలనాథుల మీద ప్రేమ చూపడాన్ని ఇంతకంటె భిన్నకోణంలో చూడలేము. భారతదేశ సరిహద్దుల రక్షణపరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంత ముఖ్యమో..రాజకీయంగా ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అక్కడి ఎన్నికల ఫలితాలు అంతకన్నా ఎక్కువగా ఉపకరించాయి. నీలినీడల రాదారిలో నడుస్తున్న మోడీ చేతికి ఈశాన్య ఫలితాలు టార్చ్‌లైట్ ఇచ్చినట్టయింది. బీజేపీ నాణేనికి ఇదొక పార్శ్వం మాత్రమే. బొమ్మా బొరుసులో రెండో పార్శ్వం ఘర్షణాత్మకప్రేరితం.**

జాతీయ రాజకీయ జాతకచక్రంలో కొత్త పరిణామాలు కళ్లముందు కదలాడుతున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికీ ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికీ మధ్య ఏమి జరుగుతున్నది? అది దాగుడుమూతల ఆటా? లేక ఫెడరల్ వ్యవస్థలోని ఛిద్రవిధానాల దుష్ఫలితమా? లేక రాజకీయ క్రీడా? వ్యక్తుల అభిజాత్యపు ఆధిపత్య సంఘర్షణా? ఇది తెలిస్తే జాతీయస్థాయిలో చాలా ప్రశ్నలకు సమాధానాలు ఇట్టే దొరికిపోతాయి. ఏదిఏమైనా ఈ క్రీడలో మాత్రం నిస్సందేహంగా చంద్రబాబు నాయుడే అత్యంత సుఖప్రదమైన స్థానంలో ఉన్నారని చెప్పొచ్చు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవతలి పక్షంలో ఉండగా మరొకరు పైచేయిగా ఉండటమనేది ఈ నాలుగేళ్ల కాలంలో ఏనాడూ జరగలేదు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలాంటి సీఎంలు సైతం కాస్తంత కలవరపాటుకు గురైన సందర్భాలున్నాయి. ఏ సందర్భంలో చూసినా మోడీయే ఆధిక్య స్థానంలో..ఆధిపత్య స్థానంలో నిలిచారు గాని ఆయన్ని ఢీకొని మరొకరు నిలబడలేకపోయారు. ఇది ఈ నాలుగేళ్ల చరిత్ర. కాని ప్రస్తుతం మాత్రం కొత్త చరిత్ర చూస్తున్నాం. ఇది వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు నాందీ ప్రస్తావనగా నిలిచిపోయే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. తెలిసో తెలీకో..మొత్తానికి జరిగిపోయింది. మోడీ ప్రభుత్వం అడుసులో కాలేసింది. కాలు తీసి కడిగేసుకోవచ్చేమో గాని మోడీ మళ్లీ కాలు కూడదీసుకోగలరా? ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంలో వివిధ రకాలుగా నిర్దిష్ట అభిప్రాయాలు గూడుకట్టుకుని పోయాయి. అవన్నీ చంద్రబాబుకి సానుకూలంగానూ, లేదంటే సానుభూతిగానూ కనిపిస్తున్నాయి. దీనికితోడు చంద్రబాబు అఖిలపక్షాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలని నిర్ణయించడం.. అమిత్ షా కోరినట్టు అయిదో తేదీన ఒక బృందాన్ని చర్చలకు పంపడం...ఇవి అటైనా ఇటైనా బీజేపీయే సమాధానం చెప్పుకోవాల్సిన చక్రబంధంలో ఇరుక్కుపోవడం అనివార్యంగా అనిపిస్తున్నది. అంతేకాదు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుకుందాం..రమ్మని చంద్రబాబుని ఫోన్‌లో ఆహ్వానిస్తే.. నా టీమ్‌ని పంపుతానని సమాధానమివ్వడంలోని లోగుట్టు నిశితంగా పరిశీలిస్తే..చంద్రబాబు తన సహజశైలికి భిన్నంగా ఇక్కడ వ్యవహరించినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో ప్రభుత్వంలో ఉన్న జాతీయ పార్టీ అధ్యక్షుడు మరొక జాతీయ పార్టీ అధ్యక్షుణ్ణి, అంతకుమించి తన కూటమిలోని ఒక రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రిని ఆహ్వానించడాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. అలాగే చంద్రబాబూ తీసుకోరు. కాని ఆ ఆహ్వానాన్ని ఆయన సున్నితంగా తిరస్కరించారు. తనకు బదులుగా తన సహచరుల్ని పంపుతానని చెప్పడం ద్వారా తన నిరసనాత్మక సంకేతాలను పంపినట్టు స్పష్టమవుతోంది. అంతేకాదు. ఇక మాట్లాడుకోవడాల్లేవ్..చేస్తే పనులు చేయండి..లేదంటే లేదు అని జవాబిచ్చినట్టయింది. ఇంకా చెప్పాలంటే చర్చలతో కాలం వెళ్లదీసే గడువు తీరిపోయిందని చంద్రబాబు దృఢంగా విశ్వసిస్తున్నట్టు కూడా అర్థమవుతోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలోనే మార్చి మొదటి వారం వచ్చేసింది. మార్చి అయిదు గడువు గడపలోకి రావడం వల్లే అమిత్ షా హడావుడి చేస్తున్నారని తెలుగుదేశం నేతలు భావిస్తున్నారు. పార్లమెంటులో కార్యకలాపాలకు విఘాతం కలగకుండా తెలుగుదేశం ఎంపీలను చర్చల్లో ఎంగేజ్ చేస్తే మేలుగా ఉంటుందని బీజేపీ అనుకుంటున్నదేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు పార్టీల మధ్య అనుమానపు గోడలు అందుకోలేనంత ఎత్తుకు వెళ్లిపోయాయి.

ఎంత కాదనుకున్నా..కేంద్రానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య రగులుతున్న నిధుల రగడ..బీజేపీకి తెలుగుదేశానికి మధ్య ఉన్న మిత్రత్వాన్ని..మళ్లీ రిపేరు చేయలేనంతగా దెబ్బతీసింది. నిజానికి నిధులు..మిత్రత్వం అనే రెండు అంశాలు పూలదండలో దారం వంటివే. విడివిడిగా చూడలేని అంశాలు. పైగా ఇవి రెండూ ఒకదానిమీద మరొకటి ఆధారపడినవి కూడా. హైదరాబాదులో రెండు రోజుల మజిలీ సందర్భంగా చంద్రబాబు ఒక విషయం స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు తమంతట తామే పొత్తు వద్దనుకుంటున్నారన్నది దాని సారాంశం. ఇది చంద్రబాబు నోటి వెంట రావడంతో దీనికి ఎక్కడ లేని ప్రాధాన్యత వచ్చింది. ఈ ఒక్క ప్రకటనతో చంద్రబాబు మనస్సులో ఏముందో తేలిపోయింది. రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న ఈ దశలో చంద్రబాబు అలా అంటారని ఎవ్వరూ ఊహించరు. అసలే ఆయన ఇలాంటి విషయాల్లో ఆచితూచి అడుగెయ్యడమే కాదు ఆంతకన్నా ఎక్కువ జాగ్రత్తతో మాట్లాడతారు. మనస్సులో ఏముందో తెలుసుకోవడానికి వీల్లేని భాషలో మాట్లాడతారు. పైగా రెండు పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకుల దగ్గర్నుంచి కేడర్ దాకా రోజూ వాగ్బాణాలు సంధించుకుంటున్న దశలో బీజేపీ అగ్రనేతలతో అమీతుమీ కాకుండా చంద్రబాబే స్వీయ జాగ్రత్తలు తీసుకుంటూ నెట్టుకొస్తున్నారు. తీవ్ర నిర్ణయం తీసుకోవడం సులభమే కాని ఆతర్వాత పరిణామాల సంగతేమిటన్నది ఆలోచించి మరీ అడుగేసే మనస్తత్వం ఆయనది. అలాంటి చంద్రబాబు ఒక అంకానికి దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టినంత పనిచేశారు. బీజేపీ నాయకులే మిత్రత్వం వద్దనుకుంటున్నారని చెప్పడం ద్వారా తెలుగుదేశం ఏదిశగా ఆలోచిస్తున్నదో చెప్పేశారు. అంటే కేంద్ర ప్రభుత్వం మీద.. కేంద్రంలోని కమలనాధుల మీద చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన వైఖరితో ఉన్నట్టు దీన్నిబట్టి అర్థమవుతోంది. చంద్రబాబు కావాలనే అలా అన్నారా లేక అన్యాపదేశంగా అన్నారా అన్నది ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ఆ ప్రకటన స్థాయి అలాంటిది. ఒకరకంగా బీజేపీతో ఇక సంబంధబాంధవ్యాలు లేనట్టేనని చెప్పినట్టు లెక్క. కాని చంద్రబాబు అంతటి బరువైన ప్రకటనలు సామాన్యంగా చేయరు. ఎప్పుడైనా చేయాల్సివస్తే చాపకింద నీరులా అమల్లోపెట్టేస్తారు తప్ప ఆర్భాటపు ప్రకటనలు చేయరు. దీనిమీద కమలనాధుల ఎందుకనో పెద్దగా స్పందించినట్టు లేరు. నిజంగానే చంద్రబాబు వరకు బీజేపీతో కటీఫ్ అయిపోయినట్టేనా? ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. కాని తనవైపు నుంచి ఆ ప్రక్రియ జరగకూడదని చంద్రబాబు భావిస్తున్నారు. అలాంటిది ఏది జరిగినా బీజేపీ వైపు నుంచేజరగాలని ఆయన భావిస్తున్నారు. తనకంటూ ఒకటిరెండు వ్యూహాలను ఆయన మదిలో సిద్ధం చేసుకుపెట్టుకున్నారు.




అందుకే పొత్తుల విషయంలో ఆయన పెద్దగా ఆందోళనతో ఉన్నట్టు లేరు. 2019లో వచ్చే సార్వత్రిక ఎన్నికల మీద ఆయన స్పష్టమైన అవగాహనతోనే ఉన్నారు. బీజేపీతో అంటకాగి కిందటిసారిలాగా చెట్టాపట్టాలేసుకుని ఎన్నికల వేదికల మీద జంటగా కనిపించే అవకాశాలను కమలనాథులే చేజేతులా కాలదన్నారని ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. అందులో వాస్తవం లేకపోలేదు. చంద్రబాబుతో సయోధ్యతో ఎన్నికల గోదారిని ఈదాలనుకుంటే ప్రధానమంత్రి మోడీ గాని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కాని ఇప్పటికే కలగజేసుకుని ఆంధ్రప్రదేశ్ హామీల విషయంలో సానుకూల కార్యాచరణను అమల్లోకి తెచ్చేవారు. ఇప్పట్లో అలాంటి వాతావరణమే కనిపించడం లేదని తెలుగుదేశం వర్గాలే అంటున్నాయి. అందువల్ల ఎలా చూసినా బీజేపీతో కలిసి వెళ్లడం తెలుగుదేశానికి క్షేమం కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపిస్తున్నది. ఈ విషయంలో చంద్రబాబు అంచనాలూ ఇదే తెలియజేస్తాయి. ఇక ఎన్నికలయ్యాక జాతీయస్థాయిలో పార్టీల బలాబలాలను బట్టి నిర్ణయం తీసుకోవడం మరో ప్రత్యామ్నాయంగా చంద్రబాబు భావిస్తున్నారు. మోడీ సారధ్యంలో ఎన్డీయే ఏస్థాయిలో సీట్లను గెలుచుకుంటుందో చూడాల్సి ఉంటుంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ గణనీయంగా ముందుకొచ్చి ఏదొక రకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఆలోచన చేస్తే తెలుగుదేశం ప్రత్యక్షంగానో పరోక్షంగానో మద్దతిచ్చే పరిస్థితులు ఉత్పన్నం కావచ్చు. లేదంటే బీజేపీ అరకొర స్థానాలతో తెరమీదికొస్తే..తెలుగుదేశం లాంటి పార్టీల మద్దతు అనివార్యమైతే చంద్రబాబు కీలకపాత్ర పోషించే అవకాశాలు రావచ్చు. అప్పుడు ఆయన రచించే వ్యూహం ఏమిటన్నదే ఆసక్తికరం. ఢిల్లీ లాబీల్లో జరుగుతున్న ఊహాగానాలను బట్టి చంద్రబాబు తనదైన శైలిలో పావులు కదపవచ్చు. నరేంద్ర మోడీతో ఇక్కట్ల పాలైన తాను మళ్లీ ఆయనకు అండగా నిలబడతారని రాజకీయ పండితులెవ్వరూ భావించడం లేదు. ఇలాంటి సందర్భాల్లో చంద్రబాబు రాజకీయ చాణక్యం ఎవ్వరి అంచనాలకు అందదని వారంటున్నారు. మోడీ స్థానంలో ఎల్‌కే అద్వానీని ప్రధానమంత్రి పదవికి తెరమీదికి తేగల అవకాశాలు రావచ్చని ఒక ఊహాగానం నడుస్తున్నది. అద్వానీని ప్రధానిని చేస్తే తమ మద్దతు ఉంటుందని చంద్రబాబు చెప్పడమే కాకుండా మరికొంత మంది తన సన్నిహిత జాతీయ రాజకీయ శ్రేయోభిలాషులను రంగంలోకి తెచ్చే అవకాశాలనూ వారు తోసిపుచ్చడం లేదు. తద్వారా ఆయన తాను అమితంగా గౌరవించే అద్వానీకి రాజకీయ వెలుగులు ప్రసాదించడంతో పాటు తనకు చుక్కలు చూపించిన మోడీ మీద ప్రతీకారం తీర్చుకున్నట్టు కాగలదన్నది విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. ఇప్పటికివన్నీ ఊహాజనితాలే అయినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల్ని బట్టి ఏదైనా నిజమయ్యే అవకాశాలున్నాయి. రాజకీయాలనేవి గుంభనంగా ఉన్న సముద్రమనుకుంటే.. లోపల్నుంచి ఎగదన్నుకొచ్చే అలలు ఏ దిశకైనా మరలగలవు..ఏ సునామీనైనా సృష్టించగలవన్నట్టు..నేడు అసాధ్యంగా కనిపించే పరిణామాలు కాలక్రమంలో సుసాధ్యాలు కావచ్చు. జాతీయ రాజకీయాల్లో ఎన్డీయే ప్రభుత్వం మీద ఏస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకత పనిచేస్తుందన్నదానిమీద ఈ ఊహాగానాలన్నీ ఆధారపడి ఉంటాయి. అందుకే చంద్రబాబు నాయుడు తన అమ్ముల పొదిలో ఒకటికి నాలుగు అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్డీయే కూటమిలో ఊపిరి సలుపని స్థితి నుంచి అదే ఎన్డీయేలో చక్రం తిప్పే పరిస్తితులు వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని చంద్రబాబు భావిస్తుండవచ్చు. వచ్చే పది నెలల కాలం దీనికి సమాధానం చెబుతుంది. చంద్రబాబు జాతీయ రాజకీయ ప్రయోజనాలను, సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని అడుగు లేయాలని భావిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూ డా కేంద్రం మీద, ప్రధాని మోడీ వ్యవహార శైలి మీదా అసంతృప్తి తో ఉన్న దరిమిలా ఎన్నికల తర్వాత ఢిల్లీలో వీళ్లిద్దరి భాగస్వా మ్యం కీలక పాత్ర పోషించగల అవకాశాలను కొట్టిపారేయలేం. జాతీయ స్థాయిలో సరికొత్త రాజకీయ వ్యవస్థ ఆవిర్భావానికి తాను సారథ్యం వహించడానికైనా వెనుకాడనని శనివారం తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనను ఈ నేపథ్యంలోనే చూడాల్సి ఉంటుంది.

కాంగ్రెస్, బీజేపీల మీద కేసీఆర్ సమరశంఖం పూరించారు. చంద్రబాబుకు కొత్తబలం సమకూరినట్టే భావించవచ్చు. కేసీఆర్ తాజా ప్రకటనతో జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా భారీ కుదుపుకి గురైనట్టు భావించాలి.

మొత్తం మీద ప్రధాని నరేంద్ర మోడీ మీద అస్త్రశస్త్రాలతో ఎన్నికల తర్వాతనైనా పోరాడేందుకు ఒక కొత్త సమ్మిళిత శక్తి చాపకింద నీరులా రూపుదిద్దుకుంటున్న వాతావరణం ఏర్పడుతున్నది!!


**- వయ్యెస్సార్ రెస్**

## సింగపూర్ ఆదర్శం!




సింగపూర్ మంత్రులకు ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంతగా గరిష్ఠ స్థాయిలో వేతనాలు ఇప్పటికే లభిస్తున్నాయట.అందువల్ల వారికి జీతాల పెంపుకోసం కేబినెట్ కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం తోసిపుచ్చింది.పార్లమెంటులో మెజారిటీ ఉన్న పార్టీకీ, ప్రతిపక్షంలో ఉన్నపార్టీకీ అనేక విషయాల్లో అభిప్రాయ భేదాలుంటాయి కానీ, జీతాలు,భత్యాలు పెంపు విషయంలో మాత్రం వాటి మధ్య ఎటువంటి భేదాలు ఉండవు. మన దేశంలోనే కాదు,చాలా దేశాల్లో పరిస్థితి ఇదే.ఇందుకు భిన్నంగా సింగపూర్ ప్రభుత్వం ఆలోచిస్తున్నందుకు అభినందించాల్సిందే. మంత్రులు, ప్రజా ప్రతినిధులు తమ వేతనాలనూ, భత్యాలనూ ఎప్పటికప్పుడు పెంచుకుంటూ పోవడమే కాకుండా, ఉద్యోగులకు కూడా వేతన సవరణ కమిటీల సిఫార్సుల పేరిట పెంచేస్తున్నారు. ఏ ఆధారమూ లేని సామాన్యుల సంగతి గురించి ఎవరూ ఆలోచించడం లేదు. 2012 తర్వాతమంత్రుల వేతనాలు పెంచాలన్న అంశంపై పరిశీలన జరిపేందుకు ఒక కమిటీని నియమించారు.ఆ కమిటీ వేతనాల పెంపునకు సిఫార్సు చేసింది.అయితే, ఇప్పటికే గరిష్ఠ స్థాయిలో వేతనాలు తీసుకుంటున్న మంత్రులకు ఇంకా పెంచడం న్యాయం కాదని ప్రభుత్వం ఈ సిఫార్సును తోసిపుచ్చింది. సింగపూర్‌ని అన్ని విషయాల్లో ఆదర్శంగా తీసుకుంటున్న మన వాళ్ళు మంత్రుల వేతనాల పెంపునకు నో చెప్పడంలో కూడా ఆదర్శంగా తీసుకుంటారా? అన్నదే అంతుచిక్కని ప్రశ్న.సింగపూర్ మాదిరిగా భవనాలుకట్టాలనీ, నిర్మాణాలు సాగించాలని ఆరాట పడుతున్న వారికి నిజంగా ఇది క్లిష్టమైన పరీక్షే.

## మర పోలీసులొస్తున్నారు!




నేరస్థులను పట్టుకోవడానికి మరమనుషుల సేవలు జంట నగరాల్లో అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సదస్సులో మరమనిషికి (రోబోకి) వస్త్రాలు కట్టి వేదికపై స్టాండ్ వద్ద నిలబెట్టి మాట్లాడించారు. రోబో ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.కారణం మనుషుల్లో కనుమరుగు అవుతున్న మానవత్వం గురించి గుర్తు చేయడమే. మనసే మనిషికి శాపం అని ఒక పాత సినిమాలో ఆచార్య ఆత్రేయ అంటారు.ఏనాడో నలభై ఏళ్ళ క్రితం ఆయన రాసిన ఆ పాట నేటి కాల మాన పరిస్థితులకు కూడా చక్కగా వర్తిస్తుంది.అయితే, రోబోలు మనసు లేకుండా పని చేస్తాయంటే పొరపాటే. నిర్ణీతమైన ఆదేశాల ప్రకారం అవి తమ పని చేసుకుంటూ పోతాయి.హైదరాబాద్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు నగర పోలీసు శాఖ షీటీమ్స్‌ని ఏర్పాటు చేసింది.అవి బాగా పని చేస్తున్నట్టు ఇప్పటికే పౌరుల నుంచి ప్రశంసలను అందుకన్నాయి. చదువు,మంచి ఉద్యోగాలు చేసే మహిళలు క్యాబ్‌లలో వెళ్ళాలంటే భయపడే పరిస్థితులు మన హైదరాబాద్ లోనే కాకుండా,ముంబాయి,చెన్నై వంటి మహానగరాల్లో కూడా దాపురించాయి. అలాంటి దారుణ పరిస్థితుల్లో మహిళలు ఒక్క ఫోన్ కాల్ చేస్తే వచ్చి సాయపడేందుకు షీటీమ్స్‌ని ఏర్పాటు చేశారు.వీటిని చెన్నైకి చెందిన కొద్ది మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తయారు చేశారు.

వారి ప్రతినిధి శరత్ ఈ రోబో గురించి వివరిస్తూ దీనికి మిత్రా అని పేరు పెట్టినట్టు చెప్పారు. ఇది గంటకు 30 కిలోమీటర్ల వేగంలో పరుగెత్తగలదు. మర మనిషి కనుక దానికిఆ శక్తి ఉంది.మామూలు పోలీసులకు అది సాధ్యం కాదు. దానికి సరైన సమాచారాన్ని ఫీడ్ చేస్తే నేరం జరిగిన ప్రదేశం వివరాలనూ, మ్యాప్‌తో సహా అందిస్తుంది నేరస్థుల వేటలోఉపయోగ పడే మిత్రా రోబోతో నేరస్థులను పట్టుకోవడం చాలా తేలిక అంటున్నారు పోలీసు అధికారులు.




**ఆదిత్యహృదయం**

**వి.ఎస్.ఆదిత్య**

# అనుకున్నామని జరగవు అన్నీ

అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని అన్నారు మనసుకవి ఆత్రేయ ఒక పాటలో. ఎంతబాగా చెప్పారు!? 1992 జూన్‌లో నేను విజయవాడ పి.బి. సిద్ధార్థ కాలేజీలో బీఎస్సీ డిగ్రీ పూర్తిచేసి మద్రాసు రైలెక్కాను. రావికొండలరావు గారిల్లు వెతుక్కుంటూ రోజంతా తిరిగి తిరిగి మర్నాడు మళ్లీ విజయవాడ వెళ్లిపోయాను. మళ్లీ ఒక రేడియో నాటకం రాసి, ఆ డబ్బులు దాచుకుని, కొన్నాళ్లకి మద్రాసు రైలెక్కాను. మళ్లీ రావి కొండలరావు గారింటి ఎడ్రస్సు కోసం కాళ్లరిగేలా తిరిగితే ఈసారి ఎస్. జానకి గారిల్లు దొరికింది. గుమ్మంలో నించున్న జానకిగారి భర్త రావి కొండలరావు గారింటి చిరునామా చెప్పారు. తీరా నేను వెళ్లేసరికి కొండలరావు గారూ, వారి సతీమణి సింగీతం శ్రీనివాసరావు గారి దర్శకత్వంలో చందమామా విజయా కంబైన్స్ నిర్మిస్తున్న బృందావనం సినిమా నిమిత్తం తిరుపతిలో ఉన్నారని తెలిసింది. సరే అని ఈసారి విజయవాడ వెళ్లకుండా తిరుపతి బస్సెక్కాను. షూటింగు ఎక్కడ జరుగుతోందో ఎవ్వరూ చెప్పలేదు. ప్రతీ పెద్ద హోటలూ వెతికాను సినిమా వాళ్లెవరైనా దిగారా అని. ఈ బృందావనంలో రాజేంద్రప్రసాద్, రమ్యకృష్ణ హీరో, హీరోయిన్లు. అసలు రావికొండలరావు గారినే ఎందుకు ట్రై చేస్తున్నానంటే, ఒక కారణం ఉంది. నేను ఆరో క్లాసు చదువుతున్నప్పటి నుండి పదో క్లాసు దాకా, ఆ అయిదేళ్లు ప్రతి ఉగాదికి ఉగాది శుభాకాంక్షలతో... మీ రావికొండల రావు అని ఒక పోస్టు కార్డు వచ్చేది.

మేమేఊరు ట్రాన్స్‌ఫర్ అయినా, ఏ ఇల్లు మారినా, పేరు కింద, క్లుప్తంగా ఇంటి ఎడ్రస్సు స్టాంపు ఉండేది. ఇంత ఠంచనుగా శుభాకాంక్షలు పంపే సినిమా సెలబ్రిటీని మా ఇంట్లో చూడలేదు. పైగా వేరే కార్యక్రమం కోసం ఓసారి ఏలూరొచ్చినపుడు, తర్వాత విజయవాడలో కె. విశ్వనాథ్‌గారు, ఎస్. జానకిగారు వంటి వారితో కలిసొచ్చినపుడూ రావికొండలరావు గారు మా నాన్నగారిని పిలిపించుకుని మరీ మాట్లాడడం నాకు పాజిటివ్ హింట్ ఇచ్చింది. అందుకని ఇండస్ట్రీకి ముందు ఆయన త్రూ వెళ్తే బెటరన్న ఆలోచన, పూర్తిగా ఆయనపైనే ఆధారపడకుండా అప్పటికే రామ్‌గోపాల్ వర్మ, దాసరి, రాఘవేంద్ర రావు గార్ల కాంపౌండ్లలో చిరు ప్రయత్నాలు చేయడం, అవి ఫలించక పోవడం జరిగిపోయాయి. మోహన్‌బాబు, అక్కినేని నాగేశ్వరరావు గార్ల దగ్గర కూడా రెండు ప్రయత్నాలు వర్కవుట్ కాలేదు. టి.సుబ్బిరామిరెడ్డి గారు ఆప్యాయంగా మాట్లాడారు కానీ ఆయన రికమెండేషన్ కూడా సారథీ స్టూడియోలో పనిచేయలేదు. ఇలా ప్లాన్ బి, సి, డి. ఈ, ఎఫ్ లన్నీ బెడిసికొడుతున్నాయి గానీ ప్లాన్ ఏ ని మాత్రం ఇంకా కలవలేదు. ఆలోచించుకుంటూ, భయపడుతూ, నీరసపడుతూ, చిరాకు పడుతూ, తిరుపతి బస్టాండ్ ఎదురుగా మెయిన్ రోడ్డు మీద నడిచి వెళ్తున్న నాకు, ఒక డీసీఎమ్ వ్యాన్ కనపడింది. చందమామా విజయా కంబైన్స్ అని పెయింట్ వేసి ఉన్న అక్షరాలతో. చాలా దూరం పరుగెత్తాను అది వెళ్లిన వైపు. ఒక దగ్గర మిస్సయ్యాను. వెనక్కి వచ్చి అది ఎక్కడినుంచి వచ్చిందో అక్కడికి వెళ్లాను. అక్కడ చందమామ అని ఒక చిన్న లాడ్జి కనపడింది. ఇదేంటి ఇన్ని పెద్ద హోటల్స్ వదిలేసి రాజేంద్రప్రసాద్, రమ్యకృష్ణ సింగీతం గారు, కొండలరావుగారు, రాధాకుమారి గారు ఇలాంటి




స్టార్స్ అంతా ఈ చిన్న లాడ్జిలో ఉంటారా? అని ఆశ్చర్యం వేసింది. కొంత చిరాకు కూడా వేసింది. అయినా సాయంత్రం దాకా వెయిట్ చేశాను. రాత్రి పదయినా ఆ వ్యాన్ వెనక్కిరాలేదు. ఈ వెయిటింగ్‌లో రెండు సినిమాలు చూశాను చుట్టుపక్కల థియేటర్లలో. సినిమా కష్టాలకి సినిమాలే విరుగుడు. మర్నాడు ఉదయం ఆరున్నరకే వెళ్లాను ఆ హోటల్‌కి వ్యాన్ పార్క్ చేసి ఉంది. ప్రాణం లేచొచ్చింది. పదిన్నర, పదకొండు గంటల మధ్య పెద్ద పెద్ద క్యారేజీలు పెట్టుకుని ఆ వ్యాన్ బైల్దేరబోతుంటే, లైట్ లాల్చీ, లైట్ పైజమా వేసుకున్న ఒక పెద్దాయన్ని కలిసి నన్నుకూడా లొకేషన్‌కి తీసుకెళ్లమని బతిమాలాను. ఆ వ్యాన్‌లో లోపలన్నీ క్యారేజీలు, బుట్టలు, ముందు సీట్‌లో డ్రైవరు పక్కన ఆయన, ఆయన అసిస్టెంటూ. కుదరదన్నాడు. రావి కొండలరావు గారి ఉగాది శుభాకాంక్షలు పోస్ట్ కార్డ్ చూపించాను. కొంచెం నమ్మారు. కానీ ప్లేస్ లేదు కదా ఎలా వెళ్లడం అన్నారు. సాయంత్రం వాళ్లుంటున్న విష్ణుప్రియ హోటల్‌కి వెళ్లి కలవమన్నారు. అప్పటి వరకూ ఆగలేక, ఆ డీసీఎమ్ వ్యాన్ వెనకాల ఫుట్ రెస్ట్ మీద నించుని వెళ్లాను లొకేషన్‌కి. డ్రైవర్‌కి పది రూపాయలిచ్చి, బతిమాలి. ఒక ఇంటి బైటి షూటింగ్, కూరగాయలవాడితో బేరమాడుతూ కొట్టుకుంటున్న మొగుడూ పెళ్లాలుగా రావికొండలరావు గారూ, రాధాకుమారి గారూను. చుట్టూ వాళ్లని చూస్తూ నవ్వుతున్న షూటింగ్ జనం, బైట జనం కూడా, వాళ్లషాట్స్ అయ్యేవరకూ వెయిట్ చేశాను. లంచ్ బ్రేక్‌లో అదే లైట్ అండ్ వైట్ పెద్దాయనకి ఆ పోస్టు కార్డు ఇచ్చి, అందులోటు ఎడ్రస్ ఉన్న చోట మానాన్న పేరు చూపించి, వీళ్లబ్బాయి వచ్చాడని చెప్పండి అన్నాను. కాస్సేపటి తర్వాత కొండలరావుగారు ఇంటి బైటకి వచ్చారు. నాకోసం, ఆ పోస్టు కార్డు పట్టుకుని. అప్పటికే నా ప్రయత్నాల ఫలితంగా నాకొక అభిప్రాయం ఏర్పడింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా జాయిన్ అవుతాను అన్న వెంటనే ఎవ్వరూ తీసుకోరని, కొన్నాళ్లు వెయిట్ చేయిస్తారని, లేదా చేయిస్తారని, అందుకని కొండలరావు గారి దగ్గిర వేరే ప్రయత్నంతో ఎప్రోచ్ అయ్యాను. పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామ్ పాసయ్యాక, ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు వాళ్లు ఏదైనా ఒక సినిమాకి అప్రెంటిస్‌గా అయినా పనిచేసినట్లు ఒక లెటర్ అడిగారు. నేను ఎగ్జామ్ పాసయ్యాను అప్పటికే. మా ఇంట్లో తెలీకుండా, ఆ లెటర్ కావాలని అడిగాను. అందుకోసం ఓ నాల్రోజులు జస్ట్ షూటింగ్ అబ్జర్వ్ చేసి వెళ్లిపోతాను, పర్మిషన్ ఇవ్వమని రిక్వెస్ట్ చేశాను. ఆయన చాలా క్యాజువల్‌గా టెక్ట్స్ పుస్తకాలు చదివితే సినిమాలు తియ్యడం రాదయ్యా. ఆ మూడేళ్లూ ఎవరిదగ్గరైనా పనిచేస్తే నువ్వే డైరెక్టర్ అయిపోతావ్ అన్నారు. అయితే ఎవరి దగ్గరైనా పెడతారా సర్ అని అడిగాను వెంటనే. బానే ఉంది. నీ తలమీద ఏదో ఉందిరా అంటే, చూశావ్ కదా, నువ్వేతియ్ అన్నాట్ట వెనకటికి నాలాంటి వాడొకడు. అని నన్నే ట్రై చేస్కోమన్నారు. నాకెవ్వరు ఇస్తారు అవకాశం? ఎందుకిస్తారు? సరే, ట్రై చేసుకుంటాను సర్. కానీ ఎందుకైనా మంచిది ఓ నాల్రోజులు షూటింగ్ కూడా చూస్తాను. మీరేమీ అనుకోనంటే. ఒకవేళ ఎక్కడా అవకాశం రాకపోతే కనీసం మీ లెటర్‌తో పుణె అయినా వెళ్లిపోతాను అన్నాను. అయిష్టంగానే ఓ నాల్రోజులు షూటింగ్ చూడనిచ్చారు ఆయన. నేను ఇరవై రోజులు రోజూ క్రమం తప్పకుండా షూటింగ్ చూసేశాను. వేలు పెట్టే సందిచ్చారాయన. కాలుపెట్టేశాన్నేను. అనుకున్నాను. తర్వాత వాళ్లు చెన్నై, నేను విజయవాడ వెళ్లిపోయాం. ఆ తర్వాత నాకే అవకాశమూ రాలేదు. పిలుపూ రాలేదు. ఎనిమిది నెలలు రావికొండలరావు గారికి ఠావులకు ఠావులు ఉత్తరాలు రాసేవాడిని. ఆయన ఆ ఇరవై రోజుల్లో షూటింగ్‌లో ఒకసారి అడిగారు. మీ ఇంట్లో చెప్పివచ్చావా అని. అప్పుడు మానాన్నకి ఇష్టమే సర్. ఆయనే మిమ్మల్ని కలవమన్నారు. అని ఠక్కున అబద్ధం చెప్పేశాను. నా ఏ ఒక్క ఉత్తరానికీ రావికొండల రావుగారి దగ్గిరనుంచి సమాధానం లేదు. నా దగ్గిర డబ్బుల్లేవు. ఇంట్లో సినిమాల్లో ట్రై చేస్తున్నానని తెలీదు. నేను చెప్పలేదు. తర్వాతేమైందో వచ్చేవారం...

**-మీ వి.ఎస్.ఆదిత్య**

# ఈశాన్యం కాషాయం!

**● 20కి చేరిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సంఖ్య ● కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యానికి చేరువలో బీజేపీ**
**● త్రిపుర... నాగాలాండ్‌లో కమల వికాసం ● మేఘాలయలోనూ ప్రభుత్వ ఏర్పాటుకు ఎత్తుగడ**

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంలో బీజేపీ మరో రెండడుగులు ముందుకు వేసింది. ఈశాన్యంపై కాషాయ ముద్ర వేసింది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత కాషాయ పార్టీ ఇంతింతై.. వటుడింతై అన్న చందాన వ్యాపి చెందుతోంది. గత నాలుగేళ్లలో అనూహ్యంగా పుంజుకుంది. మిజోరాంను మినహాయిస్తే, ఈశాన్య భారతంలో కమల వికాసం పూర్తయినట్లే. 2014 వరకు కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితం అయిన బీజేపీ, ఇప్పుడు ఏకంగా 20 రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది. కొన్నిచోట్ల సొంతంగానూ, మరికొన్ని చోట్ల మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. ఇందుకు నరేంద్ర మోడీ అభివృద్ధి నినాదం కమలవికాసానికి సంజీవనిగా పని చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారం చేజిక్కించుకునే వ్యూహంతో బీజేపీ దూకుడు పెంచినట్లు తెలుస్తోంది. తాజాగా వెల్లడైన మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లోనూ కమల నాథులదే పైచేయి అయింది. త్రిపురలో పాతికేళ్లు అధికారంలో ఉన్న కామ్రేడ్ల కంచు కోట ను బద్దలు కొట్టి విజయ దుందుభి మోగించింది. మిత్రపక్షం ఐపీఎఫ్‌టీతో కలిసి నలభైకి పైగా స్థానాలను నెగ్గింది. నాగాలాండ్‌లోనూ అధికారం నిలబెట్టుకుంది. మేఘాలయలోనూ ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఎత్తుగడలు వేస్తున్నది. ఈ వ్యూహం ఫలిస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతుంది.

2017 నుంచి బీజేపీ వ్యూహాలకు పదును పెరిగింది. విజయకాంక్షతో దూకుడు పెంచింది. వరుస విజయాలతో జైత్రయాత్ర ప్రారంభించింది. 2016లో అసోం, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎన్నికలు జరగ్గా, ఒక్క అసోంలో మాత్రమే బీజేపీ అధికారంలోకి వచ్చింది. మిగతా నాలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలే



గెలిచాయి. కానీ 2017లో పరిస్థితులు పూర్తిగా మారాయి. పంజాబ్, గోవా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గుజరాత్, హిమాచల్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగ్గా, బీజేపీ తిరుగులేని విజయాన్ని నమోదుచేసింది. పంజాబ్ మినహా అన్ని రాష్ట్రాల్లో కాషాయపార్టీ రెపరెపలాడింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు.. బీజేపీకి రాజకీయంగా కీలకమైంది. 8 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మోడీ-షా వ్యూహాలకు అసలు సిసలైన పరీక్షగా విశ్లేషకులు గిరిగీశారు. అయితే ప్రథమార్థంలో జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ గట్టెక్కింది. ఆశించిన దానికంటే ఎక్కవ మార్కులే సాధించింది. పేరుకు చిన్న రాష్ట్రాలే అయినా చైనా, బంగ్లా, మయన్మార్ దేశాలతో సరిహద్దు కలిగివున్నందున ఇవి ఎన్డీయేకి కీలక రాష్ట్రా లుగానే పరిగణించబడ్డాయి.

**మరో ఐదడుగులు వేస్తే..**

ఈ యేడాది ఇంకో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి ఓటింగ్ శాతం కీలకం. కర్నాటక, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.

వీటిలో కర్నాటక, మధ్య ప్రదేశ్, రాజస్థాన్ పెద్ద రాష్ట్రాలు. అటు రాహుల్ నాయకత్వానికి, ఇటు మోడీ పాలనాదక్షతకు ఒకర కంగా అగ్నిపరీక్షే. కర్నాటకపై ఇప్పటికే ఈ రెండు పార్టీలు దృష్టిసారించాయి.

**కాంగ్రెస్‌కు మిగిలింది 3 రాష్ట్రాలే**

గత నాలుగేళ్లలో.. రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చేదు అనుభవాలే మిగిలాయి. ఒక్క పంజాబ్‌ను మినహాయిస్తే, దేశంలో హస్తవాసి తగ్గుముఖం పట్టిందన్నది వాస్తవం. ఒక వైపు బీజేపీ ఒక్కో రాష్ట్రాన్ని తన గుప్పిట్లోకి తీసుకుంటూ ముందుకు వెళ్తుంటే, కాంగ్రెస్ మాత్రం అస్త్ర సన్యాసం చేస్తున్న పరిస్థితి. ప్రస్తుతం కాంగ్రెస్ మూడు రాష్ట్రాలకే పరిమితం అయింది. కర్నాటక, పంజాబ్, మిజోరాం మాత్రమే మిగిలాయి. తాజాగా ఫలితాలు వెలువడిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు అసంతృప్తే మిగిలింది. పట్టు నిలుపుకోవాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ప్రాభవం పెరగడం మాట అటుంచింతే, ఉనికికే ముప్పు రావడం కలవర పరిచే అంశం. ముఖ్యంగా త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఉనికి చాటుకోలేని దుస్థితి ఏర్పడింది. మేఘాలయ కాంగ్రెస్‌కు కంచుకోట. ఇక్కడ 40 ఏళ్ల పాటు హస్తం పార్టీ పరిపాలన సాగింది. కానీ ఈసారి ప్రాభవం తగ్గింది. హంగ్ ఏర్పడింది. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు అసాధ్యమన్నది రాజకీయ వర్గాల విశ్లేషణ. కాగా, ఇక్కడ కూడా ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కమలనాథులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

**ఆదేశిస్తే... పగ్గాలు స్వీకరిస్తా: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లాబ్ దేబ్**

పాతికేళ్ల వామపక్ష కూటమి పాలనకు బీజేపీ ముగింపు పలికింది. ఎర్రకోటను బద్దలు కొట్టింది. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు తాను సిద్ధమేనని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిప్లాబ్ కుమార్ దేబ్ స్పష్టం చేశాడు. అయితే, ఎవరిని సీఎం పీఠంపై కూర్చోబెట్టాలన్న విషయంలో పార్టీ పార్లమెంటరీ బోర్డుదే అంతిమ నిర్ణయమని ఆయన తెలిపారు. ఇప్పటికే పార్టీ నాకు పెద్దబాధ్యతలు అప్పగించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నాకు అప్పగించిన బాధ్యతలను శక్తిమేరకు నిర్వహించాను. ఇకపై ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వినమ్రంగా స్వీకరిస్తాను అని దేబ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# 'ఎర్ర'కోట బద్దలైంది!

**● త్రిపురలో 20 ఏళ్ల మాణిక్ సర్కార్ పాలనకు తెర ● 43 స్థానాల్లో కమలం గెలుపు**
**● ఐపీఎఫ్‌టీతో బీజేపీ కూటమి ● 16 సీట్లకు కమ్యూనిస్టులు పరిమితం**



**న్యూఢిల్లీ :** కమ్యూనిస్టులకు షాక్.. 25 ఏళ్ల పాటు సుస్థిర స్థావరం ఏర్పర్చుకున్న సీపీఎంకు బీజేపీ ఎన్నికల రూపంలో కోలుకోలేని దెబ్బ కొట్టింది. బీజేపీ, ఐపీఎఫ్‌టీ కూటమి త్రిపురలో బీజేపీ జెండా పాతింది. వామపక్ష పాలనకు చరమ గీతం పాడుతూ బీజేపీ కూటమి సంచలన విజయం తన ఖాతాలో వేసుకుంది. బీజేపీలో మళ్లీ హోలీ పండుగ వాతావరణ కనిపిస్తున్నది. త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. 2013లో మొత్తం సీట్లు 49 రాగా, 2018 ఎన్నికల్లో మాత్రం కేవలం 16 సీట్లు మాత్రమే రాబట్టుకోగలిగింది. 2013 ఎన్నికల్లో బీజేపీ అసలు ఖాతా తెరవలేకపోయింది. కానీ ఈ సారి ఏకంగా 43 స్థానాలు కైవసం చేసుకుని త్రిపురలో బీజేపీ జెండా ఎగువరవేయడానికి సిద్ధంగా ఉంది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తంగా 60 స్థానాలు ఉండగా, 59 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించారు. సీపీఎం అభ్యర్థి చనిపోవడంతో ఒక స్థానం వాయిదా వేయడం జరిగింది.

త్రిపురలో గత మూడు దశాబ్దాలుగా లెఫ్ట్




డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారంలో ఉండగా, యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రతిపక్షంగా ఉంటూ వచ్చాయి. సెక్యూలర్ భావాజాలం ఉన్న త్రిపుర ప్రజలు బీజేపీని ఛీ కొడుతూనే వచ్చారు. హిందుత్వ ఎజెండాయే కమల దళం లక్ష్యం కావడంతో ఎవరూ ఆదరించలేదు. కానీ 2018 ఎన్నికల్లో మాత్రం బీజేపీ చరిత్ర సృష్టించింది.

బీజేపీ సొంతంగా 35 సీట్లు రాబట్టుకోగా, కూటమిగా ఉన్న ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) 8 సీట్లు సాధిం చుకోగలిగింది. కూటమిగా కలిసి హౌస్‌లో మెజార్టీ సాధించడంతో ప్రభుత్వాన్ని ఏర్పర్చే సత్తా ఉందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. 1988 నుంచి త్రిపురలో సీపీఎం కంచుకోటగా పేరు తెచ్చుకుంది. కాంగ్రెస్-త్రిపుర ఉపజాతి జుబ సమితి కలిసి త్రిపుర ప్రజలను పాలిస్తూ వచ్చారు. నమోదైన ఓట్లలో కేవలం బీజేపీనే సుమారు 42 శాతం ఓట్లను రాబట్టుకోగలిగింది. బీజేపీతో జత కట్టిన ఐపీఎఫ్‌టీకి 8శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి.

| పార్టీ | శాతం | ఓట్లు |
|---|---|---|
| బీజేపీ | 46.8 | 9,89,134 |
| సీపీఎం | 45.0 | 9,80,057 |
| ఐపీఎఫ్‌టీ | 07.5 | 1,73,603 |
| ఐఎన్‌సీ | 01.8 | 40,943 |
| సీపీఐ | 0.8 | 19,352 |
| ఆర్‌ఎస్‌పీ | 0.8 | 17,568 |
| ఐఎన్‌పీటీ | 0.7 | 16,255 |
| ఏఐఎఫ్‌బీ | 0.6 | 13,115 |
| ఏఐటీసీ | 0.3 | 6787 |
| ఏఎంబీ | 0.2 | 5614 |

**డబ్బు, అధికారంతో గెలుపు : సీతారాం ఏచూరి**

బీజేపీ డబ్బు, అధికారాన్ని ఉపయోగించింది. వామపక్ష వ్యతిరేక శక్తులను కూడగట్టుకుని గెలుపొందింది. డబ్బులు కూడా బాగా పంచారు. బీజేపీ అధికారంలోకి వచ్చినా 45 శాతం ఓట్లు సీపీఎంకు వచ్చాయి. పార్టీ గుర్తుకు ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. ఓటమిని ఛాలెంజ్‌గా తీసుకుంటాం. బీజేపీ ధనదాహానికి కల్లెం వేస్తాం. గట్టిపోటీనే ఇచ్చాం.

## యువతలో మాణిక్‌పై అసంతృప్తి

**● సీపీఎం నాయకులకే ఉద్యోగాలు ● పకడ్బందీగా అమలుకాని లా అండ్ ఆర్డర్ ● మాణిక్‌ను ముంచేసిన ఉద్యోగులు**

**త్రిపుర :** త్రిపురలో 20 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు తెరపడింది. జనవరిలో సీఎంగా ఉన్న మాణిక్ సర్కార్ ఇంటర్వ్యూలో బహిరంగంగా ఓ సవాల్ చేశారు. దీన్ని బీజేపీ స్వీకరించింది. త్రిపురలో కమ్యూనిస్టు పాలనకు తెరదించి బీజేపీ రావడం అసంభవం. చాలెంజ్ చేస్తున్నా. బీజేపీ అధికారంలోకి రావాలనుకుంటే ముందు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగండి. వాళ్లు ఏం సమాధానం చెప్తారో చూడండి అని సవాల్ చేశారు. కానీ శనివారం ఆయన చేసిన సవాల్‌ను బీజేపీ సీరియస్‌గానే తీసుకుని కమ్యూనిస్టు కంచుకోటను కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకుంది. 25 ఏళ్ల కమ్యూనిస్టుల పాలనలో 20 ఏళ్లు మాణిక్ సర్కార్ ఏకధాటిగా పాలించారు. అసెంబ్లీ స్థానాలు పొందడంలో కూడా లెఫ్ట్ చరిత్రను లిఖించింది. 1998లో గిరిజనులు, బెంగాలీలు అందరూ కలిసి సీపీఎంకు అధికారాన్ని కట్టబెట్టారు. కొన్ని ప్రధాన అంశాలు మాణిక్ సర్కార్ ప్రభుత్వాన్ని కూలిపోవడానికి కారణాలు అయ్యాయి. బంగ్లాదేశ్ నుండి తరుచూ వచ్చిన తిరుగుబాటుదారులు రాష్ట్రంలో హింసాకాండను సృష్టించారు. దీంతో లాండ్ఆర్డర్‌ను అమలు చేయడంలో మాణిక్ ఘోరంగా విఫలం అయ్యారు. సరిహద్దు సమస్యను కూడా పరిష్కరించడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవడం కూడా ప్రధాన కారణం. రాజకీయ సంక్షోభానికి కూడా దారి తీసిందని చెప్పుకోవచ్చు. గిరిజనులు, బెంగాలీలకు అనుకూలంగా వ్యవహరించకపోవడం కూడా ఓ కారణం. 60 స్థానాల్లో 20 స్థానాలు గిరిజన నియోజకవర్గాలే ఉన్నాయి. ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల తిరుగుబాటు ఉంది. ఉద్యోగుల్లో చాలా మంది సీపీఎం వాళ్లు ఉన్నారు. వీరంతా ఇప్పటికీ నాల్గో వేతన కమిషన్ కిందే ఉన్నారు. బీజేపీ వీరికి అనుకూలంగా ఉంటానని మాట ఇవ్వడంతో బీజేపీ వైపు వెళ్లినట్టు తెలుస్తున్నది. కమిటీ వేసి ఏడో వేతన కమిషన్ అమలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. యువత కూడా మాణిక్ సర్కార్‌కు వ్యతిరేకంగా వ్యవహరించింది. సీపీఎం కార్యకర్తలకే ఉద్యోగాలు ఇవ్వడానికి మాణిక్ దృష్టిసారించారు. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. అభివృద్ధిలో కూడా సీపీఎం తనదైన ముద్ర వేసుకోలేకపోయింది. ఫలితంగా యువత సీపీఎంపై తిరుగుబాటు చేసింది. నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

# నాగాలాండ్‌లో బీజేపీ కూటమిదే హవా





**కొహిమా:** ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లోనూ బీజేపీ హవా కొనసాగింది. నాగాలాండ్‌లో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీ, ఎన్డీపీపీ కూటమి 27స్థానాల్లో విజయం సాధించగా, అధికారక ఎన్పీఎఫ్ కూటమి 29స్థానాల్లో విజయం సాధించింది. నాలుగు స్థానాల్లో ఇతరు అభ్యర్థులు గెలుపొందారు. కాంగ్రెస్ ఒక్కస్థానంలోనూ విజయం సాధించలేకపోయింది. ఇరు కూటములు హోరాహోరు పోరులో గెలుపు ముంగిట ఆగిపోవటం గమనార్హం. అయితే కేంద్రంలోని మోదీ సర్కారుకు ఈ రెండు కూటములు మిత్రపక్షాలే కావటంతో బీజేపీ కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బీజేపీతో ఒప్పందంలో భాగంగా నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగెసివ్ పార్టీ (ఎన్డీపీపీ) మొత్తం 40 నియోజకవర్గాల్లో పోటీ చేయగా, బీజేపీ 20స్థానాల్లో పోటీ చేసింది. తాజా ఫలితాలను పరిశీలిస్తే బీజేపీ 20 స్థానాలకుగాను 13స్థానాల్లో విజయం సాధించింది. ఇది ఒకరకంగా బీజేపీకి చెప్పుకోదగ్గ విజయంగా చెప్పుకోవచ్చు. గత 2013లో బీజేపీ కేవలం ఒక స్థానంలో మాత్రమే విజయం సాధించగలిగింది.

తాజా ఫలితాలను పరిశీలిస్తే బీజేపీ, ఎన్డీపీపీ కూటమి 27సీట్లను మాత్రమే సాధించగలిగింది. మరోవైపు అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్) కూటమి 29స్థానాల్లో విజయం సాధించి అధికారాన్ని అందించే మేజిక్ ఫిగర్ 31కు కేవలం రెండుస్థానాల దూరంలో ఆగిపోయింది. ఈ తరుణంలో నాలుగు స్థానాల్లో విజయం సాధించిన ఇతరులు ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించనున్నారు. వీరు ఏ కూటమివైపు మొగ్గు చూపితే ఆ కూటమికే అధికారం లభించనుంది. అయితే మొత్తం 60సీట్లలో 29స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద కూటమిగా ఏర్పడిన ఎన్పీఎఫ్ మాత్రం బీజేపీతో పొత్తు విషయంలో నోరు మెదపటం లేదు. మరోవైపు నాగాలాండ్‌లో బీజేపీ అధిష్ఠానం కొత్త, పాత మిత్రుల కలయికతో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా పావులు కదుపుతోంది.

నాగాలాండ్‌లో బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అవసరమైతే ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని ఆయన అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైతే ఇతర పార్టీల మద్దతు తీసుకుంటామని బీజేపీ నాగాలాండ్ ఇంచార్జి, కేంద్ర మంత్రి కిరణ్ అధికారక ఎన్పీఎఫ్ కూటమితో పొత్తు గురించి పరోక్షంగా చెప్పారు.

**నాగాలాండ్ ప్రజలకు మోడీ కృతజ్ఞతలు**

నాగాలాండ్‌లో బీజేపీ కూటమిని గెలిపించినందుకు ప్రధాని మోడీ ఆ రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నాగాలాండ్ సోదరీ సోదరులకు నేను మాట ఇస్తున్నాను. నాగాలాండ్ సమగ్ర అభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేస్తాను అని పేర్కొన్నారు. విజయం కోసం అవిరామంగా పనిచేసిన స్థానిక బీజేపీ నేతలను అభినందిస్తున్నాను అని ట్విట్టర్ వేదికగా తెలిపారు.

నాగాలాండ్ ముఖ్యమంత్రి, నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్) అభ్యర్థి టీఆర్ జీలియాంగ్ తన పెరెన్ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికయ్యారు. శనివారం వెలువడిన ఫలితాలును పరిశీలించగా ప్రత్యర్థి ఎన్డీపీపీ కూటమికి చెందిన ఇహిరీయి ఎన్‌డాంగ్‌పై 5,432 ఓట్లతేడాతో విజయం సాధించారు. జీలియాంగ్ మొత్తం 14,064 ఓట్లు సాధించగా, ఎన్‌డాంగ్ 8,632 ఓట్లు సాధించారు.



# శూన్యం నుంచి శిఖరాగ్రానికి ప్రస్థానం

**● తిపుర గెలుపు హత్యారాజకీయాలకు చెంపపెట్టు ● బీజేపీ కార్యాలయంలో ప్రధానికి సన్మానం ● త్రిపుర విజయం ....ప్రజాస్వామ్య విజయం ● అమరులకు అంకితం: మోడీ ● సీఎంను ఎంపికి చేసేందుకు పరిశీలకులను నియమించిన పార్టీ**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** త్రిపురలో బీజేపీ అఖండ విజయంతో కొత్త శకం ఆరంభమైందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. త్రిపుర సహా అన్ని రాష్ట్రాలను అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు బీజేపీ ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోదని చెప్పారు. శనివారం న్యూఢిల్లీలో బీజేపీ నూతన ప్రధాన కార్యాలయంలో మూడు ఈశాన్యరాష్ట్రాల ఫలితాలపై ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు ప్రధానమంత్రి నరేంద్రమోడీని గజమాలతో సత్కరించారు. త్రిపుర విజయం ఎప్పటికీ చిరస్మరణీయంగా గుర్తుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. రాజకీయ సైద్ధాంతిక వైరుధ్యం కారణంగా పార్టీ కార్యకర్తలను చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. లెఫ్ట్ పార్టీలు మావోయిస్టు, వామపక్ష సిద్ధాంతంతో జులుం ప్రదర్శించారని, అయినా ప్రజాస్వామ్యంతో జవాబు చెప్పారని అన్నారు. ఈ విజయాన్ని అమరులకు అంకితం చేస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. ఓటమిని స్వీకరించే హృదయం లేకుండా సిపిఎం నేతలు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో వారి రక్తంలోనే లేదన్నారు. ఈశాన్యరాష్ట్రాల ప్రజల కోసం తాము అనేక చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి పదిహేను రోజులకోసారి మంత్రులు, అధికారులు వెళ్లి స్వయంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం వల్లే ఈశాన్యంలో ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. త్రిపుర ప్రజలు అసాధారణ విజయాన్ని కట్టబెట్టారని సంతృప్తి వ్యక్తం చేశారు. మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర ప్రజలు ఇచ్చిన తీర్పుకు కృతజ్ఞతలు చెపుతున్నామన్నారు. తమ ప్రభుత్వ యాక్ట్ ఈస్ట్ పాలసీకి, సుపరిపాలన ఎజెండాకు ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. ప్రజల ఆశలను నిలబెట్టుకునేందుకు తాము అన్ని విధాల ప్రయత్నిస్తామన్నారు. త్రిపుర విజయం సాధారణ ఎన్నికల విజయంగా చూడొద్దని అనినారు. శూన్యం నుంచి అధికారం సాధించడం మామూలు విషయం కాదని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి ప్రజలు ఓటేశారని చెప్పారు. బీజేపీని బలమైన శక్తిగా రూపొందించిన కార్యకర్తలకు తల వంచినమస్కరిస్తున్నానని అన్నారు. త్రిపుర విజయం సైద్ధాంతిక విజయమని అభివర్ణించారు. నియంతృత్వంపై ప్రజాస్వామ్యం సాధించిన విజయని చెప్పారు. భయం నుంచి ప్రజలు అహింస, శాంతి సుస్థిరతను కోరుకున్నారని చెప్పారు. త్రిపురలో సుపరిపాలన అందించి అభివృద్ధి చేస్తామన్నారు.

**అజాన్ కోసం ప్రసంగాన్ని ఆపిన మోడీ**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని ప్రారంభించిన కొద్ది సేపటికే సమీపంలోని మసీదు నుంచి అజాన్ ప్రారంభమైంది. దాంతో అది ముగిసే వరకు ఆయన తన ప్రసంగాన్ని ఆపి, నిలబడ్డారు. అజాన్ కొనసాగినంతసేపు సభప్రాంగణంలో అందరూ మౌనంగా ఉన్నారు. తర్వాత భారత్ మాతాకి జై అంటూ తిరిగి ప్రసంగాన్ని మొదలు పెట్టడం విశేషం. కార్యకర్తలంతా మోడీ, మోడీ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

**చారిత్రాత్మక విజయం**


ఇది చారిత్రాత్మక విజయమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాఅన్నారు. మోదీ నేతృత్వంలో విజయ రథం ఈశాన్యంలో దిగ్విజయమై కర్ణాటక దిశగా వెళుతోందన్నారు. త్రిపురలో సిపిఎం హత్యారాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారాని అన్నారు. ప్రజలను సిపిఎం భయభ్రాంతులకు గురిచేసినా ప్రజాస్వామ్యయుతంగా ఆ పార్టీపై ప్రజలు దెబ్బకొట్టారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, యాక్ట్ పాలసీ కారణంగా ఈ విజయం సాధ్యమైందన్నారు.

**సీఎం ఎంపికకు పార్టీ అబ్జర్వర్లు**

ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతూ బీజేపీ పార్లమెంటరీ బోర్డు తీర్మానాన్ని పాస్ చేసింది. మూడురాష్ట్రాలలో పార్టీ లెజిస్లేటివ్ పార్టీని ఎంపిక చేసేందుకు పార్టీ కేంద్ర పరిశీలకులను నియమించింది. త్రిపురలో సిఎం అభ్యర్థిని ఎంపిక చేసేందుకు గడ్కరీ, జుయల్ ఓరంను నియమించగా, నాగాలాండ్ కు మంత్రి జెపినడ్డా, అరుణ్‌సింగ్‌ను, మేఘాలయకు మంత్రి అల్ఫోన్స్, కిరిణ్‌రిజిజును నియమించారు. వీరు ఆయా రాష్ట్రాల ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ ఎల్పీనేతను ఎంపిక చేస్తారు. త్రిపురలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లప్ దేబ్‌ను సిఎంగా ఎంపిక చేసే అవకాశముంది.

# మేఘాలయ ఎవరిది...?

**● ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ● కలిసివచ్చే ఎమ్మెల్యేల కోసం కాంగ్రెస్ కసరత్తు ● మిత్రపక్షాలే బీజేపీకి ఆధారం ● షిల్లాంగ్ నుంచి ఢిల్లీకి చేరిన రాజకీయాలు**




**షిల్లాంగ్:** మేఘాయల అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారం కోసం మేఘాలయలో రాజకీయ పార్టీలో మిత్రపక్షాల కోసం పోటాపోటీ పడు తుంటడంతో షిల్లాంగ్ రాజకీయాలు కాస్త ఢిల్లీకి చేరాయి. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 60 అసెంబ్లీస్థానాల్లో 29 స్థానాలు కైవశం చేసుకుని స్వతంత్ర ఎమ్మెల్యేల సహకారంతో అధికార పీఠాన్ని అధిష్టించగా కాంగ్రెస్ పార్టీకి ఈ సారి ఆ పరిస్థితులు కనిపించడం లేదు. మొత్తం 59 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 21 స్థానాలు మాత్రమే గెలుపొందడంతో మిత్రపక్షాలను వెతుక్కనే పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్, కమల్ నాథ్ హుటాహుటిన షిల్లాంగ్ చేరుకుని ఎన్నికల ఫలితాల సరళిని నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మేజిక్ ఫిగర్ 31 కావడంతో మరో పది మంది సభ్యుల కోసం చర్చలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మాతో ఇప్పటికే భేటీ అయిన వీరిద్దరూ కలిసివచ్చే పార్టీలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. దేశంలో ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మేఘాలయను జారవిచుకునేందుకు సుముఖంగా లేదు. పంజాబ్, మిజోరాం, కర్నాటక, పుదుచ్చేరిలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మేఘాలయలోనూ అధికారం కోసంపట్టుదలగా ఉంది. ఈనేపథ్యంలో కలిసివచ్చే పార్టీలతో చర్చలు మొదలైనట్లు సమాచారం. గతంలో గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో వ్యూహాలు బెడిసికొట్టి అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్ మేఘాలయలో మాత్రం అలాంటి పరిస్థితులు ఎదురవ్వకుండా ముందస్తుగానే ప్రణాళికలు రచిస్తోంది.

**ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ కసరత్తు**

2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయిన బీజేపీ ఈసారి మేఘాలయలో రెండు స్థానాలను కైవశం చేసుకుంది. ఇదే ఉత్సాహంతో ప్రాంతీయ పార్టీలతోపొత్తుపెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ ముద్ర కనిపించాలని తీవ్ర కసరత్తు చేసిన బీజేపీ మేఘాలయలోనూ కలిసివచ్చే పార్టీలకు ఆహ్వానం పలుకుతుంది. కాంగ్రెస్ పార్టీ తర్వాత నేషనల్ పీపుల్స్ పార్టీ 19 స్థానాలు గెలుచుకుని రెండు స్థానంలో ఉండటం కూడా బీజేపీకి కలిసొచ్చే అంశం. లోక్ సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడు కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని ఎన్‌పిపి బీజేపీకి చెందిన ఈశాన్య ప్రజాస్వామ్య కూటమిలో భాగస్వామి. ఎన్డీఏ కూటమిలోనూ ఎన్‌పిపి భాగస్వామ్య పక్షంగా కొనసాగుతోంది. ఎన్డీఏ కూటమిలోని మరో భాగస్వామ్య పార్టీ అయినయునైటెడ్ డెమొక్రాటిక్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో 6 స్థానాలను కైవశ చేసుకుంది. ఈ నేపథ్యంలో మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ కూటమికే ఎక్కువ అవకాశాలున్నాయన్నప్రచారం జరుగుతోంది.

**కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం: రామ్ మాధవ్**

మేఘాలయలో బీజేపీ రెండు స్థానాల్లో మాత్రమే గెలుపొందినప్పటికీ ఎన్డీఏ కూటమి పార్టీల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశాన్నిపరిశీలిస్తున్నట్లు బీజేపీ జాతీయ కార్యదర్శి రామ్ మాధవ్ తెలిపారు. కాంగ్రెస్ పాలన నుంచి మేఘాలయ ప్రజలకు ముక్తి కల్పించేందుకు తమ కూటమితో చర్చలుజరుపుతున్నామని చెప్పారు.

## 'ఓటర్లను ప్రలోభపెట్టారు'

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఓటర్లకు డబ్బు ఎరజూపి, ప్రలోభాలకు గురిచేసి భారతీయ జనతా పార్టీ త్రిపురలో గెలిచిందని భా రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రకటించింది. ఈశాన్య రాష్ట్రాల్లో కమ్యూనిస్టుల కంచుకోటైన త్రిపుర అసెంబ్లీ ఎన్ని కల్లో బీజేపీ సంచలన విజయం సాధించడంపై ఆ పార్టీ ఈ వి ధంగా స్పందించింది.

Andhraprabha business 2018

# బిజినెస్

BUSINESS

## బిలియనీర్లు బెంబేలు



**న్యూయార్క్:** ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో 500 మందికి ఈ వారంచుక్కలు చూపించింది. అందరూ కలిసి 107 బిలియన్ డాలర్లు నష్టపోయారు. లార్జ్ క్యాప్ స్టాకులు వరుసగా నాలుగవ రోజూ నిరాశపరచడంతో ఫేస్‌బుక్ సిఇఒ మార్క్ జుకెర్‌బర్గ్ 3.2 బిలియన్ డాలర్లు నష్టపోయారు. స్పెయిన్‌కు చెందిన అమన్‌సియో ఒర్టెగా, మెక్సికోకు చెందిన కార్లోస్ స్లిమ్ చెరి 2.4 బిలియన్ డాలర్లు కోల్పోయి జుకెర్‌బర్గ్ తర్వాతి స్థానంలో నిలిచారు. న్యూయార్క్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు చోటు చేసుకున్న పరిణామం ఇది. ఆల్ఫాబెట్‌కు చెందిన లారీ పేజ్, సెర్జ్ బ్రిన్ చెరి 2 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోయారు. సోమవారం మార్కెట్లు తెరు చుకున్నప్పటి నుంచి బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్ల సూచిపై కనిపించిన అత్యంత ధనవంతుల తలరాతలివి. ప్రపంచంలో 500 మంది అత్యంత ధనికులు సమష్టిగా ఈవారంలో 107 బిలియన్ డాలర్లు కోల్పోయారు. ఇది గోల్డ్‌మ్యాన్ సాచ్స్ గ్రూప్ ఇంక్ లేదా లాక్‌హీడ్ మార్టిన్ కార్పొరేషన్ యావత్ మార్కెట్ కేపిటలైజేషన్ కన్నా అధికరం. అమెరికా బిలియనీర్ల సంపద బాగా కరి గిపోయింది. వారు సమష్టిగా 34 బిలియన్ డాలర్లు కోల్పోయారు. చైనా ది గ్గజాలు 16 బిలియన్ డాలర్లు నష్టపోయారు. అమెరికా అధ్యక్షుడు ఒక వా ణిజ్య సమరానికి ఆహ్వానించడం, ద్రవ్య కట్టడికి చురుకు పెంచడానికి సెంట్రల్ బ్యాం క్ ప్రణాళికలు చేస్తుందనే ఊహాగానానికి ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పోవెల్ ఆజ్యం పోయడంతో ఈ వారం డో జోన్స్ పారిశ్రామిక సగటు దాదాపు 3.5 శాతానికి ఒరిగిపోయింది.





### టెక్నాలజీ, స్మార్ట్‌ఫోన్ల వినియోగంలో

## తెలంగాణకు ప్రత్యేక స్థానం

- యూట్యూబ్ వీడియో సృష్టికర్తల్లో హైదరాబాద్ అగ్రస్థానం
- కంట్రీ హెడ్ సత్యరాఘవన్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకోవడంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని యూట్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగం జాతీయ అధిపతి సత్య రాఘవన్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందిన యూట్యూబ్ యాప్‌ను అతి ఎక్కువ మంది వినియోగించడంలో, కొత్తగా సృష్టించిన వీడియోలను, వివిధ కార్యక్రమాలను అప్‌లోడ్ చేయడంలోనూ తెలంగాణకు ప్రత్యేక స్థానం దక్కిందన్నారు. ఇటీవల తమ సంస్థ నిర్వహించిన సర్వేలో హైదరాబాద్‌కు చెందిన 8 మందిని యూట్యూబ్ వీడియోల సృష్టికర్తలుగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా శనివారం నగరానికి వచ్చిన ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా చెన్నై, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్ నగరాలను ఫ్యాన్‌ఫెస్ట్ సిటీలుగా గుర్తించామని చెప్పారు. అందులో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉన్నందున మొదటి కార్యక్రమాన్ని ఇక్కడే నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్ల మంది యూట్యూబ్‌ను ప్రతినిత్యం వినియోగిస్తున్నారని తెలిపారు. దేశంలో 330 మిలియన్ల మంది స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారని, అం దులో 2 25 మిలియన్ల మంది నిత్యం యూట్యూబ్‌ను వీక్షిస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే విని యో గ దారుల సంఖ్య 400 శాతం అధికంగా నమోదైం దన్నారు.

## రేపు ముద్ర స్టాండ్ అప్ క్రెడిట్ క్యాంప్

- హాజరుకానున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి
- నిర్వహించనున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ ముద్ర, స్టాండ్ అప్ ఇండియా క్రెడిట్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించనుంది. నాం పల్లిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో క్యాంపును నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌కే సుల్తానియా పాల్గొం టారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వివిధ ప్రభుత్వ పథకాలకు 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 8500 కోట్లు రుణంగా ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీ రథ, పౌరసరఫరాల కార్పొరేషన్‌కు రుణాలను ఇచ్చింది. ముద్ర లోన్లను రూ. 65 కోట్లు, స్టాండ్ అప్ కింద రూ. 120 కోట్లు, 2000 చేనేత కార్మిక సొసైటీలు, 200 స్వయం సహాయక గ్రూపులకు రుణాలు ఇచ్చింది. సోమవారం జరిగే కార్యక్రమంలో హౌసింగ్, ముద్రలో చేనేత, స్టాండ్ అప్ ఇండియా వారికి రుణాలు ఇవ్వనున్నారు.

# స్వర్ణానికి సంస్కరణలు!



- పన్నుపై గణనీయమైన కోతలు
- బాండ్లకు బదులుగా పొదుపు ఖాతాలు
- స్వర్ణ చలామణి పథకానికి కొత్త ఊపిరి
- దేశీయ స్వర్ణ మండలి ఏర్పాటు
- అక్రమ దిగుమతులకు అడ్డుకట్ట
- కేంద్రానికి నీతి అయోగ్ కమిటీ సిఫార్సులు
- ఆర్థిక మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పణ





**ముంబై:** బంగారంపై పన్నులో గణనీయమైన కోతలను నీతి అయోగ్‌కు చెందిన ఒక కమిటీ సిఫార్సు చేసింది. 2022 నాటికి స్థూల దేశీయ ఉత్పత్తి(జిడిపి)లో బంగారం వాటా 3 శాతం చేరుకునేలా దాని పట్ల మరింత సరళీకృతమైన పంథాను పాటించాలని సైతం ప్రతిపాదించింది. నీతి అయోగ్ ప్రిన్సిపల్ సలహాదారు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి రతన్ పి వతల్ నేతృత్వంలోని కమిటీ భారత స్వర్ణ విపణి రూపాంతరీకరణ పేరిట ఒక నివేదికను గత నెల 26న ఆర్థిక మంత్రిత్వశాఖకు సమర్పించింది. ప్రభుత్వం సదరు నివేదికను బహిర్గతం చేయలేదు. బంగారం వ్యాపారంపై దిగుమతి సుంకం, వస్తు, సేవల పన్ను (జిఎస్టి) సహా అన్ని రకాల పన్నులపై భారీ కోతకు కమిటీ సిఫార్సు చేసిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

### దేశవాళీ మైనింగ్‌కు ఊతం

పన్నుల్లో కోతకు తోడు నివేదిక పలు ఇతర అంశాలపై దృష్టి పెట్టింది. భారత్‌లో బంగారు లోహం మైనింగ్‌ను ప్రోత్సహించడం, ముడి బంగారం శుద్ధి చేసి సమర్థమంతంగా బట్వాడా చేయడానికి బాధ్యతాయుతమైన వనరుల ఏర్పాటు, దేశీయ శుద్ధి కర్మాగారాలు శుద్ధి చేసిన బంగారానికి భారతీయ ప్రమాణాలు నిర్ధారించడం, అన్ని అంశాల పరిష్కారానికి ఒక సింగిల్ విండో ఏజెన్సీ తరహాలో చట్టబద్ధమైన అధికారాలతో గోల్డ్ బోర్డు ఏర్పాటును సైతం నివేదిక సిఫార్సు చేసింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఒక సమగ్రమైన స్వర్ణ విధానం రూపకల్పన, ఒక గోల్డ్ స్పాట్ ఎక్స్‌చేంజ్ ఏర్పాటును ఇప్పటికే ప్రకటించారు.

### అంతర్జాతీయ లీజు రేట్లతో అనుసంధానం





స్వర్ణ పున: చలామణీ పథకాన్ని(జిఎంఎస్) పునరుద్ధరించాలని నివేదిక ప్రతిపాదించింది. అన్ని బ్యాంకులు, వాటి శాఖ లు సంబంధిత సేవలందించాలని, జిఎంఎస్ కింద ఖాతాదారులు సమర్పించే బంగారం కనిష్ట పరిణామాన్ని తగ్గించాలని సూచించింది. రుణంగా ఇచ్చే బంగారాన్ని అంతర్జాతీయ లీజు రేట్లతో అనుసంధానం చేయడం ద్వారా జిఎంఎస్ పట్ల బ్యాం కులు ఆకర్షించబడేలా చూడాలని కూడా ప్రతిపాదించింది. ప్రస్తుతానికి కొన్ని బ్యాంకులు ఓవర్‌సీస్ బ్యాంకుల నుంచి లీజుపై బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నాయి.అదే బంగారాన్ని భారతీయ ఆభరణ వ్యాపారులకు రుణం రూపేణా అం దిస్తున్నాయి. తద్వారా మూలధన రుణ వ్యయాన్ని కట్టడి చేస్తున్నాయి. బంగారం పెట్టుబడికి ఒక ప్రత్యామ్నాయంగా సావ రిన్ స్వర్ణ బాండ్ల(ఎస్‌జిబి) స్థానంలో స్వ ర్ణ పొదుపు ఖాతాలను తీసుకురావాలని కమిటీ ప్రతిపాదించింది. సదరు ఖాతాలకు ప్రస్తుతం ఎస్‌జిబికి అనుసరి స్తున్న విధి, విధానాలను వర్తింపజేయాలని సూచించింది. అయితే బ్యాంకులు సరైన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రతిపాదిత పొదుపు ఖాతాల్లో రూపాయి రూపేణా బంగారం పెట్టుబడికి భారతీయ కుటుంబాల్లో మూ లుగుతున్న స్వర్ణ నిల్వలు ఉపకరించాలి.మరో కీలకమైన సిఫార్సు అన్నట్టుగా ఎగుమతి ప్రోత్సాహక మండలి తరహాలో ఒక ఉ మ్మడి కార్యదర్శి స్థాయి అధికారి అధ్యక్షతన ఒక దేశీయ స్వర్ణ మండలిని నెలకొల్పాలి. కమిటీ నివేదిక ఒక ఉదా రమైన పా న్(శాశ్వత ఖాతా సంఖ్య) పరిమితిని ప్రతిపాదించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద సంబంధిత ప్రభుత్వ సంస్థకు డేటా సమకూర్చడానికి కొత్త పరిమితి ఉపకరిస్తుంది.





### అక్రమ దిగుమతులు 150 టన్నులు

గడచిన కొద్ది సంవత్సరాలుగా వా ర్షిక అక్రమ బంగారు దిగుమతు లు 100 టన్నుల నుంచి 150 టన్నుల మధ్య ఉ న్నా యి. అక్రమ దిగుమ తులను అడ్డుకోవడానికి పన్నుల్లోపూర్తిస్థా యి కోత అవసర మ ని నివే దికపే ర్కొంది. కమిటీ సంబ ంధిత నిపుణులతో పలు ద ఫాలు గా చర్చలు జరి పిన అనంతరం గత డిసెంబర్‌లో ము సా యిదా ని వేదిక రూపొం దించింది. తుది నివేదికను గత సోమవారం సమ ర్పించింది



### ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు

నీతి అయోగ్ కమిటీ ప్రతిపాదనలపై స్వ ర్ణ వాణిజ్య వర్గాలు తలోరకంగా స్పందించాయి. జిఎంఎస్, స్వర్ణ పొదుపు ఖాతా లాంటి పథకాల్లో ఆభరణ వ్యాపారుల పాత్రను మరింత విస్తరించాలని వా రిలో అధికులు ఆశిస్తున్నారు. అయితే సుంకం విష యానికి వచ్చేసరికి విడిపోయారు. జిఎస్టి, దిగుమతి సుం కాన్ని కలుపుకుంటే బంగారంపై పన్ను 13 శాతా నికిపై మాటే. అక్రమ దిగుమతుల నివారణకు పన్ను మరింత తగ్గాలని కొందరు అన్నారు. కానీ పూర్తిస్థాయి సుంకాన్ని తగ్గించిన పక్షంలో వచ్చే ఆదాయం కన్నా ఆదాయ నష్టమే ఎక్కువని మరికొందరు అభిప్రాయపడ్డారు.

### 61 లక్షల మందికి జీవనోపాధి




సదరు కమిటీ బంగారం మైనింగ్ నుంచి మార్కెటింగ్ దాకా విధానపరమైన చర్యలను ప్రతిపాదించింది. అవాంతరాల్లేని ఆభరణాల వాణిజ్యాన్ని కూడా అది ఆకాంక్షించింది. అ ది ఒక ఉత్పా దక వా ణిజ్యం. పరిశ్రమలో 90 నుంచి 95 శాతం మధ్య తరహా, చిన్న యూ నిట్లు ఉన్నాయి. వాటిలో 61 లక్షల మంది ఉద్యో గులు పని చేస్తున్న కా రణంగా ఆవాం తరాల్లేని ఆభరణాల వా ణిజ్యాన్ని ఆశిస్తున్నట్టు వి వరించింది. బంగారం దిగుమతిలో పెట్టుబడి భాగం 16 శాతానికిపైగా ఉందని, అది ఉత్పాద రహితమని నివేదిక పేర్కొంది. పైన పేటర్కొన్న ప్రతిపాదనలతో బంగారా న్ని చూడాలని, దిగుమతులు లేని బంగారు పెట్టుబడులకు ప్రత్యామ్నా యాలను చూపాల ని ప్రభుత్వానికి సూచించింది.

### నీరవ్, చోక్సీలపై


## అరెస్ట్ వారెంట్

**న్యూఢిల్లీ:** పీఎన్బీ కుంభకోణంలో నిందితులు నీరవ్, చోక్సీలపై ప్రత్యేక న్యా యస్థానం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఎ న్ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు వజ్రాల వ్యాపారులు నీరవ్ మోదీ, చో క్సీలపై కేసు నమోదు చేశారు. కాగా ఈ మే రకు న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వా రెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీచేసిందని అధి కారులు తెలిపారు. ఇంతకుముందే ఈడీ అధికారులు నీరవ్, చోక్సీలకు సమన్లు జారీ చేసి కేసు విషయంపై ఏజెన్సీ ముందు హాజరుకావలసిందిగా వారిని కోరా రన్నారు. అయితే నిందితులిద్దరూ ఈడీ సమ న్లుకు స్పందించలేదన్నారు. వారి ద్దరుపై క్రిమినల్ కేసులు దాఖలవడానికి ముందే వారు విదేశాలకు పారి పోయారు. కాగా వీరు ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుకా కపోవటంతో కోర్టు ఇద్దరిపై వారెంట్ జారీ చేసింది. ఈడీ అధికారులు గత ఫిబ్రవరి 27న నీరవ్ మోదీకి వ్యతిరేకంగా కోర్టులో ఎన్బీడబ్ల్యూ జారీ విషయంపై న్యాయ మూర్తికి విన్న వించారు. వారెంట్ జారీ చేయకముందు కోర్టు మూడుసార్లు నీరవ్ మోదీని న్యా యస్థానంలో హాజరుకావలసిందిగా సమన్లు జారీ చేసిందన్నారు. అదే విధంగా చోక్సీకి సమన్లు జారీ చేసినా వారు ఎటువంటి స్పందన తెలియజేయలేదని, కో ర్టు కు కూడా హాజరు కాలేదని ఈడీ ప్రత్యే క ప్రాసిక్యూటర్ వెంగాన్కర్ వెల్లడించారు.



# పౌల్ట్రీ పరిశ్రమకు షాక్

- దిగుమతులపై సౌదీఅరేబియా నిషేధం
- కర్నాటకలో బర్డ్‌ఫ్లూ కారణం



### 38 శాతంతో ఒమన్‌టాప్

మొత్తం పౌల్ట్రీ ఎగుమతు ల్లో 38 శాతంతో ఒమన్ సింహ భాగాన్ని కలి గి ఉంది. తర్వాతి స్థానాల్లో మా ల్దీవులు(9.3 శాతం), వియ త్నాం(7.6 శాతం) ఉన్నాయి. ప్రపంచంలో పౌల్ట్రీ రం గానికి సంబం ధించి భారత్‌కు ఒక ప్రముఖ స్థా నం ఉంది. ఆ కారణంగా ఏదైనా ఒక చిన్న పట్ట ణంలో బర్డ్ ఫ్లూ త లెత్తిన మరుక్షణం దిగువ తి చేసుకునే దే శాలు యావత్ దేశం నుంచి పౌల్ట్రీ ఉత్పత్తుల కొనుగోలును రద్దు చేసుకుంటాయి. భారత పారిశ్రామిక పరిమాణంలో యావత్ పౌ ల్ట్రీ ఎగుమతుల వాటా చాలా చిన్నది. దిగుమ తులపై సౌదీ అరేబియా తాత్కాలిక నిషేధం చికె న్, గుడ్లపై ఎలాం టి ప్రభావం చూపదని ప్రముఖ పౌల్ట్రీ ఉత్పత్తుల కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి.

**ముంబై:** సౌదీ అరేబియా భారత్ నుంచి చికెన్, కోడిగుడ్ల దిగుమతిపై తాత్కాలిక నిషేధం విధించింది. కర్నాటక రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బర్డ్ ఫ్ల్యూ వైరస్ వ్యాపించడంతో అన్ని కోళ్లు, గుడ్లు, కోడి పిల్లల దిగుమ తిపై సౌదీ అరేబియా పర్యావరణ, జల, వ్యవ సా య మంత్రిత్వ శాఖ తాత్కాలిక నిషేధం విధించిందని అగ్రికల్చర్ అండ్ ప్రా సెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథార్టీ(ఎపెడా) ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. భారత్ వార్షిక పౌల్ట్రీ ఎగుమతుల విలు వ 8 కోట్ల డాలర్లు ఉం టుంది. అందులో సౌదీ అరేబియా వాటా కేవలం మూడు శాతం మా త్రమే. అయి నప్పటికీ దిగుమతి చేసుకునే ఇతర దేశాలు అలాగే స్పందిస్తే పరిస్థితి ఏమిటని ఎగు మతి దారులు ఆందోళన చెందుతున్నారు.

### జోన్లవారీగా పౌల్ట్రీ పరిశ్రమ

అయితే దేశ పౌల్ట్రీ పరిశ్రమను వేర్వేరు జోన్లుగా విభజించాలని ప్రభుత్వానికి నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు. తద్వారా ఒక జోన్‌లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపించినప్పుడు ఇతర జోన్ల నుంచి ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు. జోన్లవారీగా విభజన భారత్ పౌల్ట్రీ ఉత్పత్తుల ఎ గుమతులను దెబ్బ తీయదని భరోసా ఇసు న్నారు.

### ఎగుమతులకువైరస్ దెబ్బ

బర్డ్ ఫ్లూ వైరస్ తరచుగా వ్యాపిస్తున్న కారణం గా భారత్ పౌల్ట్రీ ఎగుమతులు గడచిన రెండేళ్ళలో తగ్గు ముఖం పట్టాయి. 2ఏండ్ల కాలా నికి 100 మిలియన్ డా ల ర్ల వ ద్ద నిలకడగా ఉండిన ఎగు మతులు 2016-17 ఆర్థిక సంవత్సరంలో 79.31 మిలియన్ డాలర్లకు పడి పో యా యి. పౌల్ట్రీ ఎగుమతులు ఏప్రిల్ నుం చి డిసెం బర్ మ ధ్య కాలంలో సైతం 0.5 శాతం క్షీణిం చి 59 మిలియన్ డా ల ర్లకు చేరు కున్నాయి. అయితే రూ పాయి లెక్కన చూ సిన ప్పు డు గతేడాది అదే కాలా నికి ఎగుమతులు 4.27 శా తం తగ్గుదలతో రూ. 3. 98 బి లియన్ల నుంచి రూ. 3. 81 బి లియన్లకు పడిపోయాయి.

### అంచనా పరిమాణం రూ.1,000 బిలియన్లు

భారత్ పౌల్ట్రీ పరిశ్రమ అంచనా పరిమాణం దాదాపు రూ.1,000 బిలియన్లు, దాంట్లో 3 నుంచి శాతం ఎగుమతులు ఉం టాయి. భారత్ పౌల్ట్రీ పరిశ్రమలో సౌదీ అరేబియా వాటా 0.12 శాతం మా త్రమే నని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జన వరి మాసంలో బర్డ్ ఫ్లూ కారణంగా బెం గళూరులో కొన్ని కోళ్లు చనిపోయినట్టు వార్తలు వచ్చాయి. సాధా రణంగా వాతావరణంలో మా ర్పులు చో టు చే సుకున్నప్పుడు బర్డ్ ఫ్లూ వైరస్ విజృంభి స్తుం ది.

### ఇతర దేశాలపై ప్రభావం

సాధారణంగా ఏదైనా దేశం రద్దు చేసి నప్పుడు అది ఇతర దేశాలపై పర్యవసాన ప్రభా వాన్ని చూపుతుంది. ఇతర దేశాలు కూడా సౌదీ అరేబియా బాటలో నడుస్తాయని మేం భయపడుతున్నాం అని ఒక సీనియర్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ వాపోయారు.

### ఎన్‌జిఒల అత్యుత్సాహం.. పరిశ్రమ ఆగ్రహం

అయితే దీనికి ప్రభుత్వ విధానాలపై ప్రభుత్వేతర సంస్థల(ఎన్‌జిఒలు) ప్రభావాన్ని భారత పౌల్ట్రీ సమాఖ్య వర్గాలు తప్పుపట్టాయి. విదేశీ నిధులతో పనిచేస్తున్న ఈ ఎన్‌జిఒలు పౌల్ట్రీ పరిశ్రమను ఎదగనివ్వవు. ఎప్పుడూ ఎక్కడో ఒక చోట బర్డ్ ఫ్లూ వ చ్చిందని ప్రకటిస్తూ అదే పనిగా భయాందోళనలు సృష్టిస్తుంటాయి. నా దృష్టిలో ఎక్కడా ఫ్లూ వైరస్ వ్యాపించలేదు. అలా చూసినప్పు డు దిగుమతులపై అరేబియా తా త్కాలిక నిషేధం అవాంఛనీయం అని వ్యాఖ్యానిం చాయి.



### హెచ్-1బీ వీసాదారుల

## భాగస్వాములకు ఊరట





**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములను ఉద్యో గాల నుంచి తొలగించే విషయమై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అమె రికాలో అధిక సంఖ్యలో భారతీయులు,వారి జీ విత భాగస్వాములుఉద్యోగాలు చేస్తున్న సంగతి తెలి సింది. వా రిని తొల గించే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం ప్రకటిం చడంతో వారందరికీ ఊరట లభిం చింది.అమెరికా హో మ్ ల్యాండ్ సెక్యూరిటీస్ ఈ మేరకు ప్రకటన చేసింది.ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హెచ్-1 బి వీసాలపైవేటు వేసేం దుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములను తొల గిస్తా రేమోనన్న భయాం దోళనలు గడిచిన కొంత కాలంగా వ్యక్తం అవుతున్నాయి.హెచ్-1బీ వీ సాదారుల భాగస్వాములను తొలగించే విషయమై జూన్ వరకూ ఎటువంటి నిర్ణయం తీసు కోబోమని హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రకటిం చిం ది.వారిని తొలగించాలన్న నిర్ణ యం వల్ల దేశ ఆర్థికవ్యవస్థపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో పరిశీలించాల్సిఉందని పేర్కొంది.

### నైపుణ్యాభివృద్ధిలో

## లండన్ కళాశాలతో న్యాక్ కృషి

- భద్రత, పర్యావరణంపై అమెరికన్ సంస్థతో శిక్షణ

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులు, నిరుద్యోగులు ,ఇంజినీర్లకు అత్యుత్తమ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కృషి చేస్తోంది.1998 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి శిక్షణ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత న్యాక్ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. సంప్రదాయ కోర్సుల్లోనే గాక ఆధునిక టెక్నాలజీతో కూడిన శిక్షణ కార్యక్రమాలను విస్తరిస్తోంది. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ సంస్థ ప్రత్యేకత. గడచిన మూడున్నరేళ్ల కాలంలో 3,72,000 మంది నిరుద్యోగులు, ఉద్యోగులు, కార్మికులు ఈ సంస్థ ద్వారా శిక్షణ పొందారు. అందులో 11 ,105 మంది నిరుద్యోగులు ఉన్నారు. శిక్షణ పొందిన నిరుద్యోగుల్లో 8,869మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయి. నైపుణ్యాభివృద్ధితో పాటు భద్రత, పర్యావరణ పరిరక్షణపైకూడా కోర్సులు నిర్వహిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో లండన్‌కు చెందిన నేషనల్ ఓపెన్ కాలేజీ నెట్‌వర్క్ సంస్థతో శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన ఇరు సంస్థల మధ్య గత నెల అవగాహన ఒప్పం దం (ఎంఓయూ ) కుదిరింది. అదే విధంగా భద్రత, పర్యావరణంపై అమెరికాకు చెందిన సంస్థ శిక్షణా తరగతులను ఇప్పటికే ప్రారంభించింది. న్యాక్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు దేశ, విదేశాలకు చెందిన సంస్థలు ప్రశంసలు పొందుతున్నాయి.2016 లో సీఐడీసీ విశ్వకర్మ అవార్డు న్యాక్ సంస్థను వరించింది. 2017 లో ఏకంగా అంతర్జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. గోల్డెన్ పికాక్ నేషనల్ ట్రైనింగ్ అవార్డు -2017 లో సాధించింది. ప్రపంచంలోని వి ఖ్యాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐడి )ఈ అవార్డును ప్రకటించింది. 2017 ఏప్రిల్ 19 న దుబాయ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ ఆర్థిక మంత్రి సుల్తాన్ బిన్ సయీద్ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకుంది. ఇప్పటికే 27 కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న న్యాక్ సంస్థ రాబోయే కాలంలో మరికొన్ని కోర్సులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. క్వాంటిటీ సర్వే అండ్ కాంట్రాక్టు మేనేజిమెంట్‌లో పీజీ డిప్లొమా, వృత్తి విద్య ఇన్‌స్టిట్యూట్‌లో టీఓటీ ప్రోగ్రాం, ప్రఖ్యాత పీఎంఐ సంస్థకు అనుబంధంగా ప్రాజెక్టు మేనేజిమెంట్ కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రభుత్వంలోని పలు శాఖల్లో పని చేస్తున్న ఇంజినీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 126 మంది సైట్ ఇంజినీర్లకు ప్రత్యేక శిక్షణను ఇచ్చింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థలతో పాటు మరి కొన్ని ప్రతిష్టాత్మక సంస్థల్లో న్యాక్‌కు సభ్యత్వం ఉంది. ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థకు ఛైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ ఛైర్మన్లుగా రాష్ట్ర రహదారులు,భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ ఉన్నారు. డైరెక్టర్ జనరల్‌గా రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె భిక్షపతి వ్య వహరిస్తున్నారు. ఈ సంస్థలో ప్రధాన కేంద్రమైన హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కలిపి మొత్తం 247 మంది ఉద్యోగులు తమ సేవలందిస్తున్నారు.

## రూ.94.50 కోట్ల అంచనాతో
# సిటీ సివిల్ కోర్టు

● 25 వేల మంది నుంచి అభిప్రాయ సేకరణ

**అమరావతి ఆంధ్రప్రభ:** సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కోసం డిజైన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. రాజధాని అమరావతిలో హైకోర్టు శాశ్వత భవనాలు తయారయ్యేంత వరకు అందుకు అనుసంధానంగా ఉద్దేశించిన సిటీ సివిల్ కోర్టు (జ్యూడిషియల్ కాంప్లెక్స్)కు సంబంధించి 12 డిజైన్లను ముఖ్యమంత్రి సూచనలతో ప్రజాభిప్రాయం కోసం ఆన్‌లైన్‌లో ఉంచారు. ప్రజాభిప్రాయంలో ఎక్కువ మంది తొలి ఆప్షన్‌కే ప్రాధాన్యత ఇచ్చారు. ఇదే విషయాన్ని ఏపీసీఆర్డీయే అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. ప్రజల మద్దతు మేరకు సీఎం అదే డిజైన్‌ను ఖరారు చేయడంతో సిఆర్డీఏ అధికారులు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. 2 లక్షల 25 వేల చదరపు అడుగుల నిర్మాణానికి గాను అంచనా వ్యయాన్ని 94.50 కోట్లుగా నిర్ధారించారు. భవిష్యత్ అవసరాల కోసం జీ ప్లస్--5గా నిర్మాణం చేపట్టాలన్నది అధికారుల యోచనగా ఉంది. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ విధానంలో టెండర్లను పిలవనున్నారు. అంతర్గత వసతుల కల్పన, ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్‌లను కాంట్రాక్ట్ సంస్థ చేపట్టడంతో పాటు ఏమైనా లోపాలు తలెత్తితే ఆ బాధ్యతను కాంట్రాక్ట్ సంస్థే భరించాల్సి ఉంటుంది. బిడ్ల సమర్పణకు ఏప్రిల్ 4వరకు గడువు ఇచ్చారు. ఐటి టవర్ల డిజైన్లకు సంబంధించి 13 వేల మంది ప్రజాభిప్రాయంలో పాల్గొన్నారు. అసెంబ్లీ భవనానికి సంబంధించిన డిజైన్లలో కొన్ని మార్పులను చంద్రబాబునాయుడు సూచించారు. ఆ మేరకు నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులు డిజైన్లు మార్చి సమర్పిస్తామని తెలిపారు. హైకోర్టు, అసెంబ్లీ సంపూర్ణ డిజైన్లను మే రెండవ వారంలో సిద్ధం చేస్తామని ప్రతినిధులు ఏపిసిఆర్డీఏ అధికారులకు తెలిపారు.

## సీఎం వద్దకు రావెల, పత్తిపాటి పంచాయితీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఇద్దరు తెలుగుదేశం నేతల మధ్య నెలకొన్న వివాదం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్దకు చేరింది. ఇటీవలే మంత్రి పదవి కోల్పోయిన రావెల కిశోర్‌బాబు రాజధాని జిల్లాకే చెందిన మరో మంత్రి పత్తిపాటి పుల్లారావుతో ప్రత్యక్ష పోరుకు సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి కాలంలో రాజధాని ప్రాంతంతోపాటు ఇతర చోట్ల జోరుగా సాగుతున్న అక్రమ రవాణాలో మంత్రి ప్రమేయం వుందంటూ మాజీ మంత్రి రావెల బహిరంగ ఆరోపణకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి వద్దకు ఒకే జిల్లాకు చెందిన ఇరువురు నేతల పంచాయితీ ముఖ్యమంత్రికి చేరగా, ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ ప్రతిష్టకు భంగకరంగా తాజా వివాదం వుందంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి తక్షణమే వివాదం సద్దుమణిగేలా చర్యలు తీసుకోవాల్సిం దిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడును శనివారం ఆదేశించారు. ఒకరు మంత్రి అయితే, మరొకరు మాజీ మంత్రి అని, బాధ్యతాయుతమైన పదవులలో వుండి పార్టీ పరువును రచ్చకెలా ఈడుస్తారంటూ ముఖ్యమంత్రి మండిపడినట్టు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పైగా రాష్ట్ర రాజధాని వున్న జిల్లాలో నేతలు వీధిన పడితే సహించేది లేదని పేర్కొన్న ముఖ్యమంత్రి, మరోవైపు పరిష్కరించే భాధ్యతను మంత్రి అయ్యన్నపాత్రుడుకు అప్పగించారు. ఇదే విషయమై అయ్యన్నపాత్రుడుతో మాట్లాడారని, వివాదం సద్దుమణిగేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. కాగా ఇంతకాలం జిల్లాలో గుంభనంగా వున్న రాజకీయాలు పత్తిపాడుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు మంత్రి పుల్లారావుపై ఆరోపణలు గుప్పించడంతో విభేదాలు భగ్గుమన్నాయి. కేంద్ర సర్వీసులో ఉన్నత ఉద్యోగంలో వున్న రావెల ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలలోకి వచ్చారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్ని పార్టీల నేతలతో సన్నిహితంగా వుంటారనే ప్రచారం వుంది. కాంగ్రెస్, వైఎస్సార్‌సిపి, బిజెపీ పార్టీలలోని నేతలతో వ్యాపార సంబంధాలున్నాయనే ప్రచారం కూడా వుంది. జిల్లాలో మట్టి, గ్రావెల్ తవ్వకాలు భారీగా జరుపుతున్నారని భావిస్తున్న మాజీ మంత్రి రావెల తాజాగా ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఇప్పటికే వంద కోట్ల రూపాయలకు పైగా మట్టిని అడ్డగోలుగా తవ్వి అక్రమ రవాణా చేశారని, అడ్డుకుంటే మంత్రి పుల్లారావు చెబుతున్నారంటూ రావెల కిశోర్ బాబు ఆరోపించారు. ఇదే విషయమై ఆయన మీడియా వద్ద ప్రస్తావించడంతో విషయం ముఖ్యమంత్రి దాకా చేరింది. కాగా గతంలో మాజీ మంత్రి రావెలతో తనకు ప్రాణహాని వుందంటూ గుంటూరు జడ్పీ ఛైర్‌పర్సన్ పత్రికలకెక్కారు. అప్పట్లో ఈ వివాదాన్ని మంత్రి పుల్లారావు పరిష్కరించారు. అయితే పలు వివాదాల నేపథ్యంలో మంత్రి పదవిని కోల్పోయిన రావెల కిశోర్ బాబు అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో మంత్రికి విరోధిగా మారారానే ప్రచారం జరుగుతోంది.

## ఏపీసీఆర్డీయే అసిస్టెంట్ డైరెక్టర్‌కు పదోన్నతి

**అమరావతి, ఆంధ్రప్రభ:** విజయవాడ ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో రెండు సంవత్సరాలకు పైగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన సిహెచ్.వి.ఎస్.ఎన్.కుమార్ ప్రమోషన్‌పై బదిలీ అయి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కాకినాడ మల్టీ జోన్ వన్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు కుమార్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా కాకినాడలో బాధ్యతలు నిర్వహించనున్నారు. ఏపీసీఆర్‌డీఏలో సర్వే ఏడీగా కుమార్ అందించిన సేవలకు గుర్తింపుగా ప్రమోషన్ పొందారు.

## కుప్పం కన్నా పులివెందులకు
# ముందే నీళ్లిచ్చాం

● తెలుగు గంగ, హంద్రీ-నీవా ఎన్టీఆర్ చలవే ● నేటి ఇంజనీర్లకు శ్రీరామకృష్ణయ్య సేవలు స్ఫూర్తిదాయకం
● 16వ ఇరిగేషన్ దినోత్సవంలో మంత్రి దేవినేని



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో కుప్పం కన్నా పులివెందులకే ముందు నీళ్లు ఇచ్చామని రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు అన్నారు. శనివారం విజయవాడలోని జలవనరుల శాఖ ఆవరణలో జరిగిన 16వ ఇరిగేషన్ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ శ్రీరామకృష్ణయ్య 92వ జయంతి దినోత్సవాన్ని 16వ ఇరిగేషన్ దినోత్సవంగా జరపటం ఆనందంగా ఉందన్నారు. రాయలసీమ జలసీమగా మారడానికి మాజీ సీఎం ఎన్టీఆర్ కారకులైతే, ఆ విధంగా సాకారం చేయటంలో కృషి చేసిన ఇంజనీర్ డాక్టర్ కుడితిపూడి శ్రీరామకృష్ణయ్య అని మంత్రి ఉమా తెలిపారు. శ్రీరామకృష్ణయ్య స్ఫూర్తితో రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు ముఖ్యంగా రాయలసీమలో తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర ముఖ్యమైన ప్రాజెక్టులు కట్టడంలో ముందు చూపుతో వ్యవహరించిన విధానాన్ని మంత్రి విశదీకరిం చారు. సాంకేతికత అంతగా అందుబాటులో లేని కాలంలో కొండలు, కోనలు దాటుకుంటూ పొలాల వెంట తన కుటుంబంతో నడుచుకుంటూ రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తికావటానికి శ్రీరామకృష్ణయ్య తన వంతు కృషి చేశారన్నారు. నేటి ఇంజనీర్లకు శ్రీరామకృష్ణయ్య సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన ఇరిగేషన్ శాఖకు చేసిన సేవలు యువ ఇంజనీర్లు నేర్చుకుంటే మంచి ప్రయోజకులుగా మారతారన్నారు.

ఎన్టీఆర్ నాటిని విత్తనమే తెలుగుగంగ, హంద్రీ-నీవా ప్రాజెక్టులని అందుకే రాయలసీమకు నేడు తాగునీరు, సాగునీరు వాటి ద్వారా సకాలంలో అందించ గల్గుతున్నామన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో నిర్మించబట్టి వేలకోట్ల రూపాయల కృష్ణా డెల్టాలో పంటను కాపాడ గలిగామన్నారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా జలవనరుల శాఖకు గత మూడు సంవత్సరాలలో 54 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసి సీఎం చంద్రబాబు తన దార్శినికతను చాటిచెప్పారన్నారు. వెనుకబడిన అనంతపురంలో కియా మోటార్స్ రావడానికి కారణం మచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించటమేనన్నారు. తిరుపతి బాలాజీ సాగర్ 10 టీఎంసీల నీటిని వేణుగోపాల్ సాగర్ ద్వారా ఇస్తామని, సకాలంలో పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు మేలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టును సంబంధించి రూ.2,950 కోట్లు రూపాయలు కేంద్రం నుంచి రావాల్సి ఉందని, 2018 డిసెంబర్ నాటికి పోలవరం గేట్లు అమర్చే విధంగా నవయుగ కంపెనీ వేగవంతంగా పనులు చేస్తున్నారన్నారు.

డయాఫ్రమ్ వాల్‌కు సంబంధించి 70-80 శాతం పనులు పూర్తయ్యాయని, ఇప్పటివరకు ఏడున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల కొండ రాయి, మట్టిని తొలగించామని 5,30,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేశామన్నారు.

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు పూర్తిచేసే విధంగా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఒక లక్ష్యంతో కృషి చేసి, డెల్టా ప్రజలకు చేరువయ్యారన్నారు. జలవనరుల శాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ళ గోపాలకృష్ణ మాట్లాడుతూ గత మూడేళ్ళలో రాష్ట్రంలో జల సంరక్షణ పనుల కోసం రూ.10,867 కోట్లు ఖర్చుచేసి 68.43 కోట్ల ఘనప మీటర్ల పూడికను తీసి 32 టి.ఎం.సీలు భూగర్భజలాలుగా మార్చారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఉప్పునీటిని మంచినీటిగా మార్చే మొబైల్ వాటర్ ట్రీట్‌మెంట్ వాహనం, వాటర్ స్ట్రక్చరింగ్ యూనిట్, మెగనేట్ సేఫ్టీ యంత్రాలను వీడియోల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. 16వ ఇరిగేషన్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులలో సమర్థవంతంగా పనిచేసిన ఇంజనీర్లను, రిటైర్డ్ ఇంజనీర్లను మంత్రి దేవినేని ఉమ సత్కరించి మెమెంటోలను అందిచారు. ఇరిగేషన్ దినోత్సవ వేడుకలలో జలవనరుల శాఖ ఈఎన్‌సి అడ్మిన్ కె. శ్రీనివాస్, కె.డి.యస్.సి ఈ సతీష్ కుమార్, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్లు జి.వి. భుజంగరాయులు, మైనేని మురళీకృష్ణ డి.సి ఛైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, జలవనరుల శాఖ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు, పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు, 13 జిల్లాల నుంచి జలవనరుల శాఖ ఎస్. ఈలు తదితరులు పాల్గొన్నారు.

# చౌక డిపోల్లో డిస్‌ప్లే బోర్డు పెట్టాలి


● పౌర సరఫరాల మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆదేశం

**విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో:** ప్రతి ఒక్క చౌకధరల దుకాణాల్లో తప్పనిసరిగా నిత్యావసర సరకుల పంపిణీ వివరాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును పెట్టాల్సిందిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం సీతమ్మధార సర్కిల్-2 పరిధిలో గల 206 చౌకధరల దుకాణాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ గల బియ్యం, కందిపప్పు, నూనె తదితర వస్తువులను పరిశీలించారు. ఈ పోస్ మిషన్ వాడుతున్న తీరును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీ రూ.40 లకే అందిస్తున్న కందిపప్పును వినియోగదారులకు అందజేశారు.

మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదవారికి నాణ్యమైన నిత్యావసర సరకులను సబ్సిడీ ధరలకే అందించేందుకు కృషి చేస్తోందన్నారు. బయట కేజీ 70 నుంచి 80 రూపాయల ధరల పలుకుతున్న కందిపప్పును చౌక ధరల దుకాణాల్లో రూ.40లకే అంది స్తున్నామన్నారు. ఎప్పటి మాదిరిగానే బియ్యం, పంచదారలను పంపిణీ చేస్తున్నామన్నారు. తెల్లరేషన్ కార్డు గల రజకులు, కూరాకుల, మత్స్యకారుల కుటుంబాలకు కిరోసిన్‌ను త్వరలో పంపిణీ చేయనున్నా మన్నారు. మినపప్పు, పెసరపప్పు, ఎండుమిర్చిలను సబ్సిడీ మీద చౌక ధరల దుకాణాల్లో పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ప్రతి నిరుపేదకు అందించడమే లక్ష్యంగా భావిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,500 చంద్రన్న విలేజ్ మాల్స్‌ను అర్బన్, సెని అర్బన్‌లలో పెట్టడానికి రియలన్స్, ఫీచర్ గ్రూపు ముందుకు వచ్చాయని, డీలర్లు చొరవ చూపాలని, వారికి అదనపు ఆదాయం కల్పించడానికి ఈ మాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు.



లీగల్ మెట్రాలజీ, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. అన్ని చౌక ధరల దుకాణాల్లో ఈ పోస్ మిషన్ వాడకం తప్పనిసరన్నారు. రేషన్‌కార్డుదారులకు ఈ పోస్ మిషన్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. నిత్యావసర సరకులకు నిర్దేశించిన సమయంలో తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. మంత్రి పర్యటనలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, డిఎస్‌వో నిర్మలాబాయి, ఇతర అధికారులు వున్నారు.



## పాత.. కొత్త పథకాలతో
# జనం బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అనివార్యమైతే తప్ప ఇప్పటివరకూ తుది నిర్ణయం తీసుకున్న పద్దులకు సంబంధించి వ్యవహారంలో మార్పులు, చేర్పులు చేయవద్దని సూచించారని తెలిసింది. గత మూడు సంవత్సరాలలో అమలు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు రానున్న కాలంలో ప్రభుత్వం ఏమి చేస్తుందనే అంశాలను ప్రతిబింబింపజేయాలని సూచించారు. పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, నిర్దేశించిన గడువులోగా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సాగునీరు, తాగునీరు అందించాలని కోరారు. ఆ దిశగానే ఇంతవరకు ఎంతో పురోగతి సాధించామన్నారు. పలు చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులను ప్రారంభించేందుకు మంచి పునాది వేశామని, 2017 బడ్జెట్‌లోనూ ప్రాధాన్యత ఇచ్చినందువల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్ర విభజన అనంతరం వరుసగా వచ్చిన మూడు బడ్జెట్‌లలోనూ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి పెద్దపీట వేశామన్నారు. ఈ బడ్జెట్‌లోనూ ఎన్ని నిధులైనా వెనుకాడరాదని, ప్రాజెక్టులే సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని పేర్కొన్నారు. సంక్షేమ రంగానికి కూడా వచ్చే బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించాలని ఆయన మరోసారి అధికారులను ఆదేశించారు. ఏ విషయంలోనైనా వినూత్నతకు పెద్ద పీట వేయాలని, ఫలితంగా సామాన్యుల ముంగిటకు సాంకేతిక ఫలాలు చేరుకోవాలని స్పష్టం చేశారు. దేశం అంతా ఏ.పి వైపే చూస్తోందంటే కొత్త ఒరవడే కారణమని ముఖ్యమంత్రి అధికారులు, మంత్రులతో అన్నారు. నూతన పథకాలతో పాటు గతంలో రద్దు చేసిన కొన్ని పథకాలను పునరుద్ధరిస్తున్నామని, వాటికి కూడా నిధుల కేటాయింపులో వెనుకాడరాదని సూచించారు. వచ్చే బడ్జెట్‌లో ఒక్క ఇరిగేషన్ రంగానికే దాదాపు రూ. 30 వేల కోట్లు అవసరమంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు చేసిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి స్పందిస్తూ కనీసం రూ. 24 వేల కోట్లకు తగ్గకుండా కేటాయింపులు జరపాలని సూచించారని సమాచారం. వివిధ కులాలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులను పెంచాలని గతంలోనే ముఖ్యమంత్రి ఆదేశించగా, అదే స్థాయిలో ప్రతి సమాఖ్యకు కూడా అదనంగా 25 కోట్లకు మించకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారని తెలిసింది. విద్యాశాఖకు కూడా కేటాయింపులు రెట్టింపు చేయాలని, ఐటీ, పరిశ్రమల శాఖలకు గతంలోకన్నా అదనంగా నిధులను ప్రాధాన్యతాప్రాతిపదికన కేటాయించాలని ముఖ్యమంత్రి ఆర్థిక, సంబంధిత శాఖలను కోరారని సమాచారం. మళ్ళీ పునరుద్ధిరిస్తున్న ఆదరణ-2 పథకానికి కూడా సంక్షేమ పద్దులలో భాగంగా నిధులు కేటాయించాలని, చేతివృత్తులకు టీడీపీ ప్రభుత్వం ఆలంబనగా నిలవాలని కోరిన ముఖ్యమంత్రి బాలికలకు సైకిళ్ళు, విద్యార్థులకు కిట్‌తో పాటు రైతులకు గిట్టుబాటు ధరల కల్పన వంటి అంశాలపై ముఖ్యమంత్రి మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారని సమాచారం.

### కుదించండి

2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ విషయమై మీడియా సంస్థలకు లీక్ చేయొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించినట్టు తెలిసింది. ఈ మేరకు సమావేశంలో ఇదే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారని సమాచారం. వివిధ శాఖలకు కేటాయిస్తున్న పద్దులకు సంబంధించి ఆయా పత్రికలు, టీవీలలో విభిన్న కథనాలు వస్తుండటాన్ని ప్రస్తావించారని భావిస్తున్నారు. వివిధ శాఖల నుంచి ఆశించినదానికన్నా ప్రతిపాదనలు అందాయని, అయితే ప్రాధాన్యతా ప్రాతిపదికన వాటిని కుదించాలిన ముఖ్యమంత్రి కోరారు. కొన్ని ప్రతిపాదనలను నిధుల కేటాయింపునకు సంబంధించి పెంచినా, తగ్గించినా పరవా లేదని, వాటిని ఆర్థిక శాఖ విచక్షణకే వదిలి వేస్తున్నామన్నారు. అదే సమయంలో ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ముందుకుపోవద్దని అధికారులు, మంత్రులతో అన్నట్టు తెలిసింది. 'దేశంలో ఏ రాష్ట్రా నికి లేని క్లిష్ట పరిస్థితులు ఆంధ్ర ప్రదేశ్‌లో వున్నాయి. నిధుల కేటాయింపులు, ప్రాజెక్టుల కొనసాగింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకు సాగుదాం. ఈ విషయంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా దృఢచిత్తంతో వ్యవహరించాలి. నిధుల విషయంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, నిధుల కేటాయింపుతో ప్రజలకు మేలు జరుగుతుందంటే అంతకన్నా ఏమి కావాలి, తానొక్కడినే కష్టపడితే, యావత్ అధికారయంత్రాంగం ఈ విషయంలో అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం వుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, మునిసిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మద్దాడ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రేపు కేబినెట్ భేటీ

● వార్షిక బడ్జెట్, ఇతర అంశాలపై చర్చ

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 5న ఉదయం 8.15 గంటలకు జరుగుతుంది. సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. విభజన చట్టంలోని అంశాలపై కేంద్రం త్వరలోనే అత్యున్నతస్థాయి భేటీ జరుపనున్న నేపథ్యంలో మంత్రివర్గ సమావేశం జరుగనుంది. ఈనెల 12న కీలకమైన సమావేశం ఢిల్లీలో జరుగుతుండగా, అజెండా రూపకల్పనపై సమావేశంలో చర్చిస్తారని తెలిసింది. కాగా కొన్ని ప్రాజెక్టులకు నిధులు, రాజధాని నిర్మాణంతో పాటు కొన్ని సంస్థలకు నిధుల కేటాయింపు, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ బోర్డుకు స్వయం ప్రతిపత్తి, నిర్ణీత ప్రాజెక్టులకు అదనపు కేటాయింపులు, 2018-19 వార్షిక బడ్జెట్‌పై కేబినెట్‌లో చర్చిస్తారు. ఏయే శాఖ ఎన్ని నిధులు కేటాయించిందీ అదే సమావేశంలో మంత్రులు తెలియజేస్తారని భావిస్తున్నారు. కాగా మంత్రివర్గ సమావేశం జరుగనున్న నేపథ్యంలో వివిధ శాఖలు ఈ నెల 4న సాయంత్రం 4 గంటలలోగా ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వి.దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు సాఫ్ట్, పిడిఎఫ్ కాపీలు 30 చొప్పున అందజేయాలని ఆయన కోరారు.

# ఆంధ్రకు అన్యాయం చేస్తున్నారు

● చంద్రబాబుతో కలిసి పోరాడుతా : కేసీఆర్


**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలుగు రాష్ట్రాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఒకింత చిన్నచూపు చూస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆందోళన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఇస్తామన్న హామీపై ఏళ్ళు గడుస్తున్నా ఎలాంటి స్పష్టత లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా రెండిట్లో దేనికైనా అంగీకరించక తప్పదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నా అభివృద్ధి విషయంలో పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.

### చంద్రబాబుతో మాట్లాడుతా

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునే క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగుతానని కేసీఆర్ చెప్పారు. హక్కుల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

### ప్రధానిని విమర్శించొద్దని రాజ్యాంగంలో ఉందా?

ప్రధాని మోడీని నేనేమీ అనలేదు. అననిదానిని అన్నట్లు చిత్రవిచిత్రంగా మూడు, నాలుగురోజులుగా మాట్లాడుతున్నారు. నేను మోడీగారికి అన్నాను తప్ప గానికి అనలేదు. వీడియోలు తెప్పించుకుని చూశా.. అయినా గోల చేస్తా అంటే వాళ్ళిష్టం. ప్రధాని మోడీ నా బెస్ట్ ఫ్రెండ్.. అయినా ప్రధానిని విమర్శించొద్దని రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా? అంటూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బిజెపి నేతలపై విరుచుకుపడ్డారు. శనివారం సాయంత్రం ప్రగతిభవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి నేతలు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. ప్రధానినే విమర్శిస్తరా అని కొందరు మాట్లాడుతున్నారు.. అవసరమైతే విమర్శిస్తరు.. ఇది డెమోక్రసీ. కెసిఆర్‌కు జైలుకు పోవాలని ఉందా? అని ఓ బిజెపి ఎమ్మెల్యే అంటున్నడు.. కెసిఆర్‌ను జైలుకు పంపుతరా? కొన్ని సందర్భాల్లో కొందరిని ముట్టుకుంటే భస్మమైతరు.. ఏం జైలుకు పోతరండీ.. తోక.. నాకున్నదేంది.. పోయేదేంది? ఈ ప్రధానమంత్రే నన్ను పొగిడిండు.. మేం ఏ కుంభకోణం చేయలేదు.. కరెంట్ ప్రాజెక్టులు బిహెచ్ఈఎల్‌కు ఇచ్చిండ్రని పొగిడారు. దుర్మార్గమైన సంపాదన మాకు అక్కర్లేదని అధికారంలోకి రాంగానే కుటుంబమంతా కూసొని అనుకున్నం. కడుపు కట్టుకుని.. నోరు కట్టుకుని పనిచేస్తున్నం. నా జేబుకు ఉండే పెన్నుతో సహా ప్రతి ఏడాది నేను ఐటీ లెక్కలు సమర్పిస్తున్నా. ఎన్నికల్లో నిలబడ్డప్పుడు లెక్కలిస్తం. ఇంతకుముందు దొంగపనులు చేసినోళ్ళు.. కుంభకోణాలు చేసినోళ్ళు.. తప్పుడు పనులు చేసినోళ్ళు భయపడతరు. నన్ను ముట్టుకుని చూస్తే తెలుస్తది. ఎవలి కథేందో.. అన్నది. దేశంలో అన్ని పార్టీలు ఎట్ల నడుస్తున్నయో.. మా పార్టీ అట్లనే నడుస్తది అని కెసిఆర్ కుండబద్దలు కొట్టారు.




### సారించు..ఎవరాపిండ్రు..

నిర్మలాసీతారామన్ హైదరాబాద్ వచ్చి ఇకపై తెలంగాణపై దృష్టిసారిస్తం అని ఒక జోక్ చెబుతది. సారించు.. గంటగంటకూ సారించు.. మిమ్మల్ని ఎవరాపిండ్రు.. అంటూ కెసిఆర్ ఎద్దేవా చేశారు. మేము మా పనితీరు ఎట్లుందో అంతర్గతంగా సర్వే చేయించుకున్నం. మీ కెందుకండీ ఉలుకు.. మా సర్వే ఉత్తమ్‌రెడ్డి కోసం చేయిస్తమా? రెండు సర్వేలు కలిపి 6.5లక్షల శాంపిల్స్ సర్వే చేయించినం. ఒక్కో నియోజకవర్గానికి 3వేల శాంపిల్స్ తీసుకున్నం. ఆ సర్వేలో ఒకదాంట్లో 106, ఒక సర్వేలో 103వస్తయని వచ్చింది. నేనేం చేయ మరి. సన్యాసం తీసుకుంటా అంటున్నడు.. నువ్వు గడ్డం పెంచుకుంటే.. సన్యాసం తీసుకుంటా అంటే జనం ఓట్లేస్తరా అంటూ మండిపడ్డారు.

### వాడువీడు.. అన్నది మోడీని కాదు..

నేను వాడువీడు అని అన్న.. కానీ మోడీని కాదు. కేంద్రంలో కాంగ్రెస్, బిజెపి అధికారంలోకి వచ్చినా ఒరిగేదేంలేదని చెప్పిన. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే టిడిపోడు, టిడిపి అధికారంలో ఉంటే కాంగ్రెసోడు కందెల్లు.. వరికంకులు సభకు తెచ్చెటోళ్ళు. ఇపుడయి కనబడుతున్నయా అన్న. తెలంగాణలో వ్యవహారిక బాష ఇది. వీడు రాడు.. వాడు రాడు అనేది కామన్ లాంగ్వేజ్. నేను ఖచ్చితంగా జనం బాషలనే మాట్లాడుతా.. రాష్ట్రంలో బిజెపి పార్టీ ఉన్నాదండీ.. లక్ష్మణ్ మాట్లాడుతడు పెద్దజోక్.. వరంగల్ బై ఎలక్షన్స్‌లో పాపం అమెరికా నుండి ఓ డాక్టర్‌ను తీసుకొచ్చి పెట్టిండ్రు. మాకు 4లక్షలకు పైగా మెజారిటీ వచ్చింది.. ఏమైంది వాళ్ళ సక్కదనం. కాంగ్రెస్ వాళ్ళకు ఫ్రస్టేషన్. పేద్ద బస్సుయాత్ర అని కొండంతరాగం తీస్తే ఎక్కడా ఐదారువేలు మించి జనం రాట్లే. రైతులకు ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్‌ఇయ్యమని ఎవరన్నా అడిగిండ్రా. తెలంగాణలో అభివృద్ధి.. సంక్షేమం జరుగుతున్నయి. ఇవన్నీ ప్రజలకు తెలిసిపోయినయ్. మా స్కీములన్నీ గోప్యంగా ఉండవు. ఓపెన్‌గానే ఉంటాయ్.. భగీరథ నీళ్ళు, కల్యాణలక్ష్మి, 24గంటల కరెంట్ అన్నీ ఇంటికే వచ్చే.. దాస్తే దాగుతయా? 75లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇయ్యబోతున్నం. ఎవరిచ్చిండ్రు అంటే తెల్వాదా. కాంగ్రెస్ పార్టీ ఎన్ని సర్కస్‌ఫీట్లు చేసినా పది సీట్లు మించి రావు.. అది కూడా మేం గట్టిగా పట్టించుకోకపోతే.. పట్టించుకుంటే కథ వేరే ఉంటది. బిజెపికి ఒక్కసీటు కూడా రావు అని కెసిఆర్ అన్నారు. నేనే 70నిమిషాలు మాట్లాడిన.. మిగిలిన 68నిమిషాల ముచ్చటేంది.. దానిని పక్కదారి పట్టించేందుకే అననిమాట పట్టుకుని గాయిగాయి చేస్తుండ్రు. నేను ఎవరినీ దూషించలేదు.. దూషించాలని నా ఉద్దేశ్యం కాదు అని చెప్పారు. సమావేశంలో మంత్రులు కడియం శ్రీహరి, నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపిలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, కవిత, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవ్యాంధ్రప్రదేశ్ లోనూ టీఆర్ఎస్ పార్టీ పెట్టాలని ప్రగతి భవన్ ముందు ప్లకార్డ్ ప్రదర్శించిన కొణిజేటి ఆదినారాయణ

# నేనే నడుం బిగిస్తా!

(మొదటిపేజీ తరువాయి)

మార్చడం తప్ప కాంగ్రెస్, బిజెపి ఎవరొచ్చినా క్షేత్రస్థాయి పరిస్థితుల్లో మార్పులేదన్నారు. 70ఏళ్ళుగా ఇదే రాజకీయమా? వీరు పోతే వారొస్తారు.. వారుపోతే వీరొస్తారు.. ఉపయోగమేంటి? ఒకే రాజకీయం.. గుణాత్మకంగా ఆలోచించరా.. ఈ రాజకీయం మారాలి.. ప్రభుత్వాలు మారాలి.. దేశంలో మంచి మార్పురావాలి.. అని ప్రజలంతా ఎదురుచూస్తున్నారు అని కెసిఆర్ అన్నారు. ఈ మార్పుకు తానే నాయకత్వం వహిస్తానని, తెలంగాణ ప్రజలు గర్వపడేలా చేస్తానన్నారు. అవసరమైతే దేశమంతా ప్రచారం చేస్తానని.. హైదరాబాద్ నుండి గంటా నలభై ఐదు నిమిషాల్లో దేశంలో ఏ రాష్ట్రానికైనా వెళ్ళొచ్చన్నారు. తాను తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్ కూడా అనర్గళంగా మాట్లాడుతానన్నారు. 2004లో జాతీయ బడ్జెట్ 4లక్షల కోట్లు ఉంటే.. 14ఏళ్ల తర్వాత 24లక్షల కోట్లుగా ఉందని, ఇంత పెద్దదేశానికి.. ఇంత చిన్నబడ్జెట్ అంటే.. బడ్జెట్‌పై అసలు కసరత్తే జరగడంలేదని స్పష్టమవుతోందన్నారు. చైనాలో 1996వరకు తీవ్ర కరువు పరిస్థితులుండేవని, రెండు సార్లు భయంకర కరువులొచ్చి 15లక్షల మందికిపైగా చనిపోయారని.. అయినా ఆ దేశం అద్భుతంగా కోలుకుని ప్రపంచంలోనే అద్భుత దేశంగా ఆవిర్భవించిందన్నారు. భారత్ కంటే ఇంకా వైశాల్యం కూడా తక్కువేనని, ప్రపంచంలో అమెరికా తర్వాత అత్యంత ధనికబడ్జెట్ ప్రవేశపెట్టే దేశంగా ఎదిగిందన్నారు. ఇండియాకు ఏం తక్కువని.. ఇంకా మంచినీళ్ళ కోసం ఎందుకు ఇబ్బంది పడాలి.. నదీజలాలున్నా 35నుండి 40శాతం మాత్రమే ఎందుకు వినియోగించుకోవాలి.. ఇదంతా పడికట్టు రాజకీయాల ఫలితమే కదా అంటూ దుయ్యబట్టారు. భారత రాజకీయాల్లో మార్పు కోసం కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని, మార్పు విషయంలో నాయకత్వం వహించాల్సి వస్తే ఖచ్చితంగా వహిస్తానన్నారు. దేశ రాజకీయాల్లో ప్రబలమార్పు కోసం ప్రయత్నిస్తానన్నారు. రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ఎవరితో మాట్లాడాలో.. వారితో మాట్లాడుతున్నా మని, త్వరలో అవి ఒక రూపం సంతరించుకుంటాయన్నారు. థర్డ్ ఫ్రంట్ కావొచ్చు.. ఇంకో ఫ్రంట్ కావొచ్చు.. కేంద్రంలో గుణాత్మకమైన మార్పు రావాల్సిందేనన్నారు. ఆ మార్పు కోసమే ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. తన రాజకీయ జీవితంలో మూడు సందర్భాల్లో మార్పులు చూశానన్నారు. ఒకటి జనతాపార్టీ ఆవిర్భావమని, పార్టీ పెట్టిన 60రోజుల్లోనే అధికారంలోకి వచ్చిందన్నారు. రెండోది ఎన్టీఆర్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావమని.. పార్టీపెట్టిన 9మాసాల్లోనే అధికారంలోకి వచ్చిందన్నారు. ఇక మూడోది టిఆర్ఎస్ ఆవిర్భావమన్నారు. 60రోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి.. బలమైన పార్టీగా పట్టు సాధించామన్నారు. రైతులకు బిజెపి, కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలన్నారు. భారత రైతాంగం అసహనానికి గురవుతున్నారని, దేశం కోసం పనిచేసే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. మార్పు కోసం నాయకత్వం వహించాల్సివస్తే అందుకు తాను సిద్దమన్నారు.

### తెలంగాణకు చేసిందేంది?

తెలంగాణకు కేంద్రం రాజ్యాంగం ప్రకారం ఇచ్చిన హక్కుగా వచ్చినయే తప్ప అదనంగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. నాలుగేళ్ళలో రూ.81,362కోట్లు కేంద్రం ఇచ్చిందని, పన్నుల రూపంలో రాష్ట్రం ఇందుకు రెండున్నర రెట్లు అదనంగా కేంద్రానికి చెల్లించిందన్నారు. రాష్ట్రంలోని బిజెపి నాయకులు భ్రమల్లో ఉండి మాట్లాడుతున్నారని, వారిది పరిమిత జ్ఞానం.. అజ్ఞానమన్నారు. రాష్ట్రంలోని పథకాలు పరిశీలించి నీతిఆయోగ్ స్వయంగా మిషన్ భగీరథకు రూ.19వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5వేలకోట్లు ఇవ్వమని.. సిఫార్సుచేస్తే రూ.24వేల కోట్లు కాదుకదా.. 24రూపాయలు కూడా రాష్ట్రానికి ఇవ్వలేదన్నారు. సమావేశంలో ఎంపీలు కవిత, గుత్తాసుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, బాల్క సుమన్, మల్లారెడ్డి, సీతారాంనాయక్, బూరనర్సయ్యగౌడ్, నగేష్, దయాకర్ పాల్గొన్నారు.

# ఢిల్లీని తాకిన హోదా సెగ



- ఏపీ భవన్‌లో రాజకీయేతర జేఏసీ ధర్నా
- ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలుకు డిమాండ్
- ప్రధానికి లేఖ, అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపణ

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ప్రత్యేకహోదా ఉద్యమం సెగ దేశ రాజధాని ఢిల్లీకి తాకింది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్లో నాన్-పొలిటికల్ జేఏసీ నేతృత్వంలో ధర్నా ప్రదర్శన జరిగింది. "ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు" అనే నినాదాలతో ఏపీ భవన్ ప్రాంగణం దద్దరిల్లింది. ఢిల్లీలో వివిధ శాఖల్లో పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఏపీ భవన్ ఉద్యోగులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రాజకీయేతర జేఏసీకి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన విద్యార్థి సంఘాలు, ప్రత్యేకహోదా సాధన సమితి ఈ ధర్నాలో పాల్గొన్నాయి. ప్రత్యేక హోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు కట్టి పెట్టి తక్షణమే ప్రకటించడంతో పాటు విభజన చట్టంలో పొందుపరిచిన హామీలన్నింటినీ కూడా అమలు చేయాలని నాన్-పొలిటికల్ జేఏసీ జెనరల్ సెక్రటరీ మెండు చక్రపాణి డిమాండ్ చేశారు. హోదా ద్వారా రాష్ట్రానికి పారిశ్రా మిక రాయితీలు కల్పిస్తేనే పెట్టుబడులు, భారీ పరిశ్రమలు రాష్ట్రానికి వస్తాయని అన్నారు. వాటి ద్వారా పరిశ్రమలకు కలిగే ప్రయోజనంతో పాటు రాష్ట్ర ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. సోమవారం నుంచి జరిగే మలి దశ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అన్ని పార్టీల ఎంపీలు గట్టిగా గళం విప్పాలని నాన్-పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేసింది. అయినా సరే కేంద్రం నుంచి స్పందన లేకపోతే, రాజీనామాలు చేసి తమతో పాటు పోరాటంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. హోదా ఉంటే పరిశ్రమలకు 100 శాతం ఎక్సైజ్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుందని, ఇదేగాక అనేక పారిశ్రామిక, పన్ను రాయితీలు ఉంటాయని జేఏసీ నేతలు వెల్లడించారు. తద్వారా విదేశీ సంస్థలు సైతం రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. దేశంలో ప్రత్యేక హోదా అమలవుతున్న రాష్ట్రాలు విదేశీ పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయని ఉదహరించారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో పొందు పరిచిన రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం, నౌకాశ్రయం, విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలను మంజూరు చేయాలని, అలాగే వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని నాన్-పొలిటకల్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం వారంతా ర్యాలీగా బయల్దేరి ఏపీ భవన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పేరిట రాసిన ఓ బహిరంగ లేఖను విడుదల చేస్తూ, అంబేద్కర్ విగ్రహానికి ఒక విజ్ఞాపణా పత్రాన్ని అందజేశారు. రాజ్యాంగ విలువలు కాపాడుతూ చట్ట సభల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అలాగే హోదా కోసం పోరాడే అన్ని పార్టీలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. జేఏసీ కన్వీనర్ బాలకోటేశ్వరరావు, కో-కన్వీనర్ లింగరాజు ఆంధ్రప్రదేశ్ భవన్లోనే ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ, హోదా కోసం తాము కేంద్రంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ ధర్నాలో సుప్రీం కోర్టు న్యాయవాది గల్లా సతీష్, సామాజిక వేత్త పెంటపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కేజీబీవీలు

- మంత్రి గంటా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో:** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యాధునిక వసతులు సాంకేతికతో కెజిబివిలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రూ.1.25 కోట్లతో భీమిలిలో నిర్మించిన కెజిబివిని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 352 కెజిబివీలు ఉన్నాయని, ఒక కెజిబివి మినహా మిగిలిన అన్ని కెజిబివీలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 352 కెజిబివీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 70వేల 400 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటి వరకూ వీటిలో కొన్నింటిలోనే ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టడం జరిగిందని, వచ్చే ఏడాది నుంచి అన్ని కెజిబివిల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశ పెడుతున్నట్లు మంత్రి తెలిపారు. వీటన్నింటిలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. విద్యార్థి దశ నుండే లక్ష్యాలను నిర్దేశించుకొని కృషి చేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని విద్యార్థులకు ఆయన సూచించారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విద్యార్థులకు చక్కా గైడ్ చేస్తే ఉత్తమ ఫలితాలతో పాటు మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. వివిధ పోటీ పరీక్షల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులను, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులను మంత్రి అభినందించారు.

**వీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌పై ఆగ్రహం**

భీమిలి వెళుతూ మార్గం మధ్యలోనున్న మేలుపాక టీసీ వెల్ఫేర్ వసతి గృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహ నిర్వహణ అధ్వానంగా ఉండటాన్ని మంత్రి గమనించి బిసివెల్ఫేర్ అధికారి కృష్ణారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి వెల్ఫేర్ అధికారి కృష్ణారావుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉపసంచాలకులను ఆదేశించారు. అంతకు ముందు భీమిలిలో రూ.17 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ పర్యటనలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, సర్వశిక్షాభియాన్ పి.ఓ. శివరామ్‌ప్రసాద్, డీఈవో లింగేశ్వరరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







విశాఖలోని చైన్‌మెన్ నాగేశ్వరరావు, వీఆర్వోలు సంజీవ్ కుమార్, వెంకటేశ్వరరావు ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు.

# ఆ ముగ్గురూ 'కోటీశ్వరులు'

- ప్రభుత్వోద్యోగుల ఆస్తులపై ఏసీబీ దాడులు
- రూ. కోట్లాది విలువైన ఆస్తుల గుర్తింపు

**అమరావతి, ఆంధ్రప్రభ :** విశాఖపట్టణం అంటేనే భూముల రేట్లు ఆకాశాన్నంటుతాయి. సమైక్యాంధ్ర, రాష్ట్ర విభజన వంటి అంశాలతో సంబంధం లేకుండా భూముల ధరలు పెరగడం విశాఖకు ఉన్న ప్రత్యేకత. దీనిని సర్వే, రెవిన్యూ శాఖలకు చెందిన అధికారులు అక్రమార్జనకు అనువుగా మలుచుకొని నయా 'కోటీశ్వరులు' అయ్యారు. కొద్ది రోజుల కిందట సర్వే విభాగం అధికారి లక్ష్మీగణేశ్వరరావు ఆస్తులపై సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు రూ.వంద కోట్ల వరకు అక్రమాస్తులు ఆర్జించినట్లు నిర్ధారించారు. ఓ వైపు విశాఖ కేంద్రంగా పని చేస్తున్న వివిధ శాఖల అధికారులపై ఏసీబీ దాడులు నిర్వహిస్తుంటే..మరో వైపు విశాఖ భూ అక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసి విచారణ జరిపింది. చివరకు రెవిన్యూలో చిరుస్థాయి ఉద్యోగులపై వీఆర్వోలు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న చైన్‌మెన్ ఆస్తులపై కూడా ఏసీబీ దాడులు నిర్వహించిందంటే విశాఖ కేంద్రంగా 'ప్రభుత్వ ఉద్యోగుల' అక్రమాస్తుల దందా ఏవిధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. విశాఖ రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం జీవీఎంసీ జోన్-3 చైన్‌మెన్ మునికోటి నాగేశ్వరరావు, విశాఖపట్టణం మల్కాపురం వీర్వో కాండ్రేగుల సంజీవ్ కుమార్, మద్దిలపాలెం వీఆర్వో పొలిశెట్టి వెంకటేశ్వరరావు ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై ఈ ముగ్గురి నివాసాల్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు రూ.కోట్ల విలువైన స్థిర, చరాస్తులకు సంబంధించి దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే వీరి నివాసాలతో పాటు వారి బంధువులు, స్నేహితులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆర్.పి.ఠాకూర్ పత్రికలకు విడుదల చేశారు. ముగ్గురు అధికారులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

**చైన్‌మేన్ నాగేశ్వరరావు**

జీవీఎంసీ జోన్-3 చైన్‌మేన్‌గా పని చేస్తున్న మునికోటి నాగేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లు ఏసీబీ అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. శనివారం ఉదయం ఇతని ఇంటితో పాటు మరో ఐదు ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఇతని పేరిట విశాఖ హౌసింగ్ బోర్డు కాలనీలో 3046 చదరపు అడుగుల్లో పెంట్‌హౌజ్‌తో కూడిన జీ ప్లస్ 2 నివాస భవనం, ఒక మోటారు సైకిల్ ఉంది. భార్య సూర్యప్రభ పేరిట విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరం గ్రామంలో 320 చదరపు గజాల రెండు నివేశన స్థలాలు, ఒక మోటారు సైకిల్ ఉంది. కుమారుడు హేమశంకర్ పేరిట విశాఖ హౌసింగ్‌బోర్డు కాలనీలో జీ ప్లస్ 2 నివాస భవనం, రెండు కార్లు ఉన్నాయి. కోడలు హిరణ్మయి పేరిట రూ.55వేల విలువైన వాహనం ఉంది. కోడలు తల్లి పేరిట మరో ద్విచక్ర వాహనం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇతర ఆస్తులకు సంధించి రూ.11.10లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.40వేల విలువైన వెండి సామాగ్రి, రూ.3లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.5లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రూ. బ్యాంకులో రూ.41లక్షల నగదు, ఇంట్లో రూ.1.21లక్షల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**వీఆర్వో సంజీవ్ కుమార్**

విశాఖ అర్బన్ తాహసిల్దారు కార్యాలయంలో వీఆర్వోగా పని చేస్తున్న కాండ్రేగుల సంజీవ్ కుమార్ ఇంటితో పాటు 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. 2008లో వీఆర్వోగా ప్రభుత్వ సర్వీసులో చేరిన సంజీవ్ కుమార్ ఉద్యోగంతో పాటు రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేస్తున్నట్లు స్థానికులు చెపుతుంటారు. ఈ క్రమంలోనే ఇతని ఆస్తులపై ఏసీబీ అధికారులు దృష్టిసారించి దాడులు నిర్వహించారు. విశాఖ జిల్లా అనకాపల్లిలో జీ ప్లస్ 2 నివాస భవనంతో పాటు ఒకకారు, మోటారు సైకిల్ సంజీవ్ కుమార్ పేరిట ఉన్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. భార్య రమ్య పేరిట మద్దిలపాలెంలో జీ ప్లస్ 3 అపార్టుమెంటు నిర్మించేందుకు స్థలం అభివృద్ధికి తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గాజువాకలోని చినగంట్యాడలో జీ ప్లస్ 1 నివాస భవనం ఉంది. కొడుకు దినేశ్ కుమార్ పేరిట అనకాలపల్లి, నర్సీపట్నం, యలమంచిలి పట్టణాల్లో మూడు మెడికల్ సెంటర్లు ఉన్నాయి. పెదగంట్యాడలో ఐరన్, స్టీలు బై ప్రొడక్ట్స్ నుంచి సిమెంట్ తయారీ యూనిట్, ఆటోనగర్ లో సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమలు ఉన్నాయి.

**బినామీల పేరిట**

కుటుంబ సభ్యుల పేరిట కొద్దిపాటి ఆస్తులు మాత్రమే ఉంచిన సంజీవ్ కుమార్ సన్నిహితులను బినామీలుగా పెట్టి రూ.కోట్ల విలువైన ఆస్తులు కూడగట్టారు. సన్నిహితుడైన దాసరి డానియేల్ పేరిట విశాఖ చినవాల్తేరులో రూ.1.19 కోట్ల విలువైన 3767.33 చదరపు గజాల స్థలంలో జీవన్ కుమార్ తన వాటాగా రూ.60లక్షలు చెల్లించాడు. విశాఖలోని చినగడిలిలో రూ.8.13 కోట్ల విలువైన 1.60 సెంట్ల స్థలం కొనుగోలుకు రూ.20లక్షలు అడ్వాన్సుగా చెల్లించాడు. పరదేశీపాలెంలో రూ.2కోట్ల విలువైన 3.31 సెంట్ల స్థలం కొనుగోలుకు రూ.20లక్షలు బయానాగా చెల్లించారు. మరో సన్నిహితుడు ఉమా శంకర్ పేరిట ఎండాడలో అభివృద్ధి కోసం తీసుకున్న స్థలానికి రూ. 3లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. బైశెట్టి గణేశ్వరరావు అనే మరో సన్నిహితుని పేరిట వేపగుంట గ్రామంలో రూ.12లక్షలు అడ్వాన్సుగా చెల్లించి 13897 చదరపు గజాల స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. పిళ్లా శ్రీనివాస్ పేరిట రూ.2లక్షలు అడ్వాన్సుగా చెల్లించి చంద్రవాణిపాలెంలో ఎకరా 8 సెంట్లు అభివృద్ధి కోసం తీసుకున్నారు. భార్య రమ్య, బంధువు దాడి శ్రీరామకృష్ణపేరిట వడ్లపూడిలో రూ.1.50 లక్షల షేర్‌తో ఖాళీ స్థలం, ఇదే ప్రాంతంలో మరో ఖాళీ స్థలం రూ.1.50 లక్షల షేర్‌తో తీసుకున్నారు. సంజీవ్ కుమార్ స్నేహితుడైన వై.భీమారావు పేరిట మద్దిలపాలెంలో 1065 చదరపు గజాలు అభివృద్ధికి తీసుకొని రూ.66లక్షలు చెల్లించారు. మరో స్నేహితుడు టి.రమేష్ కుమార్ పేరిట మధురవాడలో రూ.2లక్షలు అడ్వాన్సుగా చెల్లించి 3.25సెంట్ల భూమి కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. సంజీవ్ కుమార్‌తన స్నేహితుడు శ్రీచౌదరితో కలిసి మధురవాడలో ఐదెకరాల స్థలం కొనుగోలు ఒప్పందం చేసుకొని తన వాటాగా రూ.33లక్షలు చెల్లించాడు. ఇక ఇతర చరాస్తుల వివరాల్లోకి వెళితే రూ.18.33లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.6లక్షల విలువైన గృహోపకరణాలు, నగదు రూ.6440, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.1.23లక్షలకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**వీఆర్వో వెంకటేశ్వరరావు ఆస్తులపై సోదాలు**

మద్దిలపాలెం వీఆర్వో పొలిశెట్టి వెంకటేశ్వరరావు ఇల్లు సహా మరో నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు పేరిట ఒక కారు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కుమారుడు చైతన్య, అత్తగారు ఎస్.సత్యవతి పేరిట చినగంట్యాడ గ్రామంలో 290 చదరపు గజాల స్థలం, గాజువాకలో రెండు జీ ప్లస్ 1 నివాస భవనాలు ఉన్నాయి. ఇతర ఆస్తుల విషయానికి వస్తే రూ.4.75లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.4లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.3.70లక్షల నగదును గుర్తించగా యాక్సిస్ బ్యాంకు లాకర్ తెరవాల్సి ఉంది.

# 'కళారత్న' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి (సాంస్కృతిక శాఖ) ఈ నెల 18న విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహిస్తోంది. అదే రోజున వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, కవులకు ఉగాది పురస్కారాలతోపాటు కళారత్న పురస్కారాలను కూడా ప్రదానం చేయాలని నిర్ణయించింది. సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రి, అవధాన రంగాల్లో హంస పురస్కారాలను ప్రధానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

# మాజీ స్పీకర్ బాలయోగికి సీఎం ఘన నివాళి



**అమరావతి, ఆంధ్రప్రభ :** లోక్‌సభ మాజీ స్పీకర్, టీడీపీ నేత జీఎంసీ బాలయోగి 16వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘన నివాళులర్పించారు. తొలిసారి ఒక దళిత వ్యక్తిని లోక్‌సభ స్పీకర్‌గా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని అన్నారు. బాలయోగి సమర్థత ఆధారంగానే ఆయనను లోక్‌సభ స్పీకర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రమాదాల్లో బాలయోగి, లాల్ జాన్ పాషా, ఎర్రన్నాయుడు లాంటి గొప్ప నేతలను తెలుగుదేశం పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యానం, ఎదురులంక వారధికి, హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంకు బాలయోగి పేరు పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధి, ముఖ్యంగా కోనసీమ అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారని కొనియాడారు. బాలయోగి కోల్పోవడం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు.

**బాలయోగి సేవలు మరువలేనివి**

లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి దేశ, రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ జయరామిరెడ్డి అన్నారు. శనివారం జీఎంసీ బాలయోగి 16వ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయరామిరెడ్డి మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి బాలయోగి నిరంతరం కృషి చేసిన గొప్ప వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆనాడే లోక్‌సభ స్పీకర్‌గా ఎంపిక చేశారని తెలిపారు. స్పీకర్‌గా పనిచేసిన సమయంలో ఆయన అనేక రాజకీయ ఒడిదుడుకులు, అటుపోట్లను ఎదుర్కొన్నారని అన్నారు. స్పీకర్‌గా పార్లమెంట్ వ్యవస్థ మంచి పేరు తీసుకురావడమే కాకుండా ఈ వ్యవస్థపై విదేశాలు సైతం అధ్యయనం చేసేలా అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. ఎంతో హుందాగా సభను నడిపించి స్పీకర్ స్థానానికి వన్నె తీసుకువచ్చారని శ్లాఘించారు. ప్రతి వ్యక్తి బాలయోగి సేవలను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఎందరికో స్ఫూర్తిదాతగా నిలిచిన బాలయోగి అకాల మరణం చెందిన సంఘటన పార్టీ వర్గాలను, సామాన్యులను సైతం కలిచి వేసిందని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో బాలయోగి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యనిర్వాహకులు ఎ.వి.రమణ, మీడియా కో-ఆర్డినేటర్ దారపునేని నరేంద్ర, నేతలు షేక్. లాల్ వజీర్, వి.హర్ష, తెలుగు విద్యార్థి సంఘ నేతలు చైతన్య, యువత నాయకులు మల్లి, అశోక్, ప్రభాకర్, తెలుగు మహిళా నేతలు, సత్యవాణి, ఉమాదేవి, రాణి, మహాలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రాకు పోలవరం జీవనాడి

- బాబుకు కేవీపీ బహిరంగలేఖ


**అమరావతి ఆంధ్రప్రభ :** ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ప్రాజెక్టు జీవనాడి అని, పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రమే ప్రాజెక్టును పూర్తి చేయాలని యూపీయే ప్రభుత్వం చట్టం చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రజలను మోసం చేయవద్దని, ఇప్పటికైనా స్వార్థం వీడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కేవీపీ శనివారం పది పేజీల బహిరంగ లేఖ రాశారు. పోలవరం విషయంలో వాస్తవాలను ప్రజలకు తెలియచేసేందుకే తాను ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాస్తున్నానని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. యూపీయే కేబినెట్ తీర్మానం ప్రకారం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకుగాను పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఏర్పాటు చేశారని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఏర్పాటు చేయగానే ప్రాజెక్టు అంతా కేంద్రం పరిధిలోకి వెళ్లిందన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న పరిణామాల వల్ల అంతిమంగా నష్టపోయేది ఆంధ్రప్రదేశ్ ప్రజలేనని చంద్రబాబు, మోడీ, జైట్లీకి ఏమీ కాదని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు స్వార్థం వీడి పోలవరం విషయంలో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వమే భరించాలని లిఖిత పూర్వకంగా కోరాలని, అదే విషయాన్ని న్యాయ స్థానంలో చెప్పి పాపాలకు కొంతమేర అయిన ప్రాయశ్చిత్తం చేసుకోవాలని చంద్రబాబుకు రాసిన లేఖలో కేవీపీ పేర్కొన్నారు.

# విభజన హామీలను సాధించి తీరుతాం

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రంతో పోరాడుతు న్న టీడీపీ ప్రభుత్వం హోదా ప్రయోజనాలతో పాటు విభజన హామీలన్నింటిని సాధించి తీరుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ స్పష్టం చేశారు. శనివారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 29 సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను, ఉన్నతాధికారులను కలవడంతో పాటు హోదా కోసం రెండు సార్లు అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు, తరువాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఏపీ అభివృద్ధికి కట్టుబడతామని, హోదాకు మించిన ప్రయోజనాలతోపాటు విభజన హామీలన్నింటినీ నెరవేరుస్తామని హామీ ఇచ్చిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. కేంద్ర మంత్రి పదవులు టీడీపీకి కొత్తేమి కాదని, రాష్ట్రప్రయోజనాల కోసమే బీజేపీతో జత జతకట్టడం జరిగిందన్నారు. రాష్ట్రనిధుల విషయంలో పవన్ వాఖ్యాలు స్వాగతిస్తామని, అయితే గత నాలుగు సంవత్సరాలుగా టీడీపీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్న వాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తల్లి, పిల్ల కాంగ్రెస్ నేతల అడ్డుగోలు విభజన కష్టనష్టాలతో, రూ.16 వేల కోట్ల లోటుతో ఏర్పడిన నవ్యాంధ్ర నేడు పలు రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందంటే అది సీఎం చంద్రబాబు కఠోర శ్రమ, సంస్కరణలు, పరిపాలనదక్షత అనే విషయం మరువరాదన్నారు. హోదా ప్రయోజనాలు, విభజన హామీలు, నిధుల కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం వారీగా కేంద్రంపై ఒత్తిడికి దశలవారీ పోరాటానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసంలో కలిసిన జీ వివేక్, వినోద్

# హైకోర్టులో 3.25 లక్షల కేసుల పెండింగ్



- లోక్ అదాలత్‌ల వల్ల 7 శాతం కేసులు తగ్గింపు
- తాత్కాలిక సీజే జస్టిస్ రమేష్ రంగనాథన్
- నల్సార్ వర్సిటీలో పీజీ డిప్లొమాల ప్రదానం

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** న్యాయమూర్తుల కొరత వల్ల ఉమ్మడి హైకోర్టులో 3.25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ చెప్పారు. ఆమోదం పొందిన న్యాయమూర్తుల సంఖ్య 61కాగా కేవలం 30 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఎడిఆర్, ఎఫ్‌డిఆర్ 16 వ స్నాతకోత్సవం శనివారం నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా జస్టిస్ రమేష్ రంగనాథన్ మాట్లాడుతూ, న్యాయమూర్తుల కొరత వల్ల ప్రతి నెలా కొత్తగా 5 వేల కేసులు హైకోర్టులో నమోదవుతున్నాయని చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లలోని కింది కోర్టుల్లో 10 లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లఉన్నాయని సీజే వెల్లడించారు. తమకు ఉన్న పరిమితులకు లోబడి వివాదాల పరిష్కార పద్ధతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. తరచుగా లోక్ అదాలత్‌లు, మెగా లోక్ అదాలత్‌లు నిర్వహించడం వల్ల కేసుల పరిష్కారంలో పురోగతి సాధించామన్నారు. అదాలత్‌లు నిర్వహించడం వల్ల గత సంవత్సరం కన్న7 శాతం కేసులు తగ్గించామని జస్టిస్ రమేష్ రంగనాథన్ తెలియజేశారు. ఐసిఎడీఎఆర్ ప్రాంతీయ కేంద్ర ఇంచార్జ్ జేఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ, చట్ట పరమైన సంస్కరణలలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మధ్యవర్తిత్వం ఎంతో కీలకంగా మారిందన్నారు.న్యాయస్థానాలలో పెరుగుతున్న కేసుల కారణంగా సత్వర న్యాయం అందించడంలో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. న్యాయం సకాలంలో అందకపోతే పార్టీలు చట్ట విరుద్ధమైన సంస్థలను ఆశ్రయించే ప్రమాదం లేకపోలేదని మూర్తి హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఎదురైతే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంతోనే న్యాయ వ్యవస్థలు ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సీలియేషన్ విధానాలను ప్రోత్సహిస్తున్నాయని తెలియజేశారు. నల్సార్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కార పద్ధతులైన ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సీలియేషన్ విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఎడిఆర్‌లో డిప్లొమా చేసిన 157మందికి పీజీ డిప్లొమాలను ప్రదానం చేశారు. పి సయ్యద్ ముజీబ్‌కు స్వర్ణపతకం, కె ప్రవీణ్‌కుమార్‌కు రజత పతకాలను కూడా ప్రదానం చేశారు. కార్యక్రమంలో నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి కూడా మాట్లాడారు.

## దోషులైన ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ నిలిపివేతపై
# హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు అవినీతి/క్రిమినల్ అభియోగాలపై వివిధ న్యాయ స్థానాలు విధించిన శిక్ష అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ తాత్కాలికంగా పెన్షన్ ప్రయోజనాలను నిలిపివేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తేది.5.2.2013న జారీ చేసిన జీవో నంబర్ 26 ను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన పెన్షనర్, న్యాయవాది ఎన్.సత్యనారాయణ రాజు దాఖలు చేశారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21 లను ఉల్లంఘించేదిగా ఉందని తెలిపారు. తాత్కాలిక పెన్షన్ ప్రయోజనాల ను నిలిపివేత దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయడం లేదన్నారు. ఈ జీవోను కేవలం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ జీవో వల్ల పెన్షనర్ తో పాటు అతని కుటుంబసభ్యుల జీవితాలు ప్రమాదంలోకి నెట్టబడుతాయని పిటిషనర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏకరూపమైన చట్టం అమలుకు ఈ జీవో విరుద్ధమన్నారు. దేశంలో ఎక్కడా అమలు చేయని ఈ జీవోను కేవలం తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం చేసిన చట్టం కేంద్ర చట్టం కంటే అతీతంకాదని పిటిషనర్ గుర్తు చేశారు. ఆరు నెలల జైలు శిక్ష పడిన జస్టిస్ సీఎస్.కర్ణన్ కు కూడా అన్ని పెన్షన్ ప్రోయోజనాలను పూర్తిగా చెల్లించాలంటూ అక్కౌంటెంట్ జనరల్ ను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21 మరియు ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్,1980 లను ఉల్లంఘించే ఈ జీవో నంబర్ 26ను కొట్టివేయాలని పిటిషనర్ అభ్యర్థించారు.

ఈ ప్రజాహిత వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులను చేర్చారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి లతో కూడిన ధర్మాసనం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

# నవభారత నిర్మాణం దిశగా బీజేపీ జైత్రయాత్ర

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కిషోర్



**అమరావతి,ఆంధ్రప్రభ :** రానున్న 2019 నాటికి నవ భారత నిర్మాణం జరగాలన్న ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి అనుగుణంగా బీజేపీ జైత్రయాత్ర కొనసాగుతోందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యామ్‌కిషోర్ అన్నారు. ఇందులో భాగమే ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయమని ఆయన పేర్కొన్నారు. త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకొని శనివారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తులు పాల్గొని బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సంరద్భంగా శ్యామ్‌కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టు ముక్త భారత్ అనే నినాదాన్ని ప్రజలు అశీర్వదిసున్నట్లు చెప్పారు. ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాల్లైఓ కూడా బీజేపీకి ప్రజలు మద్దతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న కర్నాటక ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశంలో కమ్యూనిస్టులకు మిగిలిన ఏకైక రాష్ట్రం కేరళ అని చెపుతూ ఇప్పటికే కేరళ స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేరళలో కూడా బీజేపీదే విజయం అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సగ్గుర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి దిలీప్, బీజేపీ రాష్ట్ర, నగర, జిల్లా నేతలు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ బంగారు సుశీల మృతి

- సంతాపం వ్యక్తం చేసిన భాజపా నేతలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** భాజపా జాతీయ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత బంగారు లక్ష్మణ్ సతీమణి, మాజీ ఎంపీ బంగారు సుశీల (70) మృతి చెందారు. గతకొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఫిల్మ్‌నగర్‌లోని అపోలో ఆసుపత్రికి వారం రోజుల క్రితం తరలించారు. చికిత్స పొందుతు శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఉపాధ్యాయ వృత్తిలో కొంతకాలం పనిచేశారు. బంగారు లక్ష్మణ్‌ను వివాహం చేసుకున్న అనంతరం ఆయన రాజకీయ ఎదుగుదలకు పూర్తి సహాయ సహకారాలను అందించారు. తదనంతరం పార్టీ ఆదేశాల మేరకు రాజస్థాన్‌లో జాలోర్ సిరిహీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బూటాసింగ్‌పై విజయం సాధించారు. బంగారు సుశీల సామాజిక కార్యకర్తగా, పార్టీ కార్యకర్తగా ఎనలేని సేవలు అందించారు. కాగా ఆమె మరణవార్త తెలుసుకుని భాజపా నేతలు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి తరలివచ్చారు. శనివారం రాత్రి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆమె నివాసానికి భౌతిక కాయాన్ని తరలించారు. సుశీల మృతి పట్ల కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, శాసనసభా పక్షం నాయకుడు కిషన్‌రెడ్డి, శాసనమండలి పక్ష నాయకుడు రాంచందర్‌రావు, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు బద్దం బాల్‌రెడ్డి తదితరలు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# నక్సల్స్ ఉనికి లేకుండా చేస్తాం

• తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి



**సంగారెడ్డి, ప్రభన్యూస్ :** తెలంగాణ ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన మావోయిస్టుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కమాండెంట్ సుశీల్ కుమార్ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో జరిగిన అంత్య క్రియలకు శనివారం రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇంటలి జెన్స్ ఐజి నవీన్‌చంద్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సహా పదితరులు హాజరై సుశీల్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం సుశీల్‌కుమార్ అంత్యక్రియలు పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్ల ఉనికిని లేకుండా చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మావోల కదలికలు లేనేలేవని వారి ఉనికిని చాటుకునేందుకు పత్రికా ప్రకటనలు చేస్తారని, కాని తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని అంతే కాకుండా ఎలాంటి అరాచక శక్తులను అయినా మట్టి కరిపించేందుకు తెలంగాణ పోలీసు చాలా చురుకుగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అడవి మార్గంలో ప్రయాణిస్తే నష్టం తీవ్రంగా ఉంటుందని దాని ఫలితంగా ఆ ప్రాంతాల అభివృద్ధి కూడా కుంటుబడుతుందని మహేందర్‌రెడ్డి తెలిపారు. కావునా పోరు బాటలో యువత ప్రయాణించరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రభన్యూస్ :** తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు గుర్తించారు. బీజాపూర్ జిల్లా, పూజారి కాంఖేడ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు, నలుగురు పురుషులు ఉన్నట్లు పోలీసు అధికారులు ప్రకటించారు. ఇందులో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహంతో పాటు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను శుక్రవారం భద్రాచలానికి తరలించారు. మిగిలిన ఎనిమిది మంది మృతదేహాలను శనివారం భద్రాచలానికి తరలించారు. ఈ మృతదేహాలను పరిశీలించిన పోలీసులు ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు గుర్తించారు. మృతి చెందిన పది మంది మావోయిస్టుల్లో ఏడుగురి వివరాలను పోలీసులు గుర్తించారు. మిగిలిన ముగ్గురి వివరాలు వారి కుటుంబ సభ్యులు వచ్చి పరిశీలిస్తేనే వివరాలు లభ్యమయ్యే పరిస్థితి నెలకొంది. హైకోర్టు ఆదేశాల మేరకు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిరవహించారు.

**ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోలు వీరే..:**

సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది



మృతి చెందగా, ఎడుగురి వివరాలను పోలీసులు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా , రాంపూర్ గ్రామానికి చెందిన దొడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ మావోయిస్టు జిల్లా కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా సింగంకు చెందిన బుద్రి, తిప్పాపురంనకు చెందిన ఐతు దళ సభ్యుడిగా పని చేస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగులూరు పోలీసు స్టేషన్ పరిధిలోని తోగడ్డాకు చెందిన సోమిడి అలియాస్ సుక్కి దళ సభ్యురాలిగా పని చేస్తుంది. అదే ప్రాంతానికి చెందిన కోసి దళ మెంబర్‌గా పని చేస్తుంది. గొల్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని వీరాపురంనకు చెందిన రామే అలియాస్ పండే ఏరియా కమిటీలో వైద్య బృందంలో పని చేస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బైరంగఢ్‌కు పోలీసు స్టేషన్ పరిధిలోని దుంగా ఇంద్రావత్ గ్రామానికి చెందిన మల్లేష్ అలియాస్ బామన్ దళ కమాండర్‌గా పని చేస్తున్నాడు. మిగిలిన ముగ్గురి వివరాలు ఇంకా గుర్తించాల్సి ఉంది.

**చట్టప్రకారమే పోస్టుమార్టం ప్రక్రియ : ఎస్పీ అంబర్ కిషోర్ ఝా**

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు చట్టప్రకారమే పోస్టుమార్టం ప్రక్రియ నిర్వహించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం ఆయన భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో శుక్రవారం ప్రకటించిన ఆరుగురు మహిళా మావోలు, నలుగురు పురుషులు ఉన్నట్లు తెలిపామన్నారు. శనివారం పూర్తి స్థాయిలో మృతదేహాలు తరలించిన అనంతరం పరిశీలించగా ఏడుగురు మహిళా మావోయిస్టులు, ముగ్గురు పురుషులు ఉన్నట్లు గుర్తించామన్నారు. పోస్టుమార్టం ప్రక్రియ అంతా గతంలో ఇచ్చిన సుప్రీం కోర్టు , తాజాగా ఇచ్చిన హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుల వివరాలన్నింటినీ ప్రకటిస్తామన్నారు.

## బీఈడీ పూర్తిచేసి మావోయిస్టుగా మారిన స్వామి

• చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి



**వరంగల్ , ప్రభన్యూస్ బ్యూరో** :ఉపాధ్యాయుడు కావాల్సిన స్వామి మావోయిస్టుగా మారి ప్రాణాలు కోల్పోయారు. 17 సంవత్సరాలుగా అజ్ఞాతంలో కొనసాగుతున్న దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. శుక్రవారం తెల్లవారు జామున తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో వరంగల్ అర్బన్ జిల్లాలోని కాజీపేట మండలం రాంపేటగ్రామానికిచెందిన దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఉన్నారు. ప్రభాకర్ మృతిచెందిన విషయాన్ని అటు పోలీసులు, ఇటు మావోయిస్టులు ధృవీకరించారు. వరంగల్ నగర సమీపంలోని కడిపికొండ శివారు రాంపేట గ్రామానికి చెందిన మెట్టు రాములు యాంకాలమ్మ దంపతుల కుమారుడైన దాడబోయిన స్వామి (51) ఐదవ తరగతి వరకు కడిపికొండలో ఆరు నుంచి 10వ తరగతి వరకు కాజీపేటలోచదివారు. సీకెఎం కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ ఎల్‌బీ కళాశాలలో చదివారు. బీఈడీ పూర్తి చేసిన తర్వాత కొంత కాలం ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా 2001లో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రాలేదు. మావోయిస్టు పార్టీలో చేరి 17 సంవత్సరాలుగా అజ్ఞాతంలోకొనసాగుతున్నారు. దళంలో చేరకముందే స్వామికి షాపల్లి గ్రామానికి చెందిన రేణుకతో 1993లో వివాహం అయింది. ప్రస్తుతం స్వామి సోదరులు మాత్రమే స్వగ్రామంలో ఉంటున్నారు. 2001లో అప్పటి పీపుల్స్ వార్ తర్వాత మావోయిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదిగిన స్వామి ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

## ద్రోహి ఇచ్చిన సమాచారంతో

# సహచరులను కోల్పోయాం

• అగ్రనేతలంతా సురక్షితం
• మా టార్గెట్ ఇక టీఆర్ఎస్ నేతలు
• మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రజలతో మమేకమై సేదదీరుతున్న సమయంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరిపారని తెలంగాణ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటనలో పత్రికలకు తెలిపారు. ఖమ్మం జిల్లా చర్ల సమీపంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో జగన్ పత్రికలకు లేఖ పంపించారు.

ఈ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలెవరూ మరణించలేదని ఆయన పేర్కొన్నారు. హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి చనిపోలేదని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 10 మందిలో జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, రత్న ఉన్నార న్నారు. మిగతా కామ్రేడ్స్ అంతా ఛత్తీస్‌ఘడ్‌లో సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందిన వారని తెలియజేశారు. కార్పొరేట్ శక్తులకు భూమి, నీరును ధారాదత్తం చేసేందుకే నియంత కెసిఆర్ ఈ విధమైన బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారన్నారు. ఇకపై టిఆర్ఎస్ నేతలపై దాడులను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. హిందూత్వ నాయకుడు రమణ్‌సింగ్, నియంత కెసిఆర్‌లు కలిసికట్టుగా ఆదివాసీలపై, ప్రశ్నించే వారిని నిర్మూలించేందుకు దుర్మార్గమైన దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చనిపోయింది ఎవరనేది తెలిసినప్పటికీ పోలీసులు ప్రజల్లో గందరగోళం సృష్టించడం కోసం అబద్దాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు. ముఖ్యనాయ కులు చనిపోయారని ప్రచారం చేసి ప్రజల్లో మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. కార్పొరేట్లకు వనరు లను దోచిపెట్టడం కోసం తెలంగాణ, ఎపి, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని వివరించారు. ప్రజల సహకారంతో ఈ దాడులను తిప్పికొడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఎన్‌కౌంటర్ బూటకం: విరసం నేత వరవరరావు**

ఖమ్మం జిల్లా చర్ల ప్రాంతంలో శుక్రవారం జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని విరసం నేత వరవరరావు అన్నారు. మావోయిస్టులను పట్టుకుని వచ్చి చిత్రహింసలకు గురి చేసి తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులలో చంపేశారని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై తక్షణమే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ వల్ల మావోయిస్టు ఉద్యమానికి తాత్కాలిక ఇబ్బందు లు ఎదురైనప్పటికీ పూర్తిగా నిర్మూలించాలనుకున్న ఉద్దేశ్యం నెరవేరదని ఆయన పేర్కొన్నారు.

**ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి: సీపీఐ (ఎంఎల్ ) ప్రతిఘటన డిమాండ్**

ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను,సానుభూతి పరులపై కేంద్ర, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు హత్యాకాండకు పాల్పడుతున్నాయని సీపీఐ (ఎంఎల్) ప్రతిఘటన పార్టీ నాయకులు అన్నారు. పేద వర్గాల పక్షాన పోరాటం చేస్తున్న మావోయిస్టులను హతమార్చిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు మల్లేపల్లి ప్రభాకర్, షేక్‌షావలి, బుద్ద సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని వారు కోరారు.

## డీజిల్ ఇంజిన్‌తో

# ఎలక్ట్రిక్ ఇంజిన్ తయారీ!

• భారతీయ రైల్వే నవ చరిత్ర
• 69 రోజుల్లో ప్రాజెక్టు పూర్తి
• మేకిన్ ఇండియాకు మరింత వన్నె

**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే చరిత్ర సృష్టించింది. తొలిసారిగా డీజిల్ ఇంజిన్‌ను ఎలక్ట్రిక్ ఇంజిన్‌గా మార్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని శిరసా వహించింది. భారతీయ రైల్వేలకు చెందిన ఉత్పాదక యూనిట్ డీజిల్ లోకోమోటివ్ వర్క్స్(డిఎల్‌డబ్ల్యు) ఇంతటి బృహత్తరమైన కార్యాన్ని నిర్విఘ్నంగా విజయవంతం చేసింది. ఆ క్రమంలో 2,600 అశ్వ శక్తి (హెచ్‌పి) కలిగి ఉన్న డీజిల్ ఇంజిన్‌ను 5,000 అశ్వశక్తి సంతరించుకున్న ఎలక్ట్రిక్ ఇంజిన్‌గా మార్చారు. ఇది 10,000 హెచ్‌పి ఇంజిన్‌లో సగం సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. పాత డీజిల్ ఇంజిన్ 3,200 హెచ్‌పి కలిగి ఉంది. కానీ పట్టాలెక్కే సరికి అది 2,600 హెచ్‌పికి పడిపోతుంది. అదే ఎలక్ట్రిక్ ఇంజిన్ విష యానికి వచ్చేసరికి హెచ్‌పి తగ్గిపోయే అవకాశం లేదు. 10,000 హెచ్‌పి ఎలక్ట్రిక్ ఇంజిన్ కోసం రెండు 5,000 హెచ్‌పి ఇంజిన్లను జోడిస్తే సరిపోతుంది అని రైల్వే ఉన్నతాధికారి తెలిపారు. డిఎల్ డబ్ల్యు తొలి మహిళా జనరల్ మేనేజర్ రష్మి గోయెల్ నేతృత్వంలో ప్రాజెక్టును చేపట్టారు. భారతీయ రైల్వేల్లో కర్బ న ఉద్గారాల తగ్గుదల, నవ శకపు సాంకేతికతల ప్రవేశానికి ఒక అడుగు ముందుకు పడింది. రైల్వే బోర్డు ట్రాక్షన్ సభ్యుడు ఘనశ్యామ్ సింగ్ మార్గదర్శనంలో డిఎల్‌డబ్ల్యు, బిహెచ్‌ఇఎల్, ఆర్‌డిఎస్‌ఒ, సిఎల్‌డబ్ల్యు ఇంజినీర్ల బృందం ప్రాజెక్టును పూర్తి చే సింది. ప్రతిష్ఠాత్మక, చారిత్రక ప్రాజెక్టు పనులు గతేడాది డిసెంబరు 22న మొదలయ్యాయి. గత నెల 28న కొత్త ఎలక్ట్రిక్ ఇంజిన్‌ను సిద్ధం చేశారు. డిజిటల్ ఇంజిన్‌ను ఎలక్ట్రిక్ ఇంజిన్‌గా మార్చాలన్న ఆలోచన మొగ్గ తొడిగిన తర్వాత 69 రోజుల్లోనే పూర్తికావడం విశేషం.

# రక్షణ, వాణిజ్య రంగాల్లో సహకారం

• వియత్నాం అధ్యక్షుడితో మోడీ ద్వైపాక్షిక చర్చలు



**న్యూఢిల్లీ :** రక్షణ, వాణిజ్య రంగాల్లో సహాయ సహకారాలు అందిపుచ్చుకునే అంశంపై భారత్ ప్రధాని నరేంద్రమోడీ, వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్‌తో కలిసి ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. చర్చల్లో భాగంగా న్యూక్లియర్ ఎనర్జీతో పాటు పలు ముఖ్యమైన అంశాలపై లోతుగా చర్చలు జరిపారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఉదయమే ప్రధాని మోడీతో చర్చలు జరిపేందుకు వియత్నాం అధ్యక్షుడికి కబురు పంపారు. అన్ని రంగాల్లో సహాయం మరింత పెంపొందించే విధంగా వీరి చర్చలు కొనసాగాయి. భారత్ వ్యూహాత్మక భాగస్వామిగా ఉంటుందని, ఈ పర్యటనతో బంధం మరింత బలోపేతం అయిందని వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో కూడా ట్రాన్‌కు ఘన స్వాగతం పలికారు. భారత్‌లో ట్రాన్ తొలి పర్యటన కావడంతో చర్చలపై మరింత ఆసక్తి నెలకొంది. హైదరాబాద్ హౌస్‌లో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ట్రాన్‌ను మోడీ కోరారు. ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందజేసుకుంటూ ముందుకు వెళ్తామని మోడీ, ట్రాన్ చెప్పారు.

## చైనా అధ్యక్షుడి పదవీకాలం పొడగింపునకు మార్గం సుగమం

**న్యూఢిల్లీః** చైనాలో నేడు ప్రారంభమైన వార్షిక పార్లమెంటు సమావేశాలు చారిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానున్నాయి. అధికారంలో వున్న కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణతో పాటు ప్రభుత్వంలోని పలు కీలక పదవుల్లో వున్న అగ్రశ్రేణి అధికారులందరినీ మార్చి వేసి కొత్తవారిని నియమించేందుకు కూడా ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పదవీ కాలాన్ని పొడిగించేందుకు అడ్డుగా వున్న అధ్యక్ష పదవీ కాలం(రెండు టర్మ్‌లు) నిబంధనను రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించాలని చైనా కమ్యూనిస్ట్ పార్టీ(సిపిసి) ప్రతిపాదించడం గత కొన్ని రోజులుగా చర్చనీయాంశమైంది. పార్లమెంటు రాజ్యాంగ సవరణను ఆమోదిస్తే జిన్‌పింగ్ జీవితకాలం అధ్యక్ష పీఠంపై కొనసాగుతారు. అందుకు ఈ సమావేశాల్లో మార్గం సుగమం కానుంది. ఈ వార్షిక సమావేశాలలో చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్‌టేటివ్ కాన్ఫరెన్స్(సిపిపిసిసి) కి చెందిన 5000 మంది ప్రతినిధులు, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) శాసనమండలి సభ్యులు సిపిసి ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ మరియూ వార్షిక అజెండాలపై పూర్తిస్థాయి చర్చలు నిర్వహిస్తారు. ఇటీవలే రెండో దఫా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన జిన్‌పింగ్ అయిదేళ్ళ పదవీకాలం రాజ్యాంగ సవరణతో జీవితకాలంపాటు ఆ పదవిలో ఆయన కొనసాగేలా చేస్తుంది. చైనా విప్లవం కాలంలో ఏకఛత్రాధిపత్యంతో ఎదురేలేని నేతగా పరిపాలించిన పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ పాలన పునరావృతమైనట్టే. గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్ వద్ద శనివారం ప్రారంభమైన సిపిపిసిసి తో పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో పాటు ప్రీమియర్ లీ కెకియాంగ్, సిపిసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఇతర పార్టీ నేతలు ఈ సమావేశాలకు హాజరయ్యారు.



అధ్యక్షుని పదవీకాలం పొడిగింపుతో పాటు కీలక స్థానాల్లో వున్న అధికారులను కూడా మార్చడానికి ఈ పార్లమెంటు సమావేశాల్లో రంగం సిద్ధమైంది. ఇండియా -చైనా సరిహద్దు చర్చల్లో గత ఐదేళ్ళుగా సేవలందిస్తున్న యాంగ్ జీచి ని మార్చడానికి నిర్ణయం తీసుకున్నారు.

## వేర్వేరు ఘటనల్లో

# ఇద్దరు దళితుల హతం

• హోలీ సంబరాల్లో రెండు వర్గాల మధ్య ఘటన

**జైపూర్(రాజస్థాన్):** రాజస్థాన్‌లోని భరత్‌పూర్, ఆల్వార్ జిల్లాల్లో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దళితులు మృతిచెందారు. ఇద్దరిలో ఓ యువకుడు కూడా ఉన్నట్లు శనివారంనాడు అధికారులు వెల్లడించారు. భరత్‌పూర్‌లోని కుంహార్ ప్రాంతంలో నివసిస్తున్న దళిత కూలీ జస్వంత్ జాతవ్(26)ను కొందరు తీవ్రంగా కొట్టారని, అతడి ఇల్లు కూడా దగ్ధం చేసినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.


జాతవ్ కు పాత గొడవల వల్లే ఘటన జరిగినట్లు కుంహార్ ఎస్‌హెచ్‌ఓ సీతారాం మీనా తెలి పారు. జాతవ్‌ను తీవ్రంగా కొట్టారని, అవి కనపడకుండా శరీరంపై తీవ్ర ప్రభావం చూపి మృతిచెందాడని, అతడి మృతదేహానికి నేడు పోస్ట్‌మార్టం నిర్వహిస్తామని మీనా తెలిపారు. భివాడీ పట్టణంలో హోలీ సంబరాల్లో భాగంగా రెండు వర్గాల యువకుల మధ్య తగాదాలే నీరజ్ జాతవ్(16) యువకుడి మృతికి కారణమ యింది. జాతవ్‌ను వేరే వర్గం వారు తీవ్రంగా కొట్టి గాయపరిచారని, వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు అదనపు ఎస్‌పీ పుష్పేంద్ర సోలంకి తెలిపారు.

## ముంబయిలో అగ్నిప్రమాదం

**ముంబయి:** ముంబాయి శివారులోని అంధేరీలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో దుస్తుల తయారీ కేంద్రం, రంగుల ఉత్పత్తి కేంద్రంతో సహా పలు భవనాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం ఏమీ సంభవించకపోయినా,ఆస్తి నష్టం భారీగానే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఎనిమిది అగ్నిమాపక ఇంజన్లు,ఆరు జంబో వాటర్ ట్యాంకులను రప్పించారు. మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక దళానికి ఎక్కువసమయం పట్టింది.ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

## కేరళ సీఎంకు అస్వస్థత

• అపోలోలో చికిత్స



**చెన్నైః** కేరళ ముఖ్యమంత్రి, మార్క్సిస్టు పార్టీ సీనియర్ నాయకుడు పినరయ్ విజయన్ శుక్రవా రం నాడు చెన్నైలో మధు చిందాకీ అనే గిరిజన యువకుని సభ్యుల ను పరామర్శించిన తర్వాత తేనాంపేట ఆపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం చేరారు. ఆస్పత్రి వైద్య బృదం సలహా మేరకు ఆయన గ్రీమ్స్ రోడ్డులోని ఆస్పత్రిలో చేరా రు. ఆయనకు ప్రత్యేక వైద్య బృందం వైద్య సేవలందిస్తోంది.ఈ బృందంలో ఇన్‌ఫెక్షన్ నిరోధక వైద్య నిపుణులు కూడాఉన్నారు. విజయన్ వయస్సు 72 సంవత్స రాలు. కేరళలో మధు చిందాకీ అల్ల రి మూకల దాడిలో మరణించా డు. అతడి కుటుంబ సభ్యులను విజయన్ పరామర్శిం చారు. విజయన్ ఆరోగ్యంగానే ఉన్నారనీ, ఆయనను రేపు డిశ్చార్జ్ చేసే అవకాశంఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

# ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

• కేంద్రమంత్రి సుజనాచౌదరి



**తిరుమల, ప్రభ న్యూస్:** కుమార్తె వివాహం అనంతరం తిరుమల శ్రీస్వామి వారిని దర్శించుకున్నామని కేంద్ర మంత్రి సుజనాచౌదరి తెలిపారు. శనివారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ తన కుమార్తె వివాహం అనంతరం తిరుమలకు చేరుకుని స్వామివారికి కల్యాణం చేయించి మొక్కులు చెల్లించుకున్నామన్నారు. తిరుమలలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజులు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. అదేవిధంగా సకాలంలో వర్షాలుపడి పాడిపంటలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించానని తెలిపారు. అంతకుముందు శ్రీవారి ఆలయంలో ఎండకు, వర్షాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్న కదిలే పై కప్పును ఆయనకు చూపించి, దాని గురించి ఈవో వివరించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను కేంద్రమంత్రికి టీటీడీ అధికారులు అందచేశారు.

**శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ అరుణ్‌కుమార్‌మిశ్రా, జస్టిస్ ఎన్.వి.రమణలు కుటుంబ సభ్యులతో కలసి శనివారం ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలోకి చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజులు సాదర స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా టీటీడీ ఈవో తిరుమల జేఈవో శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందచేశారు.



**శ్రీవారి సేవలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి**



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని శనివారం ఉదయం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సింధు దర్శించుకున్నారు. ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో ఆమె కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి దర్శనం చాలా బాగా జరిగిందని చెప్పారు. అంతకు ముందు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలకగా టీటీడీ అధికారులు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

# 'నువ్వు గర్వపడేలా చేస్తా అమ్మా!'

• శ్రీదేవిని గుర్తు చేసుకుంటూ జాన్వి లేఖ



**ముంబయి:** తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన అతిలోక సుందరి శ్రీదేవిని గుర్తు చేసుకుంటూ పెద్ద కూతురు జాన్వి లేఖ రాశారు. అంతేకాకుండా, శనివారం శ్రీదేవి పెద్ద కూతురు జాన్వి పుట్టినరోజు. 21వ జన్మదినోత్సవాన్ని తన తల్లిని, ఆమెతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ జాన్వీ ఓ భావోద్వేగ లేఖను రాసింది.


తల్లే తన ప్రపంచం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'నా హృదయంలో తీరని లోటు ఒకటి ఏర్పడింది. దాంతో ఎలా జీవించాలన్న విషయాన్ని నేర్చుకోవాలి. నీ ప్రేమ అనుభూతిని పొందుతున్నాను. నువ్వు బాధ నుంచి, నొప్పి నుంచి సంరక్షిస్తున్నట్లే అనిపిస్తోంది. నేను కళ్లు మూసిన ప్రతిసారి గుర్తు చేసుకోవడానికి కేవలం మంచి విషయాలే గుర్తుకొస్తున్నాయి. దానికి కారణం నువ్వే అని తెలుసు. సాధ్యమైనంత కాలం మా జీవితాల్లో నువ్వు ఉండడం మేం చేసుకున్న అదృష్టం. నువ్వు చాలా మంచిదానివి. చాలా స్వచ్ఛమైన ప్రేమను పంచే వ్యక్తివి. అందుకే దేవుడు నిన్ను తిరిగి తీసుకెళ్లిపోయాడు. నేను ఎప్పుడూ ఆనందంగానే ఉంటానని నా స్నేహితులు అంటుంటారు. దానికి కారణం నువ్వేనని నాకిప్పుడు అర్థమౌతోంది. నన్ను ఎవరేమన్నా పట్టించుకోలేదు. ఏదీ పెద్ద సమస్యగా అనిపించలేదు. ఎందుకంటే అప్పుడు నాకు నువ్వు ఉన్నావు కాబట్టి. నువ్వు నా ప్రాణ స్నేహితురాలివి. నా ఆత్మలో భాగం. మా కోసం నీ జీవితం అర్పించావు. ఇప్పుడు నీ కోసం నేనూ అదే చేయాలి అనుకుంటున్నా. నువ్వు గర్వపడేలా చేస్తా. ప్రతీ ఉదయం అదే ప్రతిజ్ఞతో నిద్ర లేస్తా. నేవ్వు నాలో, ఖుషీలో(చిన్న కూతురు), నాన్నలో నిండి ఉన్నావు. మాపై నీ ప్రభావం చాలా బలమైంది. మేం బతకడానికి అది చాలు. కానీ నీ లోటును తీర్చడానికి మాత్రం అది సరిపోదు' అని జాన్వి లేఖలో పేర్కొన్నారు. 'ఐ లవ్ యూ మై ఎవ్రీథింగ్' అంటూ ముగించారు. ఈ లేఖను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్‌చేసింది. దీంతో పాటు కొన్ని ఫోటోలను కూడా పోస్ట్‌చేసింది.

బోనీ కపూర్ కూడా తన భార్య శ్రీదేవి అంత్యక్రియలు పూర్తయిన తర్వాత ఓ లేఖను మీడియాతో పంచుకున్నారు. శ్రీదేవి అందరికీ చాందిని కావొచ్చుని, కానీ తనకు మాత్రం ప్రేమమూర్తి అని గుర్తుచేశారు. అయితే, తన జీవితాలు ఎప్పటికీ మునపటిలా ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు.

## 27న సింహాద్రి అప్పన్న

# కల్యాణ మహోత్సవం

• ఉగాదినాడు పెళ్లిరాటతో పనులు ప్రారంభం



**విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో:** సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీనృసింహస్వామి కళ్యాణమహోత్సవం ఈనెల 27న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా ఏకాదశి పర్వదినాన అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా డోలోత్సవాన్ని (పెళ్లి చూపులు) కార్యక్రమం వైభవంగా జరిపించారు. ఉగాదినాడు ఆలయం లో రాజగోపురం, ఉత్తర ద్వారం, కళ్యాణ వేదిక వద్ద పెళ్లిరాటలు వేసి అదే రోజు స్వామిని పెళ్లికొడుకుగా అలంకరిస్తారు. తదుపరి పెళ్లి పనులు ప్రారంభిస్తారు. అప్పన్న కళ్యాణోత్సవానికి సంబంధించి ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. రాష్ట్రంలో ముఖ్యమైన వారందరిని సాదరంగా ఆహ్వానించనున్నారు.

# అరుణకు ఘన సన్మానం

క్రీడాప్రభ

**హైదరాబాద్:** ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ పోటీలో భారత్‌కు తొలి పతకం సాధించిపెట్టిన హైదరాబాద్ జిమ్నాస్ట్ అరుణా బుద్ధారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. శనివారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి పద్మారావు గౌడ్ అరుణను సన్మానించి, అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, రాష్ట్ర బ్రేవరీజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, ఒలింపిక్ అసోసియేషన్ అఫ్ తెలంగాణ అధ్యక్షుడు రంగారావు, అధికారులు పాల్గొన్నారు.




## ప్రపంచ ఇండోర్ అథ్లెట్ ఛాంపియన్ షిప్

# బుల్లెట్ మురెల్లీ

### 60మీటర్ల రేసులో మురెల్లీ సీజన్ రికార్డు

**బర్మింగ్‌హాం:** ఐవరీకోస్ట్ అథ్లెట్ మురెల్లీ అహోరి మహిళల 60 మీటర్ల రేస్‌లో ఈవెంట్‌లో రికార్డు సృష్టించింది. ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మురెల్లీ తుపాకి గుండులా దూసుకొపోయి ప్రపంచ రికార్డును తన పేర నమోదు చేసుకోవడమేకాక, తన జట్టుకు స్వర్ణ పతకాన్ని అందించింది. గతంలో ప్రపంచ ఇండోర్ టోర్నీల్లో ఆమె రెండు రజత పతకాలు గెలుచుకుంది. ఈ సారీ మాత్రం ఆమె 60 మీటర్ల రేస్‌ను 6.97 సెకండ్లలో పరుగెత్తి అగ్రస్థానం పొందింది. ఈ సీజన్‌లో ఇదే అత్యంత వేగవంతమైన పరుగుగా రికార్డయింది. ఆమె సహచర అథ్లెట్ మేరీ జోసీ టా లో 7.05 సెకన్లలో పరుగెత్తి రజత పతకాన్ని గెలుచుకోగా స్విట్జర్లాండ్ అథ్లెట్ ముజింగా కాంబుడ్జి కాంస్యాన్ని గెలుకుంది. ఇప్పటివరకు అటు పురుషుల, మహిళా విభాగంలో 60మీటర్ల ఇండోర్ రేసుల్లో ఐవరీకోస్ట్ స్వర్ణ పతకాన్ని గెలుచు కోలేకపోయింది. ఆఫ్రికా వనిత ఐవరీకోస్ట్ తరపున బరిలోకి దిగిన మురెల్లీ తన దేశానికి తొలిసారిగా స్వర్ణాన్ని అందించిన ఘనతను మూటగట్టుకుం ది. తన తండ్రి క్యాన్సర్‌తో మరణించాడని ఆయనకే ఈ గెలుపు అంకితమని మురెల్లీ పేర్కొంది. ' నాకు తెలుసు ఆయన స్వర్గం నుంచి నన్ను చూస్తున్నాడు. నేను కూడా రేస్‌కు ముందు పోటీలో నాకు సహాయం చేయమని ప్రార్థించాను. ఆయన బతికి ఉన్నప్పుడు స్వర్ణ పతకం గెలవలేకపోయాను. ప్రస్తుతం నా భావాలను వెల్లడించలేకపోతున్నాను అని' 30 ఏళ్ల మురెల్లీ ఉద్విగ్నంగా వ్యాఖ్యానించింది.లాంగ్ జంప్‌లో క్యూబన్ టీనేజర్ 19ఏళ్ల ఎచవార్రియా ముందంజపురుషుల లాంగ్ పోటీల్లో క్యూబన్ టీనే జర్ 19ఏళ్ల జువాన్ మిగ్వెల్ ఎచవార్రియా దక్షిణాఫ్రికా అథ్లెట్ వరల్డ్ అవుట్‌డో ర్ ఛాంపి యన్‌ను(8.44 మీటర్లు) వెనక్కి నెట్టా డు. అద్భుత ప్రదర్శన చేసి ఫైనల్ 8మంది లో చేరాడు. డిఫెండింగ్ ఛాంపి యన్ మార్కస్ డెండీ(అమెరికా) 8.42 మీటర్లు దూకాడు. ఎచవార్రియా చివరి జంప్‌లో 8.46 మీటర్లు దూకాడు. ఈ ప్రదర్శ నతో ఎచ వార్రియా స్వర్ణ పతకం గెలు







ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ట్రిపుల్ జంప్ విభాగంలో స్వర్ణం పతకం గెలుచుకున్న వెనుజులా అథ్లెట్ యులిమర్ రోజాస్

## దుబాయ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ టోర్నీ

# ఫైనల్లో పేస్ ఓటమి

**దుబాయ్:** వెటరన్ టెన్నిస్ దిగ్గజం 44 ఏళ్ల లియాండర్ పేస్ దుబాయ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ టోర్నీని రన్నరప్‌గా ముగించాడు. పేస్ ఏటీపీ 97 ర్యాంకుతో ఆడుతూ ఫైనల్లో అమెరికా క్రీడాకారుడు జెమీ సెర్రాటానీ చేతిలో 2-6, 6-7(2) తేడాతో ఓటమి పాలయ్యాడు. గంటా 27 నిమిషాలపాటు సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలి సెట్లో పేస్ ఆశించినంత బాగా రాణించలేకపోయాడు. రెండో సెట్ హోరాహోరీగా సాగ ంది. పాయింట్లు కూడా సమంగా ఇరువురు గెలుచుకుంటూ ఆటను రసకందాయంగా మార్చారు. చివరికి పేస్ 6-7(2) పాయింట్లతో ప్రత్యర్థికి సెట్ కోల్పోయాడు. ఓటమి పాలయినప్పటికి పేస్ ర్యాంకింగ్స్‌లో 300 పాయింట్లను మెరుగు పరుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో పేస్ 1525 పాయింట్లతో ప్రస్తుతం 52వ స్థానంలో ఉన్నాడు. గత ఏడాది ఇదే టోర్నీలో సెమీస్‌కు చేరి 180 పాయింట్లను కాపాడుకున్నాడు. ఇండియా నెం.2 దివిజ్ శరణ్, 45వ స్థానంలో ఉండగా, రోహన్ భూపన్న ప్రపంచ ర్యాంకు 20. ఈ టోర్నీలో దివిజ్ తొలి రౌండ్లోనే ఓటమి పాలయ్యాడు. పేస్ తన ర్యాంకు మెరుగుతో వచ్చే డేవిస్ కప్‌లో ఆడే అవకాశాలను పెంచుకున్నాడు. బెంగళూరులో డేవిస్‌కప్‌కు ఎంపిక జరిగిన సమయంలో పేస్ తొలుత ఆరుగురు జట్ల సభ్యుల్లో ఉన్నాడు. అనంతరం జట్టు కెప్టెన్ మహేష్ భూపతి చివరి నలుగురినుంచి పేస్ పేరును తొలగించడంతో కినుక వహించి డేవిస్ కప్‌పై ఆసక్తిని తగ్గించుకున్నాడు. ఏప్రిల్ తొలివారంలో ఆసియా/ఓసియానా గ్రూప్ 1, రెండో రౌండ్ పోటీల్లో భాగంగా భారత్ చైనాతో ఆడనుంది.





## బీసీసీఐ- ఏసీయు అధిపతిగా అజిత్‌సింగ్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు తన అవినీతి నిరోధక విభాగానికి (ఎసియు) కొత్త అధిపతిని నియమించడానికి సమాయత్తమైంది. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న నీరజ్‌కుమార్ స్థానంలో రాజస్థాన్ మాజీ డీజీపీ అజిత్ సింగ్ షెకావత్‌ను నియమించడానికి రంగం సిద్ధం చేసింది. ఏప్రిల్ 7న ఐపీఎల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అంతకంటే ముందే అజిత్‌సింగ్ ఎసియు అధిపతిగా బాధ్యతలు చేపడతాడని బీసీసీఐ వెల్లడించింది. శనివారం బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు ఈ మేరకు వివరాలను మీడియాకు తెలిపారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అజిత్‌సింగ్ నవంబర్ 30న పదవీ విరమణ చేశాడు. ' బీసీసీఐ అవినీతి నిరో ధక విభాగానికి కొత్త చీఫ్‌గా అజిత్‌సింగ్‌ను నిర్ణయించారు. అవినీతి కలాపాలను నియంత్రించడంలో అజిత్ సింగ్‌ది అందెవేసిన చేయి. తనదైన శైలిలో అవినీతిని ఎదుర్కొంటా డు. ఆ పోస్టుకు ఆయన సరిగ్గా సరిపోతాడు' అని బీసీసీఐ అధికారి చెప్పాడు. ఈ పోస్టుకోసం పోటీపడ్డ వాళ్లలో అజిత్ సింగ్ ముందున్నాడ న్నాడు. రాజస్థాన్ అవినీతి నిరోధక బ్యూరో(ఎసిబి)కు అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు కలిసివచ్చిందని తెలిపాడు. రాజస్థా న్ ఎసిబి చీఫ్‌గా ఉన్న సమయం లో 600కు పైగా అవినీ తికేసులు నమోదు అయ్యా యని బీసీసీఐ అధికారి వివరిం చాడు. 1982 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అజిత్ సింగ్ జైపూర్ నివాసి. అజిత్ జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్‌గా కరాడాసేవలు అందించాడు. జాల్వార్, సవాయ్ మాదోపూర్, జోద్‌పూర్, జైపూర్, సిరోహి జిల్లాలకు ఎస్పీగా పనిచేశాడు.




### ఎసియు సిబ్బంది కొరత

బీసీసీఐ అనుబంధ ఏజెన్సీ ఎసియు అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్న అజిత్‌సింగ్ ముందు పలు సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా ఎసియులో సిబ్బంది సరిపడా లేరు. ముగ్గురు మాత్రమే ఉన్నారు. బీసీసీఐ ఏటా నిర్వహించే అన్ని రకాల మ్యాచ్‌లను పరిగణలోకి తీసుకుంటే.. 1500 మించుతాయి. ఈ నేపథ్యంలో అజిత్‌కు కనీసం 15మంది శాశ్వత ఉద్యోగులు అవసరం. తాత్కాలిక ఉద్యోగులు అంతగా ఉపకరించరని బీసీసీఐ అధికారి వ్యాఖ్యానించాడు. గత మూడేళ్లుగా ఎసియు బ్యూరో అధిపతిగా భాద్యతలను మాజీ ఢిల్లీ పోలీస్ కమిషనర్ నీరజ్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. ఈయన హయాంలోనే 2013లో ఐపీఎల్ పోటీల్లో స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంను ఢిల్లీ పోలీసులు వెలికితీశారు. భారత జట్టు మాజీ బౌలర్ శ్రీశాంత్, దేశీయ ఆటగాళ్లు అంకిత్ చవాన్, అజిత్ చండీలాలను అరెస్టు చేశారు. ఎసియు అధిపతిగా కుమార్ భారత సీనియర్ జట్టుతోపాటు పలు దేశాల్లో పర్యటించాడు. ఎసియులో సిబ్బంది కొరత ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో బ్యూరోపై ఒత్తిడి పెరిగిందని గతంలో పలుమార్లు కుమార్ వ్యాఖ్యానించాడు. కుమార్ నేతృత్వంలో బీసీసీఐ అవినీ తిని నిరోధించడంపై బోధన తరగతులు నిర్వహించింది. పలు కేసుల్లో బీసీసీఐ పరిశోధక బృంధాలకు కుమార్ నేతృత్వం వహించాడు. కుమార్ పదవీకాలం ఈ ఏడాది మే 31న ముగియనుంది.

## 'సుల్తాన్ అజ్లాన్ షా' హాకీ కప్

# తొలి పోరులోనే ఓటమి

### అర్జెంటీనా చేతిలో భారత్ ఓటమి

**ఇపో(మలేసియా):** సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత్ తన ప్రారంభ మ్యాచ్‌లో తడబడింది. ఒలింపిక్ ఛాంపియన్, ప్రపంచ నెం.2 అర్జెంటీనా జట్టు చేతిలో 2-3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో సర్దార్ సింగ్ నేతృత్వంలోని భారత హాకీ జట్టు, అర్జెంటీనాతో తలపడింది. వర్షం పడటంతో మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం కలిగింది. మ్యాచ్‌లో చేసిన గోళ్లన్నీ పెనాల్టి కార్నర్ల ద్వారా వచ్చినవే. ఆట 13వ, 24వ,34వ నిమిషాల్లో అర్జెంటీనా ఆటగాళ్లు గోల్స్ చేయగా, 26వ,31వ నిమిషాల్లో భారత ఆటగాడు అమిత్ రోమజ దాస్ రెండు గోల్స్ చేశాడు. వర్షంతో ఆట దాదాపుగా అర్ధ గంటపాటు నిలిచిపోయింది. తొలి క్వార్టర్ సమయంలో భారత్ ఆటలో ఆధిక్యాన్ని ప్రదర్శించింది. యువ ఆటగాళ్లు అర్జెంటీనా డిఫెండర్లను దాటుకుంటూ వారి గోల్ పోస్ట్‌పై దాడికి పూనుకున్నారు. కొత్తగా జట్టులోకి వచ్చి ఆడుతున్న సుమిత్ కుమార్, మరో ఆటగాడు తల్వీందర్ సింగ్‌లు అర్జెంటీనా అనుభవ గోల్‌కీపర్ జువాన్ వివాల్డిని బోల్తాకొట్టించారు. ఆట పదవ నిమిషంలోనే సుమిత్ కుమార్‌కు గోల్ చేసే అవకాశం వచ్చినప్పటికి అర్జెంటీనా డిఫెండర్లు నిరోధించడంతో ప్రయత్నం విఫలమైంది. అనంతర తల్వీందర్ ప్రయత్నం విఫలమైంది. అర్జెంటీనా ఆటగాడు పెయిల్లట్ తొలి అవకాశాన్ని మిస్ చేసుకున్నప్పటికి, 13వ నిమిషంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తొలి గోల్ చేసి అర్జెంటీనాకు 1-0 ఆధిక్యాన్ని సాధించి పెట్టాడు. భారత ఆటగాడు పెనాల్టి ఏరియాలో చేసిన తప్పు ఫలితంగా అర్జెంటీనాకు మరో కార్నర్ లభించింది. 24 నిమిషంలో తిరిగి పెయిల్లట్ రంగంలోకి వచ్చి రెండో గోల్ చేశాడు. భారత గోల్ కీపర్ క్రిషన్ పాథక్ బంతిని ఆపడానికి డైవ్ చేసినప్పటికి ఫలితం లేకపోయింది. బంతి గోల్‌పోస్ట్‌లోకి వెళ్లింది. మరికొన్ని నిమిషాలకే భారత్ మూడు పెనాల్టీ కార్నర్లు రెండు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో భారత ఆటగాళ్లు విఫలమైనప్పటికి మూడో కార్నర్‌ను భారత ఆటగాళ్లు సద్వినియోగం చేసకున్నారు. 26వ నిమిషంలో రమణ్‌దీప్ సింగ్ బంతిని అందించగా రోహిదాస్ దాన్ని గోల్‌గా మలిచాడు. దీనితో ఆర్జెంటీనా ఆధిక్యాన్ని 1-2కు తగ్గించాడు. 27వ నిమిషంలో అర్జెంటీనా కు మరో పెనాల్టీ కార్నర్ లభించగా..భారత్ అడ్డుకుంది. 31 నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను మళ్లీ రోహిత్‌దాస్ గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 2-2తో సమానమైం ది. 34 నిమిషం లో అర్జెంటీనాకు పెనాల్టీ కార్నర్ లభిం చగా.. పెయిల్లట్ గోల్ చేసి అర్జెంటీనా అధిక్యాన్ని 3-2కు పెంచాడు. మిగిలిన సమయం లో భారత్ ఆటగాళ్లు మళ్లీ గోల్‌కు ప్రయత్నించినప్పటికి విఫలమైంది.




## న్యూజిలాండ్‌పై 4పరుగుల తేడాతో

# ఇంగ్లండ్ గెలుపు

### ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం

**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ఇంగ్లండ్ జట్టు మరో గెలుపును తన ఖాతాలో వేసుకుంది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం ఇక్కడి వెస్ట్‌పాక్ మైదానంలో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 4 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. న్యూజిలాండ్ కెప్టెన్ కానే విలియంసన్ చేసినప్పటికి ఫలితం లేకపోయింది. తొలి వికెట్ పడిన అనంతరం కానే బరిలోకి దిగి 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు ఇంగ్లండ్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. ఇంగ్లండ్ స్పిన్నర్ మొయిన్ అలీ 10 ఓవర్లు బౌలింగ్ చేసి 36 పరుగులకు 3 వికెట్లు తీసి న్యూజిలాండ్ ఓటమిలో కీలక పాత్ర పోషించాడు. కాగా మరో బౌలర్ అదిల్ రషీద్ 34 పరుగులకు 2 వికెట్లు తీశాడు. ఉదయం టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లలో అత్యధిక స్కోరు కెప్టెన్ మోర్గాన్‌దే. మోర్గాన్ 48 పరుగులు చేసి టిమ్ సోథీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఐష్ సోది 53 పరుగులిచ్చి మూడు వికెట్లు చేజిక్కుంచుకున్నాడు. అనంతరం చేజింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే వికెట్లను కోల్పోయింది. 24.2 ఓవర్లలో 103 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కానె, మిట్చెల్ సాంట్‌నర్ జోడీ కుదురుగా బ్యాటింగ్‌చేసి ఇన్నింగ్స్‌ను తీర్చిదిద్దారు మిట్చెల్ 41 పరుగులు చేసి అనుకోకుండా రనౌట్ కావడంతో ఆట ఇంగ్లండ్‌వైపుకు తిరిగింది. చివరి దశలో 23 బంతుల్లో 29 పరుగులు సాధించాల్సి ఉంది. అనంతరం 19 బంతులు 23 పరుగులు ఇలా మ్యాచ్ సాగింది. చివరికి.. క్రీజులో కానె ఉన్నప్పటికి చివరి బ్యాట్స్‌మన్ల నుంచి మద్దతు దొరకక విజయానికి మరో నాలుగు పరుగుల దూరంలో 230 పరుగుల వద్ద న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు మొయిన్ అలీకి ప్రదానం చేశారు.

**స్కోర్లు:** ఇంగ్లండ్ 234 ఆలౌట్(50 ఓవర్లు), న్యూజిలాండ్ బౌలింగ్: (ఐష్ సోది 53/3, బోల్ట్ 47/2,)


న్యూజిలాండ్ బ్యాటింగ్ 230/8(50 ఓవర్లు), ఇంగ్లండ్ బౌలింగ్: (మొయిన్ అలీ 3/36, అదిల్ రషీద్ 2/34, క్రిస్ వోక్స్ 2/40)



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఆంధ్రప్రభ ఆదివారం 4 మార్చి 2018
lifepage2012@gmail.com
లైఫ్
I





'ముక్కుమీద కోపం.. నీ ముఖానికే అందం..నా బుంగమూతి చందం.. నీ ముందరి కాళ్ళ బంధం' మూగమనసులు చిత్రంలో నాగేశ్వరరావును ఆటపట్టిస్తూ జమున నర్తించే పాట ఇది. గడసరి అమ్మాయిలా.. జీవించిన ఆమె నటనకు.. హుషారైన ఈ పాట జీవం పోసింది. ఈ పాటను పాడింది జమునారాణి. ఎల్.ఆర్. ఈశ్వరి రంగంలోకి వచ్చేవరకూ సినీ నేపథ్య రంగంలో ఇలాంటి పాటలకు పెట్టిందిపేరు జమునారాణి. ఏ పాత్రలకి ఎవరి గళం సరిపోతుందో...వారు పాడితేనే పాటకు మరింత అందం వస్తుంది. సుశీలమ్మ గొంతులో తేనెలూరే తీయదనముంటుంది. జానకమ్మ ఎలాంటి పాటలోకయినా పరకాయ ప్రవేశం చేస్తారు. ఇక మత్తుగా.. గమ్మత్తుగా వగరుగా పొగరుగా రాగం తీయాలంటే అది అప్పట్లో ఒకరికే సాధ్యం. ఆవిడే జమునా రాణి. 1943లో చిత్ర రంగంలోకి ప్రవేశించిన జమునారాణి 1975 వరకూ వెనక్కి తిరిగి చూడలేదు. సినీరంగంలో మగవారి ఆధిపత్యం మరింతగా కొనసాగుతున్న తరుణంలో...ఏనాడూ తన స్వాభిమానాన్ని వదులుకుని పనిచేయలేదంటూ ఆమె...తన వ్యక్తిత్వం గురించి చెప్పారు. ఇలాంటి మహిళా మణులే...తరువాత తరాలకు ధైర్యమిచ్చే స్ఫూర్తిగా నిలిచారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం చేరువ అవుతున్న సందర్భంలో...ఆత్మగౌరవం అత్యంత ముఖ్యం అంటున్న అలనాటి గాయని జమునారాణి జ్ఞాపకాలను ఆమె ద్వారా వినటం...సందర్భోచితంగా భావిస్తూ...ఆ విశేషాలు మీకందిస్తున్నాం.

## స్వాభిమానఖని జమునారాణి

# పాటకు పొగరునేర్పిన గళం



భానుమతిగారి వలన నా సినీ రంగ ప్రవేశం జరిగిందనవచ్చు. రామకృష్ణ గారితో భానుమతి గారి వివాహానికి ఆమె తల్లితండ్రులు అంగీకరించలేదు. మా బంధువులు రామానుజరావుగారి సహకారంతో ఆ వివాహం జరిగింది. మద్రాసులోని ఓ దేవాలయంలో జరిగిన వీరి వివాహానికి మా అమ్మ గారే అన్నీ సమకూర్చారు. అలా భానుమతి గారితో సాన్నిహిత్యం ఏర్పడింది. రామకృష్ణగారు చిన్నప్పుడు నేను పాడిన పాటలు విన్నారు. త్యాగయ్యలో పాడటానికి చిన్నపిల్ల కావాలన్నారు. ఆయన చెప్పడంతో నాకు అవకాశం దక్కింది. టంగుటూరి ప్రకాశం గారి మనవరాలు ఆ సినిమాలో డ్యాన్స్ చేసింది. మధురా నగరిలో...అనే పాట అది. దాన్ని నాతో పాడించారు. అలా సినీ రంగంలో ప్రవేశించాను.

### ఎన్నిసార్లు పాడమంటే అన్నిసార్లు...

సినిమాల్లోకి రాకముందు సంగతి...చిన్నప్పుడు ఓ పాటలపోటీలో నా పాటకు ప్రథమ బహుమతి వచ్చింది. అక్కడి నుంచి పాటలపై ఆసక్తి పెరిగింది. చెన్నైలో ఆకాశవాణి కేంద్ర ప్రారంభోత్సవానికి నాతో మూడు పాటలు పాడించారు. అప్పట్లో ఏసీలు లేవు. చెమటలు కారిపోతుండేవి. చొక్కా విప్పి కూర్చోబెట్టి పాడించి, రికార్డు చేయించారు. 1943లో చిత్రరంగంలోకి ప్రవేశించాను. సీతారామజననం, త్యాగయ్య, స్వర్గసీమ చిత్రాల్లో బాలనటులకు పాడేదాన్ని. ఓగిరాల రామచంద్రరావు, టిజి కమలాదేవి, వర్మ... అందరం కూర్చుని పాట నేర్చుకునేవాళ్లం. ఎన్నిసార్లు పాడమంటే అన్నిసార్లు పాడేవాళ్లం. నిర్మాత, దర్శకుడు... ఒక్కొక్కరు వచ్చినప్పుడు పాడాల్సి వచ్చేది. సంగీత దర్శకుడు ఓకే అంటే చాలేది కాదు. అందరూ సమష్టిగా కలిసి నిర్ణయం తీసుకునేవారు.

### సావిత్రి, జమునలకు నా పాటలు నచ్చాయి

చివరకు మిగిలేది చిత్రంలోని 'అందానికి అందము నీవే' పాటంటే నాకు చాలా ఇష్టం. ఈ పాటతో సావిత్రి నన్ను ఇష్టపడ్డారు. ఆమె ప్రశంస నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది. ఆ పాటకు మంచి పేరు కూడా వచ్చింది. అంతవరకూ సావిత్రిగారికి పి.లీల, పి.సుశీల పాడితేనే ఇష్టం. ముక్కు మీద కోపం పాటలో జమున చలాకీగా నటించింది. ఆమెకు కూడా నా పాట అంటే ఇష్టం. ఈరోజుకి కూడా నేను పాడిన ఆ పాటతో తనకు హుషారొచ్చిందంటారు. అందుకే ఉషాపరిణయం సినిమాలో కూడా ఆవిడకు నన్నే పాడమన్నారు. నా గొంతు ఆవిడకు సరిగ్గా సరిపోవడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిన విషయం. దేవదాసు సినిమా సమయానికి నాకింకా అంత పేరు రాలేదు. అప్పటికి గాయని కె. రాణిది అగ్రస్థానం. ఘంటసాల కూడా అప్పుడప్పుడే వస్తున్నారు. అప్పట్లో అందరూ రాణినే ఎంచుకునేవారు. సందర్భానికి తగ్గట్టుగా నటులకు గొంతు కుదిరినప్పుడు గాయకులకు తప్పని సరిగా మంచి పేరు వస్తుంది.

### సాధనతో భావం సాధ్యం..

భావయుక్తంగా పాడడం సాధనతో అలవడుతుంది. తొలి రోజుల్లో కొసరాజు, ఆత్రేయ, ఆదుర్తి సుబ్బారావు, కె. విశ్వనాథ్ పక్కనే ఉండి పాటలో ఏ పదం ఎలా పలకాలీ.. ఎక్కడ ఒత్తి పాడాలి.. ఇలాంటివన్నీ చెప్పేవారు. మూగమనసులు చిత్రంలో పాట గురించి విశ్వనాథ్ గారు వివరించారు. ఆయన ఒక మాటనేవారు. ఆ అమ్మాయి ముద్ర చక్కగా వస్తుందని...దాంతో ఆదుర్తి గారు పాట విషయంలో నాకు తగినంత స్వేచ్ఛనిచ్చేవారు. 'ఎంత చక్కనివాడు...' పాటలో ఎన్నో విషయాలను విశ్వనాథ్ వివరించేవారు. తమిళంలో మహదేవన్, తెలుగులో దక్షిణామూర్తి సంగీత దర్శకత్వంలో పాడటం చాలా సంతోషంగా ఉండేది. మూగమనసుల్లో మావ మావ పాట ఎవరి సలహా లేకుండా పాడాను. ఇలాగే పాడాలని మహదేవన్ చెప్పలేదు.

### ఒకపాటని రెండుసార్లు పాడేవాళ్లం...

అప్పట్లో ఒక విచిత్రం ఉండేది. పాట ఒకసారి పాడితే సరిపోయేది కాదు. సినిమాలకోసారి... రికార్డింగ్ కంపెనీలకు ఒకసారి పాడాల్సి వచ్చేది. అప్పట్లో కేవలం గ్రామ్‌ఫోన్ రికార్డులు మాత్రమే ఉండేవి. సినిమాలతరవాత రికార్డింగ్ కంపెనీకి వెళ్ళేవారం. అందుకే సినిమాలో ఒకలాగా, రికార్డులో ఒకలాగా పాటలుంటాయి. కొలంబియా కంపెనీకి ద్రోహి, దేవదాసు చిత్రాల పాటలు పాడాను. ఆ రోజుల్లో రికార్డుకు రాయల్టీ మూడు రూపాయలు వస్తే, మాకు అర్ధరూపాయి, ఆర్కెస్ట్రా వారికి అర్ధ రూపాయి వచ్చేవి. వారికి కుదిరినప్పుడు డబ్బులు పంపేవారు. పాడినందుకు మాకు ఏమీ ఇచ్చేవారు. నేను ఎవ్వరికీ ప్రయివేట్ పాటలు, భక్తి పాటలు పాడలేదు.

### ఇంతకావాలి...అని అడగలేదు

ఏ పాట పాడినా ఇంత ఇవ్వండి అని అడగలేదు. మేం అడిగినప్పుడు వారు అందుకు అంగీకరించకపోతే మాకు బాధగా ఉంటుంది. నేను మొత్తం ఆరువేల పాటలు పాడాను. అందులో 75 శాతం తమిళం, 25 శాతం తెలుగు, సింహళంలో కూడా పాడాను. కన్నడలో కొన్ని పాటలు పాడాను. సింహళంలో చాలామంది అభిమానులు ఉన్నారు. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు లారీ డ్రైవరు సినిమాలో ఒక్కపాట మాత్రమే తెలుగులో పాడాను. అప్పుడామె వయసు 13ఏళ్ళు.

### ఎల్ ఆర్ ఈశ్వరి కోసం ఎంఎస్ విశ్వనాథన్ ప్రత్యేక ట్యూన్స్

నా సంగీత ప్రస్థానంలో మనసుకి కష్టం కలిగించిన సందర్భాలు అంతగా ఏమీ లేవు.అయితే నేను పాడుతుండగా మరో ఆర్టిస్టును తీసుకువచ్చి... నన్ను తప్పించారు ఎంఎస్ విశ్వనాథన్. మొదట్లో ఆయనకు సుశీల మాత్రమే ఇష్టం. నెమ్మదిగా నేను పాడినట్లే పాడే మరొక అమ్మాయిని తీసుకువచ్చారు. ఆ అమ్మాయే ఎల్ ఆర్ ఈశ్వరి. ఆమెకు తగినట్టుగానే ట్యూన్స్ కట్టేవారాయన. సుశీల గారికి చేయాల్సిన ట్యూన్స్‌ను కూడా ఎల్.ఆర్. ఈశ్వరికి అనుగుణంగా చేసేవారు. జయలలితకు అన్ని పాటలూ ఆమెతోనే పాడించారు. సుశీలకు మంచి మెలొడీలను కట్టాల్సిన విశ్వనాథన్... ఈ అమ్మాయి కోసం హుషారైన పాటలు చేసేవారు. ఆ సమయంలో ఆయన జ్ఞానం ఏమైపోయిందని బాధపడిన వారు చాలామందున్నారు. ఈ కారణంగానే ఎమ్ఎస్ విశ్వనాథన్‌కు అవకాశాలు తగ్గిపోయాయి. ఆయనకు ఒక్క పద్మశ్రీ అవార్డు కూడా దక్కలేదు. ఒకానొక దశలో ఎమ్ఎస్ ధాటికి తట్టుకోలేక కెవి మహదేవన్ తెలుగులోకి తరలిపోయారు. అప్పటికి ఆయన 30 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు.

### ఇళయరాజా నాతో పాడించారు..అదే చివరి పాట

ఇళయరాజా వచ్చిన తరవాత నాయకుడు చిత్రంలో నా చేత పాడించారు. జానకి పుట్టినరోజు సందర్భంగా గుంటూరులో నిర్వహించిన ఓ సభలో పాత గాయకుల్ని మరచిపోయారా అని అడిగినప్పుడు పాత గొంతు అవసరమైనప్పుడు పాడిస్తానని ఇళయరాజా చెప్పారు. చెప్పినట్లే నాయకుడులో అవకాశమిచ్చారు. వాస్తవానికి ఆ పాట నేను జిక్కి పాడాలి. కారణాంతరాల వల్ల... నాతో మరొకరు గొంతు కలిపారు. 15 సంవత్సరాల తరవాత పాడిన ఆ పాటే నా చివరి పాట. అంతకు ముందు 1975లో పాడాను.

### అందుకే పెళ్లి వద్దనిపించింది...

అప్పటికి నా వయసు 32. లీల వివాహం చేసుకుని ఏడాది పాటు అష్టకష్టాలూ పడింది. విడాకులు తీసుకుంది. ఆ కష్టం చూసి, పెళ్ళి అవసరమా అనుకున్నాను. వయసయిపోయాక పెళ్ళెందుకనుకున్నాను. మా అన్నయ్య పిల్లలు నాకు బాగా చేరిక. వారే నా పిల్లలు... వారిని విడిచి ఉండలేకపోయాను. ఇప్పుడు అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. ఇద్దరు ఆడపిల్లలు బెంగళూరులో ఉంటున్నారు. వాళ్ళ దగ్గరే ఉంటున్నాను.
పరిశ్రమలో నా చుట్టూ ఉన్నవారిని ఎందరినో చూశాను. సినీ పరిశ్రమ ఇలాగే ఉంటుందని తెలిసిన ఎ ఎం రాజా తన భార్య జిక్కీని అనుమానించేవాడు. ఎంతో హింసించాడు. ఎవరిని చూసి నవ్వినా సహించేవాడు కాదు. నవ్వకూడదనేవాడు. ఇలాంటివి ఎలా భరించగలం. జిక్కి చాలా అమాయకురాలు. భరించింది. లీల తన కుటుంబం కోసం అంకితం అయిపోయింది. అక్కాచెల్లెళ్లకందరికీ వివాహాలు చేసింది. చివరలో తండ్రి బలవంతం మీద పెళ్లి చేసుకుంది. ఒక సంవత్సరం మాత్రమే కలిసి ఉన్నారు. విడాకులు ఇవ్వడానికి ఇబ్బందిపడింది. అప్పట్లో విడాకులు ఇవ్వడానికే భయపడేవారు.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి
ఫొటో: మూర్తి మల్లాల



## ఆ రోజుల్లో...

★ పాటకు ఎంత సమయం పడుతుంది అనేది ఆర్కెస్ట్రాను బట్టి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వందమంది వాద్యగాళ్లు, కోరస్, మేల్ సింగర్ ఇలా చాలామందుండేవారు. ఆ సమయంలో ఒక్కోసారి పాటకు 20 టేకులు పట్టేసేది. గాయకుల్ని కూర్చోబెట్టి, మళ్లీ చేద్దామనేవారు, అంతేకాని, అతికించి పాడటం... ఒప్పుకునేవారు కాదు. సాకీ కలిపి పాడమనేవారు. ఒక రోజు పాట రిహార్సల్స్.. రెండో రోజు ఆర్కెస్ట్రా రిహార్సల్.. మూడో రోజున రికార్డింగ్.. ఇలా ఉండేది.

★ ఒకరితో పాడించి, మరొకరితో మళ్లీ పాడించుకోవడం అనేది ఆ రోజుల్లో లేదు. నచ్చకపోతే రీటేక్ అనేవారు తప్ప గాయకులను గానీ, పాటను గానీ మార్చేవారు కాదు. జిక్కీ గర్భిణిగా ఉన్న సమయంలో ఆయాసం కారణంగా పాడలేకపోయేది. ఆ సందర్భంలో నావల్ల కావడం లేదని చెప్పి, నన్నడిగేది... నేను పాడేదాన్ని. అది కూడా ముందుగానే నిర్మాతకి చెప్పేవారు.

★ అందరికీ కలిపే భోజనాలు పెట్టేవారు. అందరం మధ్యాహ్నం ఒకే పంక్తిలో కూర్చునేవాళ్లం. నాగయ్య గారు కూడా మాతో పాటు కూర్చుని తినేవారు. ఆయన విడిగా కూర్చేనేవారు కాదు. ఆరోజుల్లో అలా ఉండేది. ఎవరికీ ప్రత్యేకమైన ఏర్పాట్లు లేవు.

★ ఆ రోజుల్లో గాయకులు బాగా ప్రొఫెషనల్‌గా ఉండేవారు. అయితే ఘంటసాల గారు అప్పుడప్పుడు సున్నితంగా ఆట పట్టించేవారు.. వన్నెలు కురిసే చిన్నదిరా... పాటలో.. కంటికి నచ్చిన వన్నెలరాణి ఒంటిగ చిక్కెనురా... అనే వాక్యం ఉంటుంది. దీన్ని కంటికి నచ్చిన జమునారాణి... ఒంటిగ చిక్కెనురా అంటూ నవ్వుతూ చూసేవారు. ఇలా అన్నానని ఏమీ అనుకోవద్దు అనేవారు. గాయకులం పరస్పరం అనుసరించేవాళ్ళం. దీనికి తోడు పాడడంలో మాకు చాలా స్వేచ్ఛను కూడా ఇచ్చేవారు. దీనివల్లే ఈ రోజుకీ ఆ పాటలు నిలబడ్డాయి. లేకపోతే ఈ స్థాయి ఉండేదికాదు.

★ నాకు నటులెవ్వరితోనూ పరిచయం లేదు. హైదరాబాద్ వచ్చాక జమునగారితో సాన్నిహిత్యం ఏర్పడింది.

ఆ రోజుల్లో షూటింగులకు వెళ్ళడం, నటులను కలవడం ఉండేది కాదు. నాకు రాజసులోచనకి పాడాలంటే ఇష్టం. ఆమెకు కూడా నేను పాడితేనే ఇష్టం. ఆమెతో పాటు గిరిజ కూడా తనకు జమునారాణే పాడాలని అడిగేవారు.

★ కులగోత్రాలు చిత్రంలో రావే రావే బాలా పాటను పి.బి.శ్రీనివాస్‌తో కలిసి పాడాను. దీనికి ఎస్ రాజేశ్వరరావు సంగీత దర్శకుడు. ఆయన లోకం ఆయనది. పాట నేర్పిస్తారు. కానీ మనం ఏం పాడుతున్నామో వినరు. తన ధోరణిలో పాడుతూ పోతుంటారు.

★ మా నాన్నగారు షావాలెస్ కంపెనీలో పనిచేసేవారు. మా అమ్మగారే నాకు ఎక్కువ ప్రోత్సాహం ఇచ్చారు.
మా రోజుల్లో సాంబశివరావు అనే సంగీత విద్వాంసులు ఉండేవారు. ఆయన ఆడవారితోనే ప్రత్యేకంగా ఆర్కెస్ట్రా నడిపేవారు. అందులో మా అమ్మ హార్మోనియం వాయించేది.

### గౌరవం ఇవ్వకపోతే...వెళ్లిపోయేదాన్ని!

పాట ఇంతవరకే పాడాలి.. ఇలాగే పాడాలి అని ఎవరైనా చెబితే నాకు అసలు నచ్చేది కాదు. అంతే ఇప్పుడే వస్తానంటూ కోపాన్ని ప్రదర్శించకుండానే ఆ కాగితాలను అక్కడే పెట్టి, బయటకొచ్చేసేదాన్ని. నేను తిరిగి వస్తానని ఎదురుచూసేవారికి చాలాసేపటికి గాని నేను వెళ్లిపోయాననే విషయం అర్థమయ్యేది కాదు. మరీ ఎక్కువ కాకపోయినా అలాంటి సందర్భాలు వేళ్ళపై లెక్కపెట్టదగినన్ని ఉన్నాయి. మాకు కాకుండా, వేరే వాళ్లకు పాట నేర్పుతూ, మమ్మల్ని అక్కడ కూర్చోబెట్టేసినప్పుడు కూడా బాధనిపించేది. అలాగే పాట పాడేందుకు వెళ్ళినప్పుడు చరణాలు తక్కువగా కేటాయిస్తే నచ్చేది కాదు. గౌరవం ఇవ్వనట్లు అనిపించినా, ఇంతవరకు పాడితే చాలు... అన్నట్లుగా ప్రవర్తించినా ఇంత చిన్నపాటకు నేనెందుకు, వేరేవాళ్లు పాడతారని తప్పించుకునే దాన్ని. నా స్వరానికి ప్రాముఖ్యత లేకపోతే నేను పాడనని కుండబద్దలు కొట్టిన సందర్భాలు ఒకటిరెండు ఉన్నాయి. అయితే అవి పెద్ద సంస్థలు కాదు, చిన్న చిన్న సంస్థలు చేసిన పనులివి.

### సునీత, మాళవిక పాటలు ఇష్టం

అప్పటి పాటలు ఇప్పటికీ గుర్తు ఉంటున్నాయి. ఇప్పటివి అలా గుర్తుండవు. ఇప్పుడు అన్నీ ఒకేలాంటి పాటలు, ఒకేలాంటి బీట్ చిత్ర రంగాన్ని ఏలుతున్నాయి. ప్రస్తుత గాయకుల్లో కమిట్‌మెంట్ ఉండటం లేదు. ఇప్పుడు ఓ పాట విని ఇది ఫలానా గాయని పాడిందని చెప్పలేం. కారణం గొంతులో ప్రత్యేకత లేకపోవడం. నా వరకూ సునీత-మాళవికల పాటలంటే ఇష్టం.




# ఈ మొదటి మహిళలు ఎప్పుడు వస్తారో!

మహిళలు అభివృద్ధి చెందుతున్నారా...అనే ప్రశ్న ఎదురైనప్పుడల్లా...మనం కొంతమంది అత్యున్నత స్థానంలో ఉన్న స్త్రీలను చూపిస్తుంటాం. చందాకొచ్చర్, అరుంధతీ భట్టాచార్య, కల్పనా చావ్లా, ఇంద్రానూయీ, సింధు...ఇలా తమ రంగాల్లో విజయాలు సాధించిన స్త్రీలను చూపిస్తాము. అలాగే చాలా రంగాల్లో పెరుగుతున్న మహిళల సంఖ్య సైతం ఈ ప్రశ్నకు సమాధానంగా నిలుస్తోంది. అయితే మహిళలు ముందుకు వెళ్లటం అంటే..పదులు, వందలు, వేలు...ఈ సంఖ్యలు చాలవు. అసంఖ్యాకంగా స్త్రీలు అభివృద్ధి సాధించాలి. అలాగే ఇప్పటికీ కొన్ని పదవులు, అర్హతలు సాధిస్తున్న... మొదటి మహిళలు ఉంటున్నారు. అంటే అంతకుముందు స్త్రీ అక్కడి వరకు వెళ్లనే లేదన్నమాట. కానీ ఇలాంటివి కూడా చూపించి...ఇక స్త్రీ లేనిదెక్కడ...ఆమెకు హద్దులు ఆటంకాలు ముళ్లకంచెలు ఏమున్నాయి...అని మాట్లాడుతుంటారు. కానీ నేటికి కూడా మహిళలు అడుగుపెట్టని, అందుకోలేని హోదాలు ఉన్నాయి. ఇంకా 'మొదటి మహిళ'లు రాని అత్యున్నత స్థానాలు ఉన్నాయి. ఏమున్నాయబ్బా....అనుకుంటున్నారా...అవేఇవి-



♦ ఇండియన్ ఆర్మీ చీఫ్......ఇప్పటివరకు 29మంది జనరల్స్ ఉంటే అంతామగవారే. 1992లో మహిళలకు ఆర్మీలో ప్రవేశం దక్కింది. ఇండియన్ ఆర్మీలో 4శాతం మాత్రమే మహిళలు ఉన్నారు.


♦ ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్ (ఇస్రో)...దీనికి ఇంతవరకు ఏ మహిళా ఛైర్మన్ కాలేదు. ఇస్రోలో మొత్తం సిబ్బందిలో 20శాతం మంది మహిళలు ఉన్నారని క్వార్ట్జ్ రిపోర్టు చెబుతోంది.

♦ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్‌లకు డైరక్టర్లుగా మహిళలు లేరు.

♦ ఛైర్మన్ ఆఫ్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హోదాకి ఏ స్త్రీ చేరలేదు.

♦ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ పదవిలో మగవారే కొనసాగుతున్నారు.

♦ సిబిఐ, ఐబి (ఇంటెలిజెన్స్ బ్యూరో), రీసెర్చి అండ్ ఎనాలసిస్ వింగ్...లకు హెడ్‌లుగా మహిళలు లేరు.





♦ కేబినెట్ సెక్రటరీ హోదా కూడా స్త్రీలకు దక్కలేదు.

♦ నిర్మలా సీతారామన్ మొదటి మహిళా రక్షణ మంత్రిగా రికార్డు నెలకొల్పారు కానీ...ఆర్థికమంత్రి, కార్మిక మంత్రి పదవులు ఏమహిళకూ దక్కలేదు.

♦ దేశంలోని 12 రాష్ట్రాల్లో 15మంది మహిళలు మాత్రమే ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు. అంటే 60శాతం రాష్ట్రాలు ఎప్పుడూ మహిళా ముఖ్యమంత్రిని చూడలేదు. వాటిలో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర లాంటివి ఉన్నాయి. అందుకే మహిళలు అడుగుపెట్టని రంగముందా...అనే ప్రశ్న వేసుకుంటే...లేనేలేదని గర్వంగా చెబుతూనే...మరోవైపు వారు అందుకోలేని అర్హతలు హోదాలు పదవులు ఇంకా చాలా ఉన్నాయని మరో సమాధానం కూడా చెప్పాల్సిందే.

# బాధ మనలోనే పుడుతుంది

**మీరు మీ మనస్సుకు సాక్షీ భూతంగా ఉన్నట్టయితే, మీ మనసు చర్యకు అతీతంగా ఉంటే మీకు అసలు బాధ అన్నదే ఉండదు. కానీ మీ విషయంలో అలా కాదు. మీకు కడుపు నిండకపోతే ఒకటే సమస్య - ఆహారం. కడుపు నిండితే వంద సమస్యలు. ఎందుకంటే మీ బాధ బాహ్యం నుంచి వస్తున్నది కాదు ఇది అంతర్గతమైనది. అవి ఎడతెరిపి లేకుండా తయారుచేయబడుతూనే ఉంటాయి.**



బాధ అనేది ఎక్కడో కాదు మనలోనే పుడుతుంది. మనస్సుతోను, మీరు కాని వాటితో మీరు మమేకమవడం వల్లనే బాధ అనేది కలుగుతుందని, ఒక్క సారి మీరు మనస్సుని అధిగమిస్తే బాధ అనేద ఉండదని సద్గురు చెబుతున్నారు.

మీరు బుద్ధుడి గురించి విన్నారా? నేను బుద్ధా అని అనగానే మీరు గౌతమ బుద్ధుడు అనుకుంటారు. గౌతముడు అన్నది ఆయన పేరు మాత్రమే! ఆయన బుద్ధుడిగా మారారు. కొన్ని వేల మంది బుద్ధులు ఉన్నారు. 'బు' అంటే బుద్ధి, వివేకం. 'ద్ధా' అంటే అతీతం. ఎవరైతే తన బుద్ధికి అతీతంగా ఉన్నారో వారే బుద్ధా. ఎవరైతే బుద్ధిలో ఉన్నారో, వారు ఎడతెరిపి లేని బాధలో ఉంటారు. ఇప్పుడు మీరు అక్కడే ఉన్నారు. మీరు మీ బుద్ధిలో ఉన్నప్పుడు ఇది తప్పనిసరి అవుతుంది. మీరు కనుక బుద్ధిని అధిగమిస్తే మీరు దాని నుంచి విముక్తిని పొందుతారు. మీరు బుద్ధి కంటె కింద ఉన్నట్టయితే కూడా మీకు బాధ తెలియదు. మానవులకు తెలిసే బాధ పశువులకు తెలియదు కదా. వాటికి కడుపు నిండితే చాలు, అవి హాయిగా ఉంటాయి. మీరు ఇది పశువుల్లో గమనించారా. వాటి కడుపు నిండితే చాలు వాటికి హాయిగానే ఉంటుంది. మీరు మీ మనస్సుకు సాక్షీభూతంగా ఉన్నట్టయితే, మీ మనసు చర్యకు అతీతంగా ఉంటే మీకు అసలు బాధ అన్నదే ఉండదు.



కానీ మీ విషయంలో అలా కాదు. మీకు కడుపు నిండకపోతే ఒకటే సమస్య - ఆహారం. కడుపు నిండితే వంద సమస్యలు. ఎందుకంటే మీ బాధ బాహ్యం నుంచి వస్తున్నది కాదు ఇది అంతర్గతమైనది. అవి ఎడతెరిపి లేకుండా తయారుచేయబడుతూనే ఉంటాయి. మీరు ఒక బాధను పరిష్కరిస్తే మరో పది బాధలు క్యూలో నిలుచుని ఉంటాయి. మీరు మీ మనస్సుకి సాక్షీభూతంగా ఉన్నట్లయితే, మీరు మీ మనస్సు చర్యకు అతీతంగా ఉన్నట్టయితే మీకు అసలు బాధ అన్నదే ఉండదు. ఎందుకంటే బాధ అంతా కూడా మనస్సులో ఉన్నదే. ఒక సారి మీరు దాని నుంచి వెలుపలికి వచ్చేసిన తరువాత ఇంకా బాధ ఎక్కడ ఉంటుంది? ఏ మనస్సయితే ఆనందాన్ని సృష్టించగలదో పారవశ్యాన్ని సృష్టించగలదో అది ఇప్పుడు మీకు బాధలను కలిగిస్తోంది. అంటే తెలిసో తెలియకో మీకు మీరే బాధలను కలిగించుకుంటున్నారు. ఎవరికి వారే బాధను కలిగించుకుంటుంటే వారు కచ్చితంగా సరైన స్థితిలో ఉన్నట్టు కాదు. మీరు 'లేదు...లేదు... నా జీవితంలో ఏమి

## సద్గురుబోధ

జరిగిందో మీకు తెలియదు అంటారు. మీ జీవితంలో ఏమి జరిగినా సరే మీ బాధ అన్నది మీ జీవితంలోనే ఏదో జరగడం వల్ల రావడం లేదు. మీ బాధ అన్నది మీ మనస్సు చేస్తున్న దానిని మీరు నియంత్రించలేకపోతున్నారు కాబట్టి వస్తోంది. అది దాని చెత్త అది చేసుకుంటోంది. అందుకే మీరు బాధగా ఉన్నారు కదూ..? ఇది ఇలా ఎందుకు జరిగిందంటే మీరు ఏదైతే కాదో అటువంటి ఎన్నో విషయాలతో మీరు మమేకమయ్యారు. ఒకసారి మీరు కాని విషయాలతో మిమ్మల్ని మీరు గుర్తించుకున్న తర్వాత మీ మనస్సు మరో విధంగా పని చేయలేదు.

**- సద్గురు జగ్గీవాసుదేవ్**


# పరశురాముని ఆగమనం

## సంక్షిప్త రామాయణం

మరుసటి రోజు విశ్వామిత్రుడు అందరినీ వీడ్కొని, హిమవంతానికి వెళ్ళాడు. దశరథుడు జనకుని వీడ్కొని అయోధ్యకు పయనం అయ్యాడు. జనకుడు కొంతదూరం వారిని అనుసరించాడు. జనకుడు నలుగురు పెళ్ళి కూతుళ్లకు లక్షలకొలది గోవులను, రత్న కంబళాలు, పట్టు వస్త్రాలు, ఏనుగులు, గుర్రాలు, వెండి, బంగారం, రత్నాలు, ముత్యాలు. పగడాలు కన్యాధనంగా ఇచ్చాడు. దశరథుని అనుమతి పొంది జనకుడు మిథిలకు బయలు దేరాడు.

దశరథుడు సమస్త పరివార సమేతుడై ప్రయాణం సాగిస్తున్నాడు. హఠాత్తుగా భయంకరంగా పక్షుల రావాలు వినిపించాయి. మృగాలు ప్రదక్షిణపూర్వకంగా తిరిగాయి. శుభ అశుభ శకునాలు చూసి వీటి అంతరార్థం ఏమి? అని దశరథుడు వసిష్ఠుని అడిగాడు. ఏదో ప్రమాదం రాబోతున్నదని. దాని నుంచి సురక్షితంగా బయటపడగలమని ఈ శకునాలు సూచిస్తున్నాయి అని వసిష్ఠుడు తెలుపుతూ ఉండగానే సుడిగాలి వీచింది. దుమ్ము కమ్ముకుంది. చీకటి విస్తరించింది. వసిష్ఠుడు, దశరథుడు, రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తప్ప తక్కిన వారందరూ నిశ్చేష్టులయ్యారు.

క్షత్రియ భయంకరుడు, పరమ క్రోధరూపుడు పరశురాముడు ప్రత్యక్షమయ్యాడు. ప్రళయకాల రూపుడైన పరశురాముణ్ని చూడగానే దశరథుని గుండె జల్లనింది. తన కొడుకులను రక్షించుకోవాలనే తపనతో, పసివాడిని రక్షింపుమని ప్రాధేయపడ్డాడు. పరశురాముడు దశరథుని ప్రార్థన లెక్క చేయలేదు. దశరథ రామా! నీవు శివ ధనుర్భంగం చేసినప్పుడు పుట్టిన మహాధ్వని ముల్లోకాలలో ప్రతిధ్వనించింది. నీ అత్యద్భుత పరాక్రమం ముల్లోకాలకు తెలిసింది. ఇదిగో ఇది విష్ణు ధనుస్సు. నీవు విరిచిన శివ ధనుస్సు, ఈ విష్ణు ధనుస్సు రెండూ అమేయ శక్తి సంపన్నములైనవే. విశ్వకర్మ నిర్మితములే. త్రిపురాసుర సంహార సమయంలో ఒక దానిని శివునికి, మరొక దానిని విష్ణువుకు దేవతలు సమర్పించారు దేవతలు. విష్ణు పరమేశ్వరులు బలాధిక్యతను



తెలుపుకొనతలచి ఇరువురిలో మహాబలపరాక్రమవంతుడు ఎవరు? అని బ్రహ్మను అడిగారు. బ్రహ్మ దేవతల సందేహాన్ని తీర్చదలచి, వారికి పరస్పర విరోధ భావం కల్పించాడు. ఇద్దరు పరస్పర జయాభిలాషతో ఘోరాతి ఘోరంగా పోరాడారు. అప్పుడు విష్ణువు హుంకార ధ్వనికి శివ ధనుస్సు బలాన్ని కోల్పోయింది. విష్ణువే అధికుడని దేవతలకు తేటతెల్లం అయింది. శివుడు రోషగ్రస్తుడై ధనుస్సును దేవతలకే వదలివేశాడు. వారు ఆ ధనుస్సును విదేహ రాజు దేవరాతునికి యజ్ఞఫలంగా ఇచ్చారు.

ఆ తర్వాత విష్ణువు ధనుస్సు భృగు వంశీయుడైన ఋచీకుని వద్దకు చేరింది. దానిని ఋచీకుడు తన కొడుకైన జమదగ్నికి ఇచ్చాడు. నా తండ్రి జమదగ్ని నాకు ఇచ్చాడు. నీవు శివ ధనుర్భంగం చేశావు అని తెలిసి వచ్చాను. ఈ ధనుస్సును ఎక్కుపెట్టి నీ బల పరాక్రమాల పస ఏ పాటిదో చూపుము. నీవు శక్తిమంతుడవయితే ఈ బాణాన్ని సంధించు అన్నాడు పరశురాముడు. రాముడు పరశురాముని పరాక్రమాన్ని ప్రశంసించాడు. ప్రతీకారేచ్ఛతో ఆయన చేసిన సంహార కాండను కూడా అభినందించాడు. కాని తన్ను శక్తి హీనుడిగా భావించడాన్ని సహింపలేకపోయాడు. 'మహాత్మా! నన్ను బలహీనునిగా భావించి అవమానిస్తున్నావు. దీన్ని నేను సహించలేను' అంటూ రాముడు పరశురాముని నుంచి ధనుర్బాణాలు స్వీకరించాడు. బాణాన్ని సంధించాడు. 'పరశురామా నీవు బ్రాహ్మణుడవు. విశ్వామిత్రుని సోదరి సత్యవతి మనుమడివి. అందువల్లనీ ప్రాణం తీయలేక పోతున్నాను. నీ పాదగతినిని నాశనం చేయమంటావా లేక తపో బలంతో నీవు సాధించిన పుణ్యరాశిని నాశనం చేయమంటావా? నేను సంధించిన బాణం వ్యర్థం కాదు' అన్నాడు రాముడు. పరశురాముడు వైష్ణవ తేజాన్ని కోల్పోయి శక్తిహీనుడయ్యాడు. 'పాదగతిని నాశనం చేయవద్దు. నా పుణ్య రాశిని నశింపతేజయి' అన్నాడు. సాక్షాత్తు నీవు విష్ణురూపుడివే అని స్తుతించి పరశురాముడు మహేంద్రగిరికి వెళ్లాడు. రాముడు ఆ ధనుర్బాణాలు వరుణునికి అప్పగించాడు. దశరథుడు నూతన వధూవరులతో అయోధ్య చేరాడు. అయోధ్య ప్రజలు స్వాగతం పలికారు. పుణ్య స్త్రీలు పుష్పాక్షతలను, పేలాలను చల్లి, చల్లని మనసులతో చల్లగా వర్థిల్లుమని నూతన వధూవరులను దీవించారు. కొంతకాలం తర్వాత భరతుడు తండ్రి అనుమతిని పొంది శత్రుఘ్నునితో తాతగారి ఇంటికి వెళ్లాడు. సీతారాములు అత్యంత ప్రేమాస్పదులై, అన్యోన్య దంపతులై సుఖ జీవనం సాగించారు.

**- కె ఓబులేశు**
**9052847742**



## భగవద్గీత

# అనన్య భక్తునికి నేను సులభ లభ్యుడను

**అధ్యాయం 8, శ్లోకం 14**

**అనన్యచేతాః సతతం**
**యో మాం స్మరతి నిత్యశః।**
**తస్యాహం సులభః పార్థ**
**నిత్యయుక్తస్య యోగినః॥**

**తాత్పర్యం**

ఓ పార్థా! అనన్యచిత్తముతో నన్ను స్మరించేవానికి అతని నిరంతర భక్తియుతసేవ కారణంగా నేను సులభంగా లభ్యుడనై ఉన్నాను.

**భాష్యం**

ఈ శ్లోకంలో భక్తి యోగము ద్వారా భగవంతుణ్ని సేవించే శుద్ధ భక్తుల గమ్యం ప్రత్యేకంగా వివరించబడినది. ఇంతకు ముందు శ్లోకాలలో వేర్వేరు భక్తులు, వేర్వేరు ముక్తిమార్గాలైన కర్మయోగము, జ్ఞానయోగము, హఠయోగము వివరింపబడినవి. ఇటువంటి యోగాపద్ధతులలో కొంత భక్తి జతపరచబడినది అయితే ఈ శ్లోకంలో కర్మ, జ్ఞాన, యోగ మిశ్రితము కాని శుద్ధ భక్తి - యోగము ప్రస్తావించబడినది. ఒక శుద్ధ భక్తుడు, నిష్కామి. ఆయన స్వర్గలోకాలు గాని, బ్రహ్మజ్యోతిలో లీనమగుటను గాని, భౌతిక బంధన విముక్తి గానీ కోరుకోడు. నిస్వార్థంగా, శాంతంతో భగవంతుని ప్రసన్నతను తప్ప మరేదానినీ కోరడు. కాబట్టి అటువంటి భక్తునికి తాను సులభముగా సాధ్యమగుదునని తెలియజేయుచున్నాడు. భక్తి యోగము హరే కృష్ణమంత్ర ఉచ్చారణతో ఎంతో సులభముగా మొదలుపెట్టవచ్చును. భగవంతుడు అందరి పట్ల కరుణతో ఉండును. ప్రత్యేకించి తన భక్తులకు తనను చేరుకునే తెలివితేటలను ప్రసాదిస్తాడు. ఈ విధంగా భగవంతుణ్ని 'సతతమూ' 'నిత్యమూ' స్మరించు భక్తుడ్ని, భగవంతుడు క్షణం కూడా మరచి ఉండడు. 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే ' అను మంత్రం ఉచ్చరించు వారికి ఇదే భగవంతుడు ఇచ్చు ప్రత్యేక వరము.

....పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఎ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారి 'భగవద్గీత యథాతథం' నుంచి ఇస్కాన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో .....

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



# చింతన

## శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

### పూల పూజ



(గత సంచిక తరువాయి భాగం)

**30-6-47**

'అవునవును విరబూసి ఉంటే ఏమి బాగుంటవని మొండాలు చేసేస్తున్నావన్న మాట. ఆ అందం అంతా మనం చూచాంగా ఇంకొకరెందుకు చూడాలని. అయినా, ఆ మొక్కలు నీవే పెట్టి నీళ్ళు పోసి పెంచావాయె. అంతమాత్రం హక్కు లేదా ఏమి? మరెవ్వరూ ఆ అందం చూడకుండా మొండాలు చేసివెయ్యి, అప్పుడు గాని పూజలకు ఫలం ఉండదులే' అన్నారట భగవాన్.

### అభిషేకం

**3-7-47**

చాలా కాలం నుంచి వస్తూ పోతూ ఉండే భక్తులొకరు నిన్ననేదో గిరి నివాసం గురించి ప్రసంగవశంగా భగవానునితో ఇలా అన్నారు. 'కొండమీద ఉండగా ఎవరో టెంకాయ నీటితో భగవానుకు అభిషేకం చేసారటగా?'. దానికి భగవాన్ నవ్వుతూ, 'అవునవును విరూపాక్ష గుహలో ఉండగా ఉత్తరాది నుంచి కొందరు ఆడంగులు వచ్చారు. నేనక్కడి చింత చెట్టు కింది తిన్నె మీద చూచీ చూడనట్లు కళ్ళు మూసుకుని కూర్చున్నాను. కాస్సేపుండి వారే పోతారనుకున్నాను. ఉన్నట్టుండి టప్పున శబ్దమయింది. కళ్ళు తెరచి చూతును కదా నెత్తిన టెంకాయ నీళ్ళ అభిషేకం. అందులోను, ఒక తల్లి చేసింది ఆ అభిషేకం. ఏంచేసేదీ మౌన స్వామిని కదా! మాట్లాడనాయె. తుడుచుకునేందుకు ఈ తండుగుడ్డయినా లేదప్పుడు. ఆ నీళ్లు అలాగే ఆరిపోయినవి. అదొక్కటేనా. కర్పూరం వెలగించటాలూ, కాళ్ళ మీద నీళ్లు పోసి ఆ నీరు తమ తలమీద ప్రోక్షించుకోటాలూ తీర్థాలూ, ప్రసాదాలు, ఎన్నో ఉపద్రవాలు. ఒక్కొక్కటీ వారించేసరికి గగనమయ్యేది' అన్నారు.

దీనికి తార్కాణంగా నాలుగైదేండ్ల క్రితం కొన్ని సంభవాలు నేనే చూచాను. భగవాన్ స్నానం చేసే గదికి ఆఫీసువైపుగా ఒక తూమున్నది. దాని కింద కుండుకట్టు వాలుగా కాలువ కట్టారు. నిత్యం ఉదయాన స్నానం చేసే వేళకు కొందరు భక్తులు ఆ తూము వద్ద చేరి వారు స్నానం చేసే నీళ్ళు శిరసున చల్లుకుని కళ్ళకద్దుకుని ఆచమించి వెళ్ళేవారు. గుట్టు చప్పుడు కాకుండా జరిగినంత కాలం ఏదో సరిపోయింది. రాను రాను వంతులు పడి చెంబులూ, బకెట్లూ పట్టుకురావడం ఆరంభించారు. ఈ హడావిడిలో గడబడ శబ్దం బయలుదేరి భగవాన్ చెవిసోకింది. విషయం విచారించి తెలుసుకున్నారు. ఊరుకుంటారా? సేవకులనుద్దేశించి 'ఓహో అదా! సందడి విని ఏదో అనుకున్నాను. బానే ఉంది ఇది మానేట్టు చేస్తారా? లేకపోతే బయటనున్న కుళాయి వద్ద స్నానం చేయనా? అలా చేస్తే నా నిమిత్తం నీళ్లు కాచవలసిన పని మీకుండదు. ఆ తీర్థానికై కాపలా కాయవలసిన కష్టం వారికీ ఉండదు. నాకేం కావాలా. ఈ తుండుగుడ్డ, ఈ కౌపీనం రెండే కదా? ఆ కుళాయి వద్ద పిండుకుని స్నానం చేస్తే తీరిపోతుంది. కుళాయి కాకుంటే కొండ కాలువలున్నవి. కోనేళ్లున్నవి. ఎందుకీ ఉపద్రవం. ఏమయ్యా, ఏమంటారు అని భగవాన్ గద్దించారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

**- సూరినాగమ్మ**

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

## దినఫలాలు

**మేష రాశి:** ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

**వృషభరాశి:** ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యం లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలుంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

**మిథున రాశి:** సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక విషయాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయ ప్రయత్నాలు కలసి వస్తాయి.

**కర్కాటక రాశి:** శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు. ఖర్చులు అధికమవుతాయి.

**సింహ రాశి:** గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్య అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేక పోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులను అధిగమించగలుగుతారు.

**కన్య రాశి:** తెలివైన నిర్ణయాల ద్వారా విజయాలు చేకూరుతాయి. గృహరీత్యా ఆహ్లాద పరిస్థితులు ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చికాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

**తుల రాశి:** విదేశీ లావాదేవీలు, సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్యరీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర వల్ల కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయం నుంచి లాభాలు కూడగట్టుకునే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చిక రాశి:** ఆరోగ్య పరీక్షలు మేలు కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపారంలో ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

**ధను రాశి:** ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి పొందుతారు. వ్యాపార ప్రతిబంధకాలు ఎదుర్కొగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకునే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు వస్తాయి.

**మకర రాశి:** సంభాషణల విషయంలో జాగ్రత్తలు అవసరం. కోర్టు వ్యవహారాల్లో, ప్రయాణల్లో కూడా జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. గట్టి ప్రయత్నాలతో ఆదాయం సాధ్యం

**కుంభ రాశి:** నూతనోత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభ వార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులుంటాయి.

**మీన రాశి:** రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం. ఆరోగ్య సమస్యల నుంచి ఉప శమనం. ఆరోగ్యరీత్య శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



# సంస్కృతి



# రోమన్ సంస్కృతిపై గ్రీకు ప్రభావం...

ప్రాచీన రోమన్ సంస్కృతి పై గ్రీక్ సంస్కృతి తీవ్ర ప్రభావాన్ని చూపించింది. నాల్గవ శతబ్దం నాటికి గ్రీక్ దేవత అపోలోను రోమన్‌లు పూజించడం ప్రారంభించారు. ఇది 'సోల్' ఇంవిక్టాస్' విశ్వాసలకు సమూహాలో మిలితం అయ్యింది. చక్రవర్తిని, సామ్రాజ్యాన్ని 'సోల్' రక్షిస్తాడనే విశ్వాసం ప్రభాలింది. ఈ విశ్వాసాన్ని క్రైస్తవ మతం ఖండిస్తూ దాన్ని సమూలంగా తుడిచివేసేంత వరకు ఆవిశ్వాసం రాచరికమతం వలె వర్థిల్లింది.

పురాతన రోమన్‌లో అసంఖ్యాక గ్రీక్ దేవలు చేరిపోవడంతో ఒక నూతన రోమన్ పురాతన శాస్త్రం జన్మించింది. రోమన్లు తమ స్వతమైన పురాణాలు చాలా స్వల్పంగా ఉన్న కారణంగా తమ సంస్కృతిలో గ్రీక్ సంస్కృతిలోని గ్రీకు పౌరాణిక సంప్రదాయాన్ని రోమన్లు వారసత్వంగా తీసుకు న్నారు. అంతే కాకుండా గ్రీకు, రోమన్ పౌరాణి సంప్రదాయాల జతకి అదనంగా తూర్పు మతాలతో రోమన్లు సంధి మరిన్ని కలయికలకు దారి తీసింది. సిరియాలో 'అరిలియన్' ప్రచారాలు ఎక్కువైన తరువాత సూర్యుడి యొక్క మతం రోమ్‌లో



ప్రవేశపెట్టబడింది. ఆసియా దేవతలైన మిత్రాస్ (సూర్యుడు), బాల్ రెండూ కూడా సామూహిత ఉత్సవాలద్వారా అపోలో, హెలియోస్‌లతో ఒకటిగా కలిసిపోయారు. అపోలో హెలియోస్ మతంలో ప్రముఖస్థానం ఉంది.

పురాణాలను చెప్పే క్రమంలో చేసే రచనలలోతరచుగా అలాంటివి ప్రతిబింబిస్తాయి. సంప్రదాయక పురాణశాస్త్రం వాస్తవాలనుండి విడదియ్యబడింది.

2వ. శతాబ్దపు ఓర్ఫిక్ స్తుతిగీతాల సేకరణ, మక్రోబియాస్ యొక్క సతర్నలియా వంటి భావనల సిద్ధాంతాలు అలాగే విశితమవుతున్న పోకడల ద్వారా ప్రభావితమయ్యాయి. ఓర్ఫిక్ గీతాలు ఓర్ఫియాస్‌కి ఆ పాదించబడిన క్లాసికల్ యుగానికి ముందు స్వరపరచబడిన కవిత్వపు జతలు చరిత్ర ముందు కాలపు యూరోపియన్ పురాణ శాస్త్రం గురించి అనేక మార్గదర్శకాలను కలిగి ఉంది. 'యాక్రోబియాస్' తన అధ్యయనం ద్వారా హెల్లెనిక్ సంస్కృతిని జనానికి చేరువైనట్లు తెలుపుతాడు. అయితే అతని యొక్క దేవుళ్ళ గురించి ఈ జిప్షియన్ మరియు ఉత్తర ఆఫ్రికన్ పురాణశాస్త్రం థియోలజీ లచే ప్రభావితం అయ్యిందనీ నిర్వచిస్తాడు.

గ్రీకు పురాణాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి అనేక మంది పరిశోధకులు త్రీవంగా కృషిచేశారు. 18 వ శతాబ్దం చివరలో క్రైస్తవులతో శత్రుత్వం ఏర్పడింది. దీనివల్ల సంప్రదాయక ఆలోచనా ధోరణికి వ్యతిరేకంగా ఒక ద్వంద్వ విధానం సూచించబడింది. అయితే క్రైస్తవులు పురాణాన్ని ఒక అబద్ధంగా, ఒక కల్పనగా ఉహించడం అనే భావనలో ఎలాంటి మార్పురాలేదు. జర్మనిలో 1795 నాటికి గ్రీకు పురాణ శాస్త్రం పట్ల ఆసక్తి పెరుగుతూ వచ్చింది. గిట్టిన్గెన్లో జోహాన్న్ మాట్టియాస్ గేస్నార్గ్రీక్ పరిశోధనలను మళ్ళీ పరిశీలించడం ప్రారంభించారు. అయితే అతని వారసుడు క్రిస్టియన్ గోట్టోబ్‌హెయ్నె, జోహన్న్ జోచిం విన్కేత్మాన్తో పనియేడం ప్రారంభించాడు. అలాగే జర్మనీలో పౌరాణిక పరిశోధనకు పునాదులూ వేశాడు. కంపెరితిన్ మితాలజి'ని కొందరు స్థాపించారు. వారిలో మాక్స్‌ముల్లర్ ఒకరు.

అతని యొక్క కంపెరటివ్ మితాలజీలో (1867) ముల్లర్ పూర్వపు యూరోపియన్లు మరియు సావేజ్ జాతుల పురాణశాస్త్రల మధ్య పంపిణి సారుప్యతను విశ్లేషిచాడు. 19వ శాతాబ్దలో భాషా అధ్యయన శాస్త్రం యొక్క అభివృద్ధి 20 వ శతాబ్దంలో మానవ సంస్కృతుల విశ్లేషణా శాస్త్రంతో కలిసి విజ్ఞాన శాస్త్రం స్థాపించబడింది. రొమంటెక్స్ నుండి పురాణం మొత్తం అధ్యయనం అంతాపోల్చి చేసినదే. విల్హెం మన్హార్డట్, సర్‌జేమ్స్ ఫ్రాజైరో, స్టిమ్‌తో మ్సున్ జానపద కథలు మరియు పురాణాశాస్త్రం యొక్క నేపథ్యాలను సేకరించటానికి, వర్గీకరించటానికి పోలిక్ విధానాన్ని అవలంబించారు. 1871లో ఎడ్వర్డ్ బర్నెట్‌టెలర్ తన ప్రీమిటివ్ కల్చర్‌ను ప్రచురించాడు. అందులో ఆటను పోలిక విధానంలో ఉపయోగించాడు. అలాగే మతం యొక్క పుట్టుక, పరిణాయక్రమాలను వివరించటానికి ప్రయత్నించాడు. పదార్థ సంస్కృతి, మత పరమైన వేడుక విస్తరించబడిన సంస్కృతులను ఒక చోటకు చేర్చడం టెలర్ విధానం. ఈ విధానం కార్ల్‌జంగ్, జోసెఫ్‌ల్‌లను ప్రభావితం చేసింది. మాక్స్‌ముల్లర్ యొక్క విజ్ఞాన శాస్త్రాన్ని పురాణ అధ్యయనానికి ఉపయోగించాడు. అందులో ఆర్యన్ స్వభావ ప్రార్థన యొక్క అవశేపాలలను కనుగొన్నాడు. బ్రోనిస్లామలినోస్కి సాధారణ సాంఘిక చర్యలను పూర్తి చేసే మర్గాలను సూచించాడు.క్లాడ్‌లేవి - స్ట్రాస్, ఇతర పరిశోధకులు ప్రపంచం మొత్తం ఉన్నా అధికారిక సంబంధాలు, పురాణాలలోని నమూనాలతో పోల్చి చూశారు. సిగ్మండ్ ఫ్రూడ్ మానవుని యొక్క చారిత్రిక పరిధులు దాటి జీవ పరమైన విధానాన్ని, అణిచివేయబడిన ఆలోచనలను వ్యక్తపరిచే విధంగా పురాణ కోణాల్ని ప్రవేశపెట్టాడు. కలను అంచనా ఎయ్యడం అనేది ఫ్రూడియన్ పురాణాన్ని అంచనా వెయ్యటానికి ఆధారం. ఒక కలలోనైనా ఏ వ్యక్తి గత అంశాన్నీ అంచనావెయ్యటానికి అందులోని ఇమిడివున్న సంబంధాల యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తుంది. ఈ సలహా విశ్లేషణ కారుడు ఫ్రూడ్ యొక్క ఆలోచనలలోని మనస్తత్వ విశ్లేషణా విధానాల మధ్య సంబంధాలను పురుద్దారించే ఒక ముఖ్యమైన విషయాన్ని కనుగొంటుంది. కార్ల్‌జంగ్ పరిధి దాటి ఉన్న చారిత్రకు, మానసిక విధానాన్ని అతని యొక్క 'కలక్టివ్ అన్కాన్నియస్' సిద్ధాంతంతో విస్తరించాడు. జంగ్ చెప్పిన ప్రకారం '' పురాణాన్ని తయారు చేసే నిర్మాణ విషయాలు చైతన్యంలేని మానసిక స్థితిలో ఉండాలి' జంగ్ యొక్క విధానాన్ని జోసెఫ్ కాంప్బెల్ సిద్ధాంతంతో పోల్చి చూడటం ద్వారా రాబర్ట్‌సెగల్ ఇలా అంటాడు. '' ఒక పురాణాన్ని అంచనా వేయడానికి కాంప్బెల్ సాధారణంగా అందులో ఉన్న ఆర్కే రకలను గుర్తిస్తాడు.'' గ్రీకు పురాణ శాస్త్రంలో ఆధునిక అధ్యనాల స్థాపకుడుల్లో ఒకడైన కౌకార్ల్‌కేరిన్యి గ్రీకు పురాణాలని ఆర్కియో రకాల జంగ్ సింద్ధాంతాలను అమలు చేయ్యటానికి పురాణం గురించిన తన పూర్వ ప్రభావాలను వదిలిపెట్టాడు.గ్రీకు పురాణ శాస్త్రం పుట్టుక గురించి అనేక ఆధునిక సిద్ధాంతాలు ఉద్భవించాయి. అన్ని పౌరాణిక ఇతిహాసాలూ పవిత్ర గ్రంథాల నుండి తీసుకోబడ్డాయి. అయితే ఈ వాస్తవాలు మాత్రం దాచివేయబడ్డాయి. చిరిత్రిక సిద్ధాంతం ప్రకారం పురాణ శాస్త్రంలో సూచించబడిన వ్యక్తులు అందరూ కూడా ఒకప్పుడు నిజమైన మానవులే. మరొక వైపు పురాణతత్వశాస్త్రం మరియు పురాణాల విని యోగం వంటిది. ఆసియామైనర్, తూర్పు ప్రాతంల నాగరికతల వలన గ్రీకులు స్ఫూర్తి పొందారని బహిర్గతం చేశాయి. అడోనిస్ గ్రీక్‌తో సారూప్యత కలిగి ఉండేది. ఇది పురాణంలో కంటే మత విశ్వసాలలో స్పష్టంగాఉండేది. 'సిబేలే' తన మూలాలు అనటోలియన్ సంస్కృతిలో కలిగి ఉండగా, అఫ్రోడైట్ యొక్క చిత్ర సమాహారంలో చాలా భాగం సెమిటిక్ దేవతల నుంచి వస్తుంది. ''సంప్రదాయక గ్రీక్ పురాణాలు కూడా మైసినియన్ కేంద్రాలకి ముడివేయబడ్డాయి, చరిత్ర ముందు కాలంలలో లంగర్ వెయ్యబడ్డాయి' అని ప్రొఫెసర్ మార్టిన్ నిల్సన్ అంటాడు. ఏది ఏమైన బర్కెట్ చెప్పిన ప్రకారం క్రేతాన్ కోట కాలం యొక్క చిత్ర సమూహారం ఈ సిద్ధాంతానికి ఎలాంటి ధృవీకరణ అందించలేదు.

నియోగి
9553097319

# సామాజిక జీవనంలో కుటుంబం

స్త్రీకి కుటుంబంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఆ ప్రాముఖ్యాన్ని చర్చించడానికి 'నెల్లూరు జిల్లా స్త్రీల పాటల్లో కుటుంబజీవనం' అనే అధ్యాయాన్ని ఏర్పరచడం జరిగింది. దీంట్లో జానపద కుటుంబం, మాతృస్వామ్యం, పితృస్వామ్యం, సమిష్టికుటుంబాల గురించిన వివరణ ఉంది. కుటుంబంలో స్త్రీ బాధ్యత, ఆమె ప్రవర్తనను గురించిన వివరణ, సంబంధ బాంధవ్యాల చర్చ ఉంది.

ఆది మానవులు వాళ్ళకు అందుబాటులోకి వచ్చిన వాటిని తింటూ జీవించారు. ఆహారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు. మొదట్లో చెట్ల తొర్రలు, కొండ గుహలు, బండ బొరియలే వాళ్ళ నివాసాలు, క్రమంగా బుద్ధివాకాసం చెందే క్రమంలో చెట్ల బెరళ్ళు, ఆకులు, జంతు చర్మాలు ఆ తరువాత బట్టలు కట్టుకోవడం నేర్చుకున్నాడు. ''పక్షులు జంతువుల్లాగే సృష్టిధర్మంచే స్త్రీ పురుషులు పరస్పరం ఆకర్షితులై స్వేచ్ఛాజీవనం గడిపేవారు. రానురాను నలుగురు కలిసి గడిపే వ్యవస్థ ఆవిర్భవించింది. సంతతిని పెంచుకోవడానికి స్త్రీ పురుషులు అంచెలంచెలుగా ఏర్పరచుకున్న వ్యవస్థే వివాహం''

ఈ వివాహ వ్యవస్థ కుటుంబానికి దారి తీసింది. ఆ కుటుంబంలో స్త్రీల హోదా, వాళ్ళ పాత్ర అర్థం చేసుకోవాలంటే సమిష్టికుటుంబం యొక్క సామాజిక, సాంస్కృతిక నేపథ్యం అర్థం చేసుకోవాలి.

### కుటుంబం

తల్లి, తండ్రి, వారి పిల్లలు, ఇంకా వాళ్ళ పోషణలో ఉండే ముసలి, ముతక అందరూ కలసి 'కుటుంబం' అని చెప్పవచ్చు. సామాజిక శాస్త్రాల ప్రకారం అది ప్రథమ ప్రాథమిక సమాజం. ''రక్త సంబంధము, శారీరకమైన దగ్గర సంబంధము అన్యోన్యాశ్రయము, నిరంతర సంబంధములు, సమానోద్దేశ్యములు మున్నగునవి కుటుంబ జీవన లక్షణములు. వ్యక్తి కుటుంబానికే చెందియుండును. అది అతని వ్యక్తిత్వమును తీర్చిదిద్దును''

''సామాజిక వ్యవస్థలో కుటుంబ వ్యవస్థను కీలకమైన స్థానం కలదు. ప్రతి వ్యక్తిని ఉత్తముడుగా తీర్చిదిద్దడంలో కుటుంబ పాత్ర ఎంతో కలదు. కుటుంబంలోని తల్లిదండ్రులు, ఇతర పెద్దలు పిల్లల్ని సక్రమ మార్గంలో నడిపించి చక్కదిద్దడానికి అవకాశం ఉంది.''


కుటుంబ వ్యవస్థ సంప్రదాయకంగా ముసలి వాళ్ళకి, శారీరక మానసిక వైకల్యం గల వాళ్ళకి, ఇతర సభ్యులకి భద్రత కలిగించి, వాళ్ళ అవసరాల్ని తీరుస్తుంది. తొలుత గుంపులు ఉండేవి. ఒక గుంపులోని పురుషులు, వేరొక గుంపులోని స్త్రీలతో జత కట్టుకుంటూ వచ్చేవారు. రానురానూ వ్యక్తుల గుర్తింపు కొరకు, తమ అవసరాన్ని తీర్చుకోవడానికి, కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి స్త్రీ పురుషులిరువురికి తోడు అవసరమైంది. ఆ అవసరమే కుటుంబంగా ఏర్పడింది. కాలానుగుణంగా వీళ్ళు నా పిల్లలు, వీళ్ళు నా వాళ్ళు, ఈమె నా భార్య, వీళ్ళు నా తల్లిదండ్రులు అనే ప్రాధాన్యత హెచ్చింది. ఆ రకంగా ఏర్పరచుకున్నదే వివాహంతో కూడుకున్న కుటుంబ వ్యవస్థ. 'కుటుంబం' అనేది సమాజంలో ప్రాథమికమైన ఒక సమూహం.

### కుటుంబంలోని రకాలు

కుటుంబ వ్యవస్థలో మాతృస్వామ్యం, పితృస్వామ్యం అనే రెండు రకాలు ప్రధానమైనవిగా చెప్పుకోవచ్చు. మాతృస్వామ్య కుటుంబంలో గానీ, పితృస్వామ్య కుటుంబంలో గానీ ఉమ్మడి కుటుంబ వ్యవస్థే ఉంటుంది.

### మాతృ స్వామ్యం

జనపదాల్లో మొట్టమొదటగా స్త్రీలకు అధిక ప్రాధాన్యం ఉండేది. అందుకే మొదటగా మాతృస్వామ్య కుటుంబాలు ఏర్పడ్డాయి. దానికి రుజువు మొదటగా గ్రామదేవతలు ఆవిర్భవించడమే. మాతృస్వామ్య కుటుంబాల్లో తల్లే కుటుంబ యజమానురాలు.



స్త్రీలలో కొన్ని ప్రకృతి సిద్ధమైన గర్భధారణ, ప్రసూతి, పసి పిల్ల పెంపకం స్త్రీల కర్తవ్యంగా ఉంది. కాబట్టి అట్లాంటి సమయాల్లో స్త్రీ పోషణ, రక్షణ భారాన్ని పురుషుడు వహిస్తూ వచ్చాడు. దాన్ని ఆసరాగా, తీసుకొని పురుషుడు స్త్రీని అబలగా పోషించబడేది అనే న్యూనతా భావంతో చూశాడు. తన ఆధిక్యతను స్త్రీపై పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించే బాధ్యతల్ని తీసుకొని స్త్రీపై అజమాయిషీ చేస్తూ వచ్చాడు. దాంతో పితృస్వామ్య వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. పురుషుడే గృహయజమాని. కుటుంబ సభ్యులంతా యజమాని ఆజ్ఞను పాటించాలి. అన్నీ వ్యవహారాలలో పురుషుడిదే పైచేయి. స్త్రీకి పాతివ్రత్యం అనే మహోన్నత కిరీటాన్ని పెట్టి ఆమె స్వేచ్ఛను పురుషుడు కొల్లగొట్టాడు. సాంఘీక కట్టుబాట్లకు గురిచేశాడు. పతివ్రతా ధర్మం కోసం సహగమనం లాంటి దురాచారాల్ని స్త్రీకి అంటగట్టాడు. ఈ వ్యవస్థ తాలూకు విలువలు సమాజంలో గౌరవించే పరిస్థితి ఏర్పడింది. రాను రానూ ఈ ''పాతివ్రత్యం అనే భావనని కలిగించాడు. ఇల్లాలు సంసారాన్ని అన్ని విధాలా చక్కదిద్దగల సమర్థురాలని పైకెత్తాడు. మాతృమూర్తి అనే ముసుగు కప్పి స్త్రీని పూర్తిగా అణగదొక్కుతూ వచ్చాడు.'' దీనికి తోడు హిందూమతం స్త్రీకి ఉన్నత స్థానాన్ని చూపిస్తూనే పరిమితమైన ఒక పరిధిని ఏర్పరచి ఆ రేఖలు దాటకుండా ముండ్ల కంచెలాంటి కట్టుదిట్టాలు పెట్టింది. దాన్ని అతిక్రమించితే బరితెగించిన ఆడదిగానూ, కులతగానూ జమకట్టి అలాంటి స్త్రీని సంఘానికి దూరంగా వెలివేసేవారు.

పితృస్వామ్యంలోని పురుషుడి ఆధిక్యత స్త్రీని అణగదొక్కుతూ వచ్చిన కఠినమైన ఆచార వ్యవహారాల్ని ఎత్తి చూపుతూ ''పితృస్వామ్యం వివాహం ద్వారా పురుషుడికి భార్య పేరుతో ఒక నమ్మకమైన బానిసను సంపాదించి పెడితే, స్త్రీకి భర్తపేరుతో దుర్మార్గుడైన యజమానిని ప్రసాదించింది'' అంటే భార్యాభర్తల సంబంధం యజమాని బానిసలతో పోల్చబడింది. కాలంలో మారిన పరిస్థితుల వల్ల సమానత్వం వృద్ధి చెంది స్త్రీకి కొంత ఆదరణస్థానం లభించింది.

డా॥ కస్తూరి వెంకట రమణమ్మ
7093239555


# అనుభవాలవెల్లడే కళ

ప్రకృతిలో మనిషి నిరంతర సంఘర్షణలో భావాలు ఉత్పన్నమవుతూంటాయి. భావప్రకటన కోసం జరిగే తీవ్రప్రయత్నమే కళగా రూపొందుతుంది. భావాలు కొత్తగా, బలంగా , అందంగా వ్యక్తీకరించాలనన్న తపన, వైవిధ్యం కోసం ఆరాటపడేమనస్తత్వం కళారూపాన్ని సృష్టిస్తుంది. భావుకుడైన మానవుడు చుట్టూగల పరిసరాలకు స్పందించి తనలోకి ఇముడ్చుకొని అనుభూతి పొందుతాడు. ఈ క్రమంలో అద్భుత మనఃప్రవృత్తిలో పులకించినప్పటి ముద్రలు, మానసిక స్థితులు, ముడ్స్‌ను కళాకారుడు ఒక రూపంలోకి మలచడానికి ప్రయత్నిస్తారు. ప్రేమించేదాన్ని మ రింత ప్రేమించేలాగ, ద్వేషించేదాన్ని మరింత ద్వేషించేలాగ ఆవిష్కరణ చేస్తాడు.

ఆదిమకాలం నండీ కూడా భావవ్యక్తీకరణంలో చిత్రకళ అన్నది ప్రధాన భూమిక పోషిస్తుంది. మనిషి పొందిన అనుభవాలను, ఆరాటాలను, కష్టసుఖాలను, వేదనలను ప్రకటించడంలో ఈ కళ తనదైన ముద్రను చూపగలుతోంది. భావవ్యక్తీకరణకు చిత్రకళ ఎంతో అనువైనదిగా చెప్పవచ్చు.

నాటి నుండి నేటి వరకు వానరుని నుండి నరుని వరకూ వచ్చిన ఈ ప్రస్థానంలో మానవునికి ''చిత్రకళ''అన్నది ఎంతంరకూ అవసరపడిందన్న ప్రశ్న వేసుకున్నప్పుడు మనకు మరొక ప్రశ్న తలెత్తుతుంది. అసలు ''చిత్రకళే ఎందుకు?'' ఇన్ని కళలు ఉన్నపుడు చిత్రకళ యొక్క అవసరం ఎందుకు. మానవునికిగల అవకాశాలు ఎంతవరకూ ఈ కళ పూరించగలదు వంటి ప్రశ్నలు తలెత్తుతాయి.

''విషయాన్ని నేను మాటలలో చెప్పగలిగితే ఇక రంగుల అవసరం ఎందుక? (if I would say it in words there would be no reasons to paint)



అంటారు. ఎడ్వర్డ్‌హూపర్. చిత్రకళా అవసరం గూర్చి చెబుతూ చిత్ర కళ అన్నది ఐదు విధాలుగా అవసరపడుతుంది అంటాడు. ఇతని ప్రకారం

- కళ అన్నది మానవ సహజ ప్రవర్తన,
- కళ అన్నది ఒక భావవ్యక్తికరణ,
- కళగొప్ప స్వాంతన,
- కళ కథ చెబుతుంది.
- కళ మన అనుభవాలు వెల్లడిస్తుంది. .. అంటూ వర్గీకరించాడు.

ప్రతి సంస్కృతిలోనూ, ప్రతిదేశంలోనూ , ప్రతిప్రాంతోనూ కళప్రస్తావన తప్పక వుండితీరుతుంది. అది ఆధునిక సమాజం కావచ్చు లేదా ఆదిమానవ సమాజం కావచ్చ. వారి భావవిస్కృతికి తగ్గ కళప్రస్తావన పునాదు తప్పక వుంటాయి. వాటి నుండి కాలానికి నిలబడగలిగినది. నిలచి, మిగిలినదంతా సమసిపోయి ఉంటుంది. అలా కాలనికి నిలిచిన దానికి తరువాతి కాలంలో మరికొంత చేరుతూ ఉంటుంది. ఇలా చేరిక అన్నది అనాటి ప్రజల యొక్క విశ్వాసాల మీద, నమ్మకాల మీద వారి జీవన విధానం మీద ఆధారపడి ఉంటుంది. అది రానురానూ వారియొక్క వ్యవహారశైలిగా రూపొంతుంది. ఇలా ఒక తరంవారి నుండి మరొకతరం వారికి అందున్న ఈ భావప్రసరణలో జరిగిన చేర్పులు, మార్పులు అన్నది మరిక కొత్త రూపాలను ఆస్కారం ఇస్తుంది. ఈ మార్పులు మంచికి జరిగితే మానవచైతన్యం కలుగుతుంది. అదే చెడు దిశలో జరిగితే మూఢవిశ్వాసాలు, అంధవిశ్వాసాలతో తరువాతి తరం అంధయుగంగా మారి, చైతన్యరహిత సమాజాలు ఏర్పడతాయి.

ఇక్కడొక ఉదాహరణను పరిశీద్దాం- ఆదిమానవుని జీవితాన్ని కూలం కషంగా పరిశోధించిన ఫ్రేజర్, మాలినోవ్‌స్కీ వంటివారు- కొన్ని ప్రాథమిక విషయాల గురించి చెప్పారు. ''అదిమ మానవునికి ప్రకృతి ధర్మాలు తెలియవు. అందువలన అతనికి వర్షం ఎపుడు, ఎందుకు పడుతందో, ఏరులు ఎందుకు పారుతున్నాయో తెలియదు. అతనికి తెలిసిదల్లా, తన అవసరం తీర్చునీటిని గురించే, ఇలా అతను నీరు యొక్క అవసరం తీరుచ్చకోవడానికి గానూ వర్షాల గురించిన పరిశీలన చేశాడు. వర్షం కురిసేముందు ఉరుములు రావడం అన్న విషయాన్ని తొలిగా కనుగొన్నడు. అతనిలో అంతఃచైతనన్యం మొదలు తను వరాలు రావలని కోరువున్నప్పుడు అలా ఉరుములు వలే శబ్దాలు చేశావాడు. ఈ శబ్దం నాటి కాలం ''మంత్రం'' ఇలా కొంత నాగరిక అలవడిన తరువాత ఇది దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి చేసే ప్రార్థన అయింది. అంటే అతని పూర్వపు తొలినాటి ఉరుములయొక్క శబ్దం నుండి, క్రమంగా ఆ ఉరుములు సృష్టిస్తున్న ఒక వ్యక్తి లేదా దేవుడు యొక్క రూపం అన్నది ఆవిష్కరించబడింది. క్రమంగా ఇది ప్రార్థన అయింది. దీంతో ఉరుముల దేవుని యొక్క రూపం చిత్రాలుగా, శిల్పాలుగ మలచబడి అతన్ని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నం జరిగింది.

ఎల్ .ఆర్. వెంకట రమణ
9866158908

# అంచనాలు భయపెడుతుంటాయి


ప్రభాస్

కథానాయకుడిగా పేరు తెచ్చుకోవడం ఒకెత్తయితే...దాన్ని నిలబెట్టుకునేందుకు శ్రమించడం మరో ఎత్తు. స్టార్ డమ్ కొనసాగించడంలో తీవ్రమైన ఒత్తిడే ఉంటుంది. దాన్ని అధిగమిస్తూ మంచి కథల్లో నటిస్తూ ముందుకెళ్లిన వాళ్లే వరుస విజయాలు సాధిస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి చిత్రానికీ అభిమానులను సంతృప్తి పరచాలి. ఎందుకంటే కొత్త సినిమా వస్తుందంటే మరింత ఎక్కువగా వాళ్లు అంచనాలు పెట్టుకుంటారు. తానూ ఇదే తరహాలో ఆలోచిస్తుంటానని చెబుతున్నారు యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్. పదిహేడు చిత్రాల్లో నటించిన ఈ స్టార్...బాహుబలి రెండు భాగాలతో భారతీయ చలన చిత్ర వసూళ్లలో కొత్త చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం సాహో చిత్రంతో మరో సాహసం చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దుబాయ్‌లోని బుర్జ్ ఖలీపా సమీపంలో జరుగుతోంది. సినిమాకు సంబంధించిన కీలక పోరాట సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలకే పాతిక కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారట. హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ సాహోకు పనిచేస్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న నాలుగో షెడ్యూల్‌తో సినిమా పూర్తవుతుంది. ఇన్నేళ్ల నట ప్రయాణంలో, ఇంత స్టార్ డమ్ సాధించిన తర్వాత కూడా ప్రతి చిత్రానికీ ఉత్కంఠగానే ఉంటుందని చెబుతున్నారు ప్రభాస్. ముఖ్యంగా అభిమానుల అంచనాలు అందుకుంటానా లేదా అనే విషయంలో ఎక్కువ భయమేస్తుంది అంటారీ యంగ్ రెబల్‌స్టార్.

# అమ్మ గర్వపడేలా నటిస్తా...

**- శ్రీదేవి కూతురు జాన్వి కపూర్...**

భారతీయ అగ్ర నాయిక శ్రీదేవి మరణం ఆమె అభిమానులను, అశేష ప్రేక్షకులను, పరిశ్రమను బాధించింది. ఆమె కుటుంబ సభ్యులను కుంగదీసింది. ముఖ్యంగా తల్లి చాటు బిడ్డలుగా పెరిగిన ఇద్దరు కుమార్తెలు జాన్వి, ఖుషీలకు తీరని దుఖానికి గురిచేసింది. జాన్వి నాయికగా తెరంగేట్రం చేస్తున్న సినిమా విడుదల కాకముందే శ్రీదేవి ఈ లోకాన్ని వీడిపోవడం కలచివేసింది. తల్లిని గుర్తు చేసుకుంటూ ఆ బాధను దిగమింగుతూ జాన్వి లేఖ రాశారు. అందులో....అమ్మా మా సంతోషానికి కారణం నువ్వు. మాకోసం సర్వస్వం త్యాగం చేశావు. నువ్వు మేము గర్వపడేలా చేశావు. నువ్వు గర్వపడేలా నేను నటిస్తాను. కళ్లు మూస్తే నీ జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. మా కోసం జీవించావు. ప్రేమ మూర్తివి అందుకే నిన్ను దేవుడు తీసుకెళ్లాడు. మాకు నువ్వు లేని లోటు తీరనిది. తల్లిగా నీ సంరక్షణను ఇంకా అనుభూతి చెందుతూనే ఉన్నాను. మాకు ఏ కష్టాలు రాకుండా అడ్డుకున్నావు. మాలో నువ్వే నిండి ఉన్నావు. నువ్వు మాపై చూపిన ప్రభావం చాలా గొప్పది. మేము జీవించడానికి ఆ ప్రభావం చాలు. నన్ను ఏవరేమన్నా నాకు బాధనిపించలేదు. ఎందుకంటే నా పక్కన నువ్వున్నావు. నేను ఎవరిపైనా ఆధారపడలేదు. ఎందుకంటే నాకు కావాల్సిన ఒకే ఒక వ్యక్తివి నువ్వు. అని జాన్వి పేర్కొంది.



# ఈ నెల 9న ఏ మంత్రం వేశావే...

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ఏ మంత్రం వేశావే. శివానీ సింగ్ నాయికగా నటించింది. గోలీసోడా ఫిలింస్ పతాకంపై శ్రీధర్ ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. మల్కాపురం శివకుమార్ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఏ మంత్రం వేశావే చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ....నేడు ప్రపంచమంతా అరచేతిలోని ఫోన్‌లోకి వచ్చేసింది. ఇలాంటి సమయంలో యువత ఎక్కువగా ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడుతున్నారు. వాస్తవంగా తమ చుట్టూ ఇంటిలో, సమాజంలో ఏం జరుగుతుందో ఆలోచించలేకపోతున్నారు. చివరకు అన్ని రకాలుగా భవిష్యత్‌నూ కోల్పోతున్నారు. ఇలాంటి ఓ యువకుడిని అతనికి పరిచయమైన యువతి ఎలా మార్చింది. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎంత బాగా చూపించింది అనేది కథాంశం. మూస చిత్రాలకు భిన్నమైన నేపథ్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. పిల్లలు పెద్దలకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. అన్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ...తెలుగులో అతి తక్కువ సమయంలో ఎక్కువ పేరు తెచ్చుకున్న కథానాయకుడు విజయ్ దేవరకొండ. అర్జున్ రెడ్డి తర్వాత ప్రేక్షకుల్లో స్టార్ హీరోగా గుర్తింపు అందుకున్నారు. ఏ మంత్రం వేశావే పై అంచనాలు బాగా ఉన్నాయి. ఈ నెల 9న ఈ చిత్రాన్ని తెరపైకి తీసుకురావాలనుకుంటున్నాం. అత్యధిక థియేటర్‌లలో విడుదల చేస్తున్నాం. ఇండస్ట్రీలో కొంతమంది పెద్దల అండతోనే డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్‌లు దురాశకు పోతున్నారు. చిన్న నిర్మాతలకు నష్టాలు తీసుకొస్తున్నారు. అన్నారు.


శ్రీధర్, శివకుమార్

# రైతు దుస్థితిని చూపిస్తూ..

సామాజిక చిత్రాల రూపకర్త, దర్శక నిర్మాత, నటుడు ఆర్ నారాయణ మూర్తి స్నేహ చిత్ర పతాకంపై రూపొందిస్తున్న తాజా చిత్రం అన్నదాతా సుఖీభవ. ఈ చిత్ర విశేషాలను నారాయణమూర్తి పాత్రికేయులతో పంచుకున్నారు. నారాయణ మూర్తి మాట్లాడుతూ...నేడు రైతన్న తన ఉనికిని కోల్పోతున్నాడు. అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి ఇవాళ ఎలా ఉంది. దేశానికి వెన్నెముక అని చెప్పుకునే రైతు వెన్నెముక విరిగిపోతోంది. రైతే రాజు అనే నానుడి అవాస్తమవుతోంది. గిట్టుబాటు ధర లేకపోవడం రైతును ఆర్థికంగా కుంగదీస్తోంది. 2009 నుంచి నేటి వరకు మూడు లక్షల ఇరవై ఐదు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తను బతికి బతికించాల్సిన రైతు...ఆత్మహత్య చేసుకోవడం దౌర్భాగ్యం...రైతుకు ఉన్న పంటపై 50 శాతం అదనంగా ఇవ్వాలని స్వామినాథన్ కమీషన్ ప్రతిపాదన చేసింది. అప్పుడే రైతు బాగుంటాడని తేల్చారు. అయితే ఇప్పటిదాకా ఏ కేంద్ర ప్రభుత్వాలు ఆయన ప్రతిపాదనలు అమలు చేయలేదు. స్వామినాథన్ కమీషన్ సిఫారసులు అమలు చేయాలన్నదే మా అన్నదాతా సుఖీభవ చిత్ర నేపథ్యం. కర్షకుడి కుటుంబంలో పుట్టడమే నేరంగా భావిస్తున్న రోజులివి. నేడు సామాజికంగా వెనకబడిన వర్గం రైతాంగమే. వ్యవసాయం దండగ కాదు పండగ అని మా చిత్రంలో చెబుతున్నాం. ఈ చిత్రాన్ని మా గురువు దాసరి గారికి అంకితమిస్తున్నాను. అన్నారు.


నారాయణమూర్తి

# ఘస్టులుక్కు సోమవారం... మాట కలిపే మంగళవారం

ఘస్టులుక్కు సోమవారం...మాట కలిపే మంగళవారం అంటూ సాగే ఛల్ మోహన్‌రంగ చిత్రంలోని రెండో పాటను శనివారం విడుదలచేశారు. నితిన్, మేఘఆకాష్ జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, ఎన్.సుధాకర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఇప్పటికే చాలాభాగం చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలను మొదలుపెట్టేశారు. ఇటీవల విడుదలచేసిన టీజర్, గ ఘ మేఘ అంటూ మెలోడీగా సాగే తొలిపాటకు మంచి స్పందన లభించిందని నిర్మాతలు వెల్లడించారు. మంచి డ్యాన్స్ నెంబర్ అయిన రెండో పాట సైతం ప్రేక్షకులను విశేషంగా అలరింపజేస్తుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తంచేశారు. సంగీత దర్శకుడు తమన్ అందించే ట్యూన్స్‌కు ఎంత ప్రాముఖ్యం ఉంటుందో వాయిద్యాలకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుందని, ఆ సంగీతానికి మంచి సాహిత్యం తోడైతే జన హృదయాలలో ఆ పాట ఎక్కువ రోజులు నిలుస్తుందని, అందుకే ఆయన పాటలు వినగానే ప్రేక్షకుల మదిని దోచుకుంటాయని వారు చెప్పారు. వారంలోని ఏడు రోజుల్లో ఒక్కోరోజుకి ఒక్కో ప్రత్యేకత ఉందంటూ తనదైన చమత్కారాన్ని ఉపయోగించి, సాహిత్య అవార్డు గ్రహీత కేదారనాథ్ ఈ పాటను రచించగా, నాకాష్ అజీజ్ ఆలపించారని వివరించారు. దర్శకుడు కృష్ణచైతన్య మాట్లాడుతూ, సంగీత, సాహిత్యాల కలబోత చిత్రంలోని పాటలు అని అన్నారు. నిర్మాత ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఏప్రిల్ 5న సినిమాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, షమ్మి సాయి, రాజశ్రీనాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బాల నటీనటులు హాసిని, కృతిక, జాయ్, లిఖిత్, స్నేహిత్, స్కందన్ తదితరులు తారాగణం.

ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎన్.నటరాజ సుబ్రమణియన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు: శేఖర్ వి.జె., పోరాటలు: స్టంట్ సెల్వ, రవివర్మ, సమర్పణ: శ్రీమతి నిఖితారెడ్డి, నిర్మాత: ఎన్.సుధాకర్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కృష్ణచైతన్య.


నితిన్

# వారు దిగి వచ్చేవరకు పోరాటం

**-ఆర్.కె.గౌడ్**

సినిమాల ప్రదర్శనల విషయంలో డిజిటల్ ప్రొవైడర్స్ అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తూనే వచ్చాం. ఇప్పుడు దక్షిణాదికి చెందిన నాలుగు భాషల సినీ పరిశ్రమలు ఒకే తాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడి, ధరలు తగ్గించేంతవరకు పోరాటం చేయాలని నిర్ణయించడం శుభపరిణామం. మేము కూడా వారికి అన్నివిధాలుగా మద్దతు ప్రకటిస్తూ...వారితో పాటు ముందుకెళ్తున్నాం అని తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డిజిటల్ ప్రొవైడర్స్ దిగి వచ్చేవరకు అంతా కలిసికట్టుగా ఉండాలని కోరుకుంటున్నా. థియేటర్ల బంద్ వరకు పరిశ్రమలు వచ్చాయంటే డిజిటల్ రేట్ల వల్ల నిర్మాతలు ఎంత నష్టపోతున్నారో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చునని, దీనివల్ల ఎన్నో చిత్రాలు విడుదలకు నోచుకోకుండా ఉన్నాయి. మా డిమాండ్స్ తీరేవరకు థియేటర్ల బ ంద్ ఆగదు. ఇందుకు థియేటర్ల వారు సహకరించాలని కోరుతున్నా అని అన్నారు. అదే చాంబర్ కార్యదర్శి సాయివెంకట్ మాట్లాడుతూ, డిజిటల్ ప్రొవైడర్లు తమ వైఖరి మానుకోవాలని అన్నారు.


సాయివెంకట్, రామకృష్ణగౌడ్

## కొనసాగుతున్న థియేటర్ల బంద్

రెండు తెలుగు రాష్ట్రాలలో సినిమా థియేటర్ల బంద్ రెండో రోజు శనివారం కూడా కొనసాగుతోంది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల వైఖరికి నిరసనగా శుక్రవారం ఈ బంద్ మొదలైన సంగతి తెలిసిందే. మొదటిరోజు సాధారణ థియేటర్లతో పాటు మల్టీప్లెక్స్‌లు కూడా మూతపడగా, శనివారం మల్టీప్లెక్స్‌లు పాక్షికంగా బంద్‌లో పాల్గొన్నాయి. మల్టీప్లెక్స్‌లో తెలుగు సినిమాలు కాకుండా ఆంగ్ల, హిందీ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. మరోవైపు నిర్మాతల మండలి, డిజిటల్ ప్రొవైడర్లకు మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. వారి మధ్య ఎప్పుడు సయోధ్య కుదిరితే అప్పట్నుంచే థియేటర్లు తెరుచుకోనున్నాయి.

# నాగ అన్వేష్ కొత్త చిత్రం ప్రారంభం

యువ కథానాయకుడు నాగ అన్వేష్ నటిస్తున్న కొత్త చిత్రం ఏ నిమిషానికి ఏమి జరుగునో ప్రారంభోత్సవం జరుపుకుంది. గణేష్ క్రియేషన్స్ పతాకంపై లండన్ గణేష్, సీహెచ్‌వీ నాగేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకృష్ణ గొర్లె ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఏ నిమిషానికి ఏమి జరుగునో చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. ముహూర్త సన్నివేశం అనంతరం నిర్మాత లండన్ గణేష్ మాట్లాడుతూ...లండన్ నివాసిని కాబట్టి లండన్ గణేష్ అంటారు. డిసెంబర్‌లో ఈ సినిమా బృందాన్ని కలిశాను. మా దర్శకుడు మంచి కథతో సినిమా చేయబోతున్నారు. కొత్త తరహా చిత్రమవుతుందని ఆశిస్తున్నాం. అన్నారు. దర్శకుడు శ్రీకృష్ణగొర్లె మాట్లాడుతూ...సైన్స్ ఫిక్షన్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఆదిత్య 369, పుష్పక విమానం తరహాలో ఉంటుంది. మూడు పాటలుంటాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. అన్నారు. కథానాయకుడు నాగ అన్వేష్ మాట్లాడుతూ...చాలా కొత్త తరహా కథ. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ముగింపు వరకు ఏ జరుగుతుందో కథ విన్న నాకే అర్థం కాలేదు. ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రమవుతుంది. ముహూర్తం బాగుందని చిత్రాన్ని ప్రారంభించాం. వచ్చే నెల చిత్రీకరణ ఉంటుంది. అన్నారు.

